శనివారం
12•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 66
• పేజీలు : 20 + 24

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అద్భుత అవకాశం
GREAT FREEDOM SALE
UP TO 66% OFF
*conditions apply
సరికొత్త స్టాక్‌పై. అన్ని రకాల వస్త్రాలపై...
4 DAYS ONLY
AUGUST 12th TO 15th
SOUTH INDIA shopping mall
Hyderabad | Secunderabad
PAN AMERICA
Park Avenue
Wrangler
spykar
Classic Polo
MONTE CARLO
Pepe Jeans
INDIAN TERRAIN
BLACKBERRYS
Levi's
KILLER
mufti
Louis Philippe
VAN HEUSEN
Allen Solly
ROCKSTAR JEANS
Kimoro
DIVYA PRINTS
ROSE
Ambica
Shilpkala
Kaveri
Subhash SAREES PVT. LTD.
VIPUL

శనివారం
12•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

విశ్వనగరానికి నక్షా

30 ఏండ్ల అవసరాలకు ప్రణాళిక.. పదేండ్లకు కార్యాచరణ

హైదరాబాద్ నగరాభివృద్ధిపై సమీక్షలో సీఎం కేసీఆర్

- ఆడిట 1గాడా| ్వటిను చేడాబ్వాట్లు
- మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి
- నగర తాగునీటి అవసరాలకు రెండు డెడికేటెడ్ రిజర్వాయర్లు
- నగర పరిధిలోని అటవీ భూముల్లో పెద్దసంఖ్యలో మొక్కలు నాటాలి
- ఇంటి అనుమతులివ్వడంలో తప్పులు చేస్తే కఠినచర్యలు
- నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యానికి 15 రోజుల్లోగా బస్తీ కమిటీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

విశ్వనగరంగా రూపుదాల్చనున్న హైదరాబాద్‌కు రానున్న 30 ఏండ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక సిద్ధంచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఆదేశించారు. దీనిలో భాగంగా రానున్న పదేండ్లకు కార్యాచరణను రూపొందించుకోవాలని చెప్పారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటినుంచే ప్రతి పనిని చేసుకుంటూ పోవాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్ నగరాభివృద్ధిపై ప్రగతిభవన్‌లో శుక్రవారం సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం నగరాభివృద్ధిపై అధికారులకు పలు సూచనలిచ్చారు.

30 ఏండ్ల కోసం ఇప్పటినుంచే ఆలోచన

'హైదరాబాద్ నగరం శరవేగంగా పెరుగుతున్నది. పెరిగే జనాభాకు అనుగుణంగా అవసరాలు కూడా పెరుగుతాయి. వీటిని దృష్టిలో పెంచుకొని మనం ప్రణాళికలు వేయాలి. రాబోయే 30 ఏండ్లకు ఈ నగరం ఎలా ఉంటుంది? జనాభా ఎంత పెరుగుతుంది? అప్పుడు ఏర్పడే అవసరాలు ఏమిటి? అనే కల్పన ఉండాలి. దానికి అనుగుణంగా ఇప్పటినుంచే ఏర్పాట్లు ఎలాచేయాలి? అని

మిగతా 4వ పేజీలో





శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ దర్బార్ హాలులో వెంకయ్యనాయుడుతో ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

టీం ఇండియా స్ఫూర్తితో ముందుకెళుదాం

కలల సాకారం దిశగా సాగుదాం ▪ బాధ్యతాయుతంగా వ్యవహరిద్దాం

రాజ్యసభ చైర్మన్‌గా ఉపరాష్ట్రపతి వెంకయ్య తొలి పలుకులు

7

వరంగల్ మెగాటెక్స్‌టైల్ పార్కుకు **16న శంకుస్థాపన**

5



శుక్రవారం తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ మూడో సర్వసభ్య సమావేశాన్ని జ్యోతివెలిగించి ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కే తారక రామారావు. చిత్రంలో టీబీఎఫ్ అధ్యక్షుడు సీ ప్రభాకర్‌రావు తదితరులు కూడా ఉన్నారు.

నగరం చుట్టూ శివారు పట్టణాలు

- ఇది ముఖ్యమంత్రి కేసీఆర్ కల
- 427 ఏండ్ల క్రితం ముగ్గుపోసుకున్న హైదరాబాద్
- ప్రణాళికాబద్ధ అడుగులతోనే విశ్వనగరం
- తెలంగాణ వచ్చి మూడేండ్లే అయినా.. పాఠాలు చెప్తున్నాం
- సీఎం ప్రణాళికాయుత చర్యలే అందుకు కారణం
- తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో కేటీఆర్

4



శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ ఆఫీసు సమీపంలో ఏర్పాటుచేసిన సభాస్థలి వద్ద కోదండరాంకు వ్యతిరేకంగా ఫ్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న రైతులు, టీఆర్ఎస్ నాయకులు

కోదండరాం గోబ్యాక్!

కామారెడ్డి జిల్లాలో చేదు అనుభవం

అడ్డుకున్న రైతులు, ఉద్రిక్తత

కామారెడ్డి, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ కోదండరాంకు కామారెడ్డి జిల్లాలో చేదు అనుభవం ఎదురైంది. హైదరాబాద్ నుంచి ఉదయం భిక్కనూరు మండలం బస్వాపూర్‌కు కోదండరాం చేరుకోగానే జేఏసీ నాయకులను రైతులు అరగంటపాటు అడ్డుకున్నారు. కోదండరాం గో బ్యాక్ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టును అడ్డుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఏజెంటుగా కోదండరాం పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో జేఏసీ నాయకులకు, పోలీస్‌లకు, రైతులకు తోపులాట జరిగింది. కోదండరాం అక్కడి నుంచి భిక్కనూరు చేరుకుని సమావేశంలో మాట్లాడారు. అనంతరం పోలీసులు భిక్కనూరు ఠాణాకు కోదండరాంను, జేఏసీ నాయకులను తరలించారు. పోలీస్‌స్టేషన్ వద్ద నాలుగు గంటల పాటు జేఏసీ నాయకులు, రైతుల మధ్య తోపులాట జరిగింది. ఎస్పీ శ్వేతారెడ్డి, డీఎస్పీ ప్రసన్నరాణి చేరుకొని పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భగా ఆందోళనకారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతుల బతుకులు బాగుపడుతున్నాయని జీర్ణించుకోలేని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోదండరాంను అడ్డుపెట్టుకొని అభివృద్ధిని అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. గత పాలకులు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా దోచుకున్నారని రైతులు ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మూడేండ్ల పాలనలో గత 70 ఏండ్లలో జరుగని అభివృద్ధిని చేసి చూపిస్తున్నారని రైతులు అన్నారు. టీఆర్ఎస్‌ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. మధ్యాహ్నం 3 .47 గంటలకు కోదండరాంను బందోబస్తు మధ్య హైదరాబాద్‌కు తరలించారు.

కామారెడ్డిలోనూ నిరసనల వెల్లువ

కోదండరాం భిక్కనూరు నుంచి కామారెడ్డికి వస్తున్నారన్న సమాచారంతో రైతులు, టీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ ఆఫీసు వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకొని నిరసనలు తెలిపారు. రైతులు కోదండరాం గో బ్యాక్ అంటూ నినాదాలుచేశారు. సభా వేదిక నుంచి కొంత మంది విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకారులను రౌడీలు, గూండాలు అనడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే రెచ్చగొడుతున్నారని ఆరోపిస్తూ రైతులు వేదికపైకి దూసుకెళ్లారు. టెంట్‌ను, కూల్చివేశారు. ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు. కోదండరాం యాత్రను నిరసిస్తూ బాన్సువాడలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

విశ్వనగరానికి నక్షా

మూడోపేజీ తరువాయి...

ఆలోచించాలి. కనీసం పదేండ్ల కోసం కార్యాచరణ ప్రణాళిక వేయాలి. ఇప్పటినుంచి చేసే ప్రతి పని ఆ ప్రణాళికలో భాగమై ఉండాలి' అని ముఖ్యమంత్రి నిర్దేశించారు. 'ప్రజలకు నిరంతరం కరెంటు అందించేందుకు మొదటి ప్రాధాన్యం ఇచ్చాం. అందులో విజయం సాధించాం. మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. రైతులకు సాగునీరు అందించేందుకు ప్రాజెక్టులు కడుతున్నం. విద్యుత్, నీటిపారుదల ప్రాజెక్టులు బాగా సాగుతున్నాయి. ఇక ప్రజలకు మౌలిక వసతులు అందించే విషయంలో ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తుంది. తెలంగాణలో నగరాలు, పట్టణాల్లో నివసించే జనాభా విపరీతంగా పెరుగుతుంది. దీనికి అనుగుణంగా వసతులు కల్పించాలి. హైదరాబాద్ నగరంలోనే కోటి జనాభా ఉంది. ఈ నగరంపై ఎక్కువ దృష్టి పెట్టాలి. ప్రణాళికాబద్ధంగా పనులు చేసుకుంటూ పోవాలి' అని సీఎం అన్నారు. సమావేశంలో మంత్రులు కే తారక రామారావు, టీ హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, రామకృష్ణ, నవీన్ మిట్టల్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, వాటర్ వర్క్స్ ఎండీ దానకిశోర్, పీసీసీఎఫ్ ఝా, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


శుక్రవారం హైదరాబాద్ నగర అభివృద్ధిపై ప్రగతిభవన్‌లో సమీక్షిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు కేటీఆర్, హరీశ్ తదితరులు

సమీక్షలో ముఖ్యమంత్రి చేసిన సూచనలు..

- హైదరాబాద్ నగరానికి మంచినీటి సరఫరాకోసం శాశ్వత ప్రాతిపదికన రెండు రిజర్వాయర్లు నిర్మించాలి. గోదావరి నది మీద కడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టుద్వారా ఒక రిజర్వాయర్, కృష్ణా మీద కడుతున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంద్వారా మరో రిజర్వాయర్ నింపాలి. గ్రావిటీద్వారా నీటిని సరఫరాచేసి, 10-15 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా రిజర్వాయర్లు నిర్మించాలి. దీనికోసం సాంకేతిక అంశాలను పరిశీలించి, వెంటనే పనులు ప్రారంభించాలి.
- హైదరాబాద్ నగరం కాంక్రీట్ జంగిల్‌లా మారిపోతున్నది. నగరంలో పచ్చదనాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. నగరం చుట్టూ ఉన్న వేల ఎకరాల అటవీ భూముల్లో విరివిగా చెట్లు పెంచాలి. నాగోలు, నారపల్లి ప్రాంతాల్లో దాదాపు ఏడెనిమిది వేల ఎకరాల అటవీ భూమి ఉంది. శంషాబాద్, నర్సాపూర్, శిశంపేట ప్రాంతాల్లో దాదాపు 40వేల ఎకరాల అటవీ భూమి ఉంది. నగరంలో చాలా ప్రాంతాల్లో అటవీ భూమి విస్తరించి ఉంది. వీటన్నింటిలో మొక్కలు నాటాలి. వాటిని పెంచాలి. ఔటర్ రింగురోడ్డు పొడవునా ఇరువైపులా వేప, గుల్మోర్, రావి చెట్లు నాటాలి. ఢిల్లీలో లెక్క హైదరాబాద్‌లో పచ్చదనం ఉండాలి. మున్సిపల్ శాఖ మంత్రి పేషీలో కేవలం నగరంలో పచ్చదనం పెంచే కార్యక్రమం పర్యవేక్షించేందుకు ఒక ఐఎఫ్ఎస్ అధికారిని ప్రత్యేకంగా నియమించాలి.
- నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంచాలి. అందుకోసం బస్తీ కమిటీలు వేయాలి. ప్రతి డివిజన్‌కు పది కమిటీలు ఉండాలి. 15 రోజుల్లోగా కమిటీలను నియమించాలి.ప్రజలందరినీ కలుపుకొని బస్తీలో పచ్చదనం పెంచడం, పరిశుభ్రత కాపాడటం తదితర విషయాల్లో కమిటీలు పనిచేస్తాయి.
- గండిపేట, హిమాయత్‌సాగర్, శామీర్‌పేటతోపాటు నగరంలో, నగరం చుట్టూ ఉన్న చెరువుల్లో పారిశ్రామిక వ్యర్థాలు, ఇతర కాలుష్యం చేరకుండా చర్యలు తీసుకోవాలి.
- నగరంలో కొత్తగా కట్టే నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలో అధికారులు నిబంధనలు పాటించాలి. అనుమతులిచ్చే సందర్భంలో తప్పులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.
- సబర్మతి రివర్ ఫ్రంట్ తరహాలో మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధిచేయాలి. మూసీనదిలో మురుగు చేరకుండా చూడాలి. మూసీకి రెండువైపులా ఉద్యానవనాలు అభివృద్ధిచేయాలి. మూసీకి రెండు వైపులా ఉన్న ఓఆర్ఆర్‌ను కలిపేలా మూసీ నదిపై రహదారి నిర్మించాలి. మూసీ నది దాటడానికి పలుచోట్ల వంతెనలు నిర్మించాలి.
- నగరంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలి. ఇండ్లపై తీగలను తొలిగించాలి.
- ఎస్సార్డీపీలో భాగంగా నిర్మించే రహదారుల విషయంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. ఉప్పల్‌లాంటి ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అండర్‌పాస్‌లు నిర్మించే సందర్భంలో వర్షం, వరద నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు సాంకేతిక జాగ్రత్తలు తీసుకోవాలి.


శుక్రవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న హోంమంత్రి నాయిని

గణేశ్ ఉత్సవాలకు సర్వం సన్నద్ధం

35వేల మంది పోలీసులతో బందోబస్తు

అధికారులు, ఉత్సవ కమిటీలతో సమీక్షించిన హోంమంత్రి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు హోంశాఖమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకొనేలా జీహెచ్ఎంసీ పరిధిలో 35 వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. వినాయక చవితి పండుగ, గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లపై శుక్రవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో హోం మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది గణేశ్ ఉత్సవాలు, బక్రీద్ పండుగ కలిసి వస్తున్నాయని, రెండు పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకొనేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తిచేశారు. నిమజ్జనం సెప్టెంబర్ 5వ తేదీన ఉంటుందని, ఉదయం 7 గంటల నుంచే విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలని నిర్ణయించామన్నారు. ఖైరతాబాద్ వినాయకుడిని సైతం అదే రోజు సాయంత్రానికి నిమజ్జనం పూర్తయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆర్టీసీ సహాయంతో అదనంగా 500 బస్సులు రాత్రి సమయంలోనూ నడుపుతామన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిమజ్జనం కోసం మొత్తం 160 క్రేన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమీక్షలో ఎమ్మెల్యేలు రాజాసింగ్, స్టీఫెన్సన్, జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా, హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్‌త్రివేదీ, దేవాదాయశాఖ కార్యదర్శి శివశంకర్, ఫైర్ సర్వీసెస్ డీజీ రాజీవ్ రతన్, శాంతిభద్రతల అడిషన్ డీజీ అంజనీ కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్‌శాండిల్యా, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టీచర్ల ఖాళీల భర్తీపై 17న నిర్ణయం

అధికారులతో చర్చించిన డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో వేగం పెరిగింది. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్‌రూల్స్ అమల్లోకి వస్తున్న నేపథ్యంలో.. టీచర్ పోస్టుల భర్తీలో నూతన మార్గదర్శకాలు అమలుచేసే అంశంపై శుక్రవారం పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం కడియం సమావేశమయ్యారు. సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో టీచర్ పోస్టుల భర్తీ అంశంలోని లోటుపాట్ల గురించి చర్చించారు. ఈ నెల 17న మరోసారి సమావేశం ఏర్పాటుచేసి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ లోపు ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్‌రూల్స్ అమలులో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు సాధారణ పరిపాలనశాఖ, న్యాయశాఖ నుంచి ఆమోదం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తర్వాత 8,792 టీచర్ పోస్టుల ఖాళీల వివరాలను టీఎస్‌పీఎస్సీకి పంపించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నియామకాల్లో వివాదాలు తలెత్తకుండా ఎన్‌సీటీఈ నిబంధనలను అమలుచేయాలన్నారు. ఏకీకృత సర్వీస్‌రూల్స్‌పై ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల్లోని మూడు జేఏసీలతో సమావేశమై అభిప్రాయాలను స్వీకరించి పరిగణనలోకి తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు.

జూన్ 1 నుంచే నూతన విద్యా సంవత్సరం

రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం జూన్ 1 నుంచే ప్రారంభం కానున్నది. 2017-18 విద్యాసంవత్సరం 12 ఏప్రిల్ 2018 వరకే కొనసాగనున్నది. 23 ఏప్రిల్ 2018 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. ఈ మేరకు నూతన క్యాలెండర్ ఫైల్‌పై డిప్యూటీ సీఎం సంతకం పెట్టనున్నారు.


కేంద్రమంత్రి హర్షవర్ధన్‌తో భేటీ అయిన రాష్ట్ర మంత్రి జోగురామన్న, ఎంపీ నగేశ్

'ఝురి' పశువుల ఫాంను నెలకొల్పండి

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ జిల్లాకే పరిమితమైన ఝురి జాతి పశువుల పెంపకం కోసం వారసత్వ పశువుల ఫాంను నెలకొల్పాలని కేంద్ర పర్యావరణ, సైన్స్‌అండ్ టెక్నాలజీ మంత్రి హర్షవర్ధన్‌ను రాష్ట్ర అటవీశాఖ మంత్రి జోగురామన్న కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్రమంత్రితో ఆయన భేటీ అయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో దీర్ఘకాలం నుంచి గిరిజనులు, దళితులు ఝురి రకం ఆవులు, ఎద్దులను పెంచుతున్నారని.. స్థానిక జాతిగా గుర్తించి అభివృద్ధి చేయడానికి ఫాం నెలకొల్పాలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.1,100 కోట్ల కాంపా నిధులు విడుదలచేయాలని కోరారు. అనంతరం జోగు రామన్న మీడియాతో మాట్లాడుతూ ఝురి ఫాం నెలకొల్పడానికి రూ.190 కోట్ల ఖర్చవుతుందని, కేంద్రం రూ.125 కోట్లను వాటాగా ఇస్తుందని చెప్పారు. మిగిలినదాన్ని రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థ భరించాల్సి ఉంటుందన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో దేశవాళి పశువుల అభివృద్ధి కోసం మూడు ఫాంలకు అనుమతి మంజూరవగా, అవి అవశేష ఏపీ పరిధిలోకి వెళ్లిపోయాయని చెప్పారు. రాష్ట్రంలో ఈ తరహా ఫాం లేకుండాపోయిందన్నారు. కాంపా నిధులను పదిశాతానికి మించి ఇచ్చేందుకు నిబంధనల ఖరారులో జాప్యం జరుగుతున్నదని, కొత్త చట్టం ప్రకారం 30 శాతంవరకు నిధులు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. నిబంధనలపై స్పష్టత వచ్చాక నిధులు విడుదల చేస్తామని కేంద్ర మంత్రి హామీఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'టీఎస్‌కాస్ట్'కు కేంద్రం ఇవ్వాల్సిన రూ. 2.2 కోట్లను విడుదల చేయాలని కోరామన్నారు.

లోకం పోకడ



పేషెంటు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు.. అనవసరంగా జీఎస్టీ గురించి మాట్లాడి స్పృహ కోల్పోతే నా బాధ్యత కాదు!!

ముహూర్తం

సూర్యోదయం: 6.02 గంటలకు

సూర్యాస్తమయం: 6.40 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం పంచమి రాత్రి 10.59 వరకు, తదుపరి షష్ఠి. నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉదయం 6.15 వరకు, తదుపరి రేవతి. అమృత ఘడియలు: తె. 1.27 నుంచి 3.03 వరకు, రాహుకాలం: ఉదయం 9.11 నుంచి 10.46 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.02 నుంచి 7.43 వరకు, వర్జ్యం: సాయంత్రం 6.03 నుంచి 7.39 వరకు.



శుక్రవారం తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ మూడో సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు. చిత్రంలో జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు

నగరం చుట్టూ శివారు పట్టణాలు

ఇది ముఖ్యమంత్రి కేసీఆర్ కల ▪ తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో కేటీఆర్

427 ఏండ్ల క్రితం ముగ్గుపోసుకున్న హైదరాబాద్ ▪ ప్రణాళికాబద్ధ అడుగులతోనే విశ్వనగరం

తెలంగాణ వచ్చి మూడేండ్లే అయినా.. పాఠాలు చెప్తున్నాం ▪ సీఎం ప్రణాళికాయుత చర్యలే అందుకు కారణం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

విశ్వనగరంగా తీర్చిదిద్దనున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరం చుట్టూ శివారు పట్టణాలు (శాటిలైట్ టౌన్స్) ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. నగరంచుట్టూ టౌన్‌షిప్పులు ఏర్పాటుచేయాలనేది ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కల అని అన్నారు. అందుకోసమే డబుల్‌బెడ్‌రూం ఇండ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి అవసరమయ్యే వ్యూహం, పట్టుదల, ఆర్థిక వనరులు, ప్రణాళికలు ఉండాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ మూడో సర్వసభ్య సమావేశానికి మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకంటే ముందు పదమూడు, పద్నాలుగేండ్ల క్రితం ఏర్పాటైన కొత్త రాష్ట్రాలు ఇప్పుడిప్పుడే కుదురుకుంటున్నాయని అన్నారు. గత డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వ భవనాలకు ప్రధాని మోదీ ప్రారంభోత్సవాలు చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం మాత్రం.. మూడేండ్లలోపే పాలన ఎలా ఉండాలనే విషయంపై ఇతర రాష్ట్రాలకు పాఠాలు నేర్పించే స్థాయికి చేరుకున్నదని తెలిపారు. సులభ వాణిజ్య విధానం, డిజిటల్ లావాదేవీలు తదితర పది, పన్నెండురంగాల్లో కొత్త రాష్ట్రం ఆదర్శంగా నిలబడిందన్నారు. ఇందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడమే కారణమని కేటీఆర్ వివరించారు. భూముల రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచామన్నారు.

విశ్వనగరం ఆషామాషీకాదు

స్వాతంత్ర్యం సిద్ధించాక అత్యధిక కాలం దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ దుష్పరిపాలనను మూడేండ్లలోపే తుడిచి వేసి.. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దటం అంత ఆషామాషీ విషయం కాదని కేటీఆర్ అన్నారు. ఖాళీ స్థలాల్ని తీసుకుని అమరావతి వంటి నగరం కట్టడం సులువని.. కానీ, 427 ఏండ్ల క్రితం ముగ్గుపోసుకున్న హైదరాబాద్‌ను విశ్వనగరం స్థాయికి తేవాలంటే ఎంతో ప్రయాస పడాల్సిన అవసరముందని చెప్పారు. విశ్వనగరాలనేవి రాత్రికి రాత్రే నిర్మితం కావని.. ఇందుకోసం రకరకాల అవస్థలను పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలన్నారు. రాష్ట్రాన్ని దాదాపు ఆరు దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. కొత్త రాష్ట్రం ఏర్పడగానే మూడేండ్లలోపు అద్భుతాలను ఆశిస్తున్నదని ఎద్దేవాచేశారు. రాబోయే ఏడెనిమిదేండ్లలో హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే సామర్థ్యం తమకే ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామని.. ఈ విషయం ప్రతిపక్షాలకూ కచ్చితంగా తెలుసని కేటీఆర్ అన్నారు.

ఇంటింటికీ తాగునీరు..

ఇంటింటికీ తాగునీరు అందించకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటు అడుగబోమని సీఎం కేసీఆర్ సవాల్ చేశారని, ఆ క్రమంలోనే సుమారు రూ.2వేల కోట్ల అంచనా వ్యయంతో శివారు ప్రాంతాల్లో తాగునీటికి సంబంధించిన పనులు జోరుగా సాగుతున్నాయని కేటీఆర్ వెల్లడించారు. గతంలా కాకుండా ప్రస్తుతం శివారు ప్రాంతాల్లో ఇంటింటికీ నల్లా ద్వారా మంచి నీరు అందించడానికి అతివేగంగా అడుగులు ముందుకేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీల సామర్థ్యం గల ప్రత్యేక రిజర్వాయర్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రెండుమూడేండ్లలోపు దీన్ని పూర్తి చేస్తామన్నారు.

రహదారుల అభివృద్ధికి హెచ్చార్డీసీ ఏర్పాటు..

హైదరాబాద్ అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి కావాలంటే.. ముందుగా మన రహదారులు ఆధునికంగా ఉండాలని కేటీఆర్ అన్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులువుగా రాకపోకల్ని సాగించాలని చెప్పారు. ప్రస్తుతం నాగోలు నుంచి మియాపూర్ మధ్య దూరం 29 కిలోమీటర్లే అయినప్పటికీ.. ట్రాఫిక్‌లో ప్రయాణం చేయడంవల్ల ఎంతో దూరం అనిపిస్తుందన్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుచేశామని తెలిపారు. 'హైదరాబాద్‌లో మొత్తం రహదారులన్నింటినీ క్షుణ్నంగా గమనిస్తే.. దాదాపు తొమ్మిది వేల కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్, నాగోలు నుంచి గచ్చిబౌలి, ప్యారడైజ్ నుంచి ఫలక్‌నుమా.. ఇలా 290 కిలోమీటర్ల మేరకు గల రహదారులను ఏడాదిలోపు వైట్ టాపింగ్ చేస్తాం' అని మంత్రి వెల్లడించారు. సదరు రహదారుల నిర్వహణ బాధ్యతలను సుమారు ఏడేండ్లపాటు ఆయా కాంట్రాక్టర్లే చూసుకుంటారని చెప్పారు.

నగరంలో నయా రోడ్లు

దాదాపు రూ.3,000 కోట్ల అంచనా వ్యయంతో స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎస్సార్డీపీ) చేపడుతున్నామని మంత్రి కేటీఆర్ చెప్పారు. రామంతపూర్‌లోని ఛే నంబర్ రోడ్డు నుంచి ఉప్పల్ దాకా సుమారు రూ.250 కోట్లతో ఫ్లైఓవర్, ఉప్పల్ నుంచి నారపల్లి దాకా పీవీ ఎక్స్‌ప్రెస్ వే తరహాలో రూ.950 కోట్లతో ఎక్స్‌ప్రెస్ వే నిర్మిస్తున్నామని తెలిపారు. ప్యారడైజ్ నుంచి కొంపల్లి, జూబ్లీ బస్టాండ్ నుంచి శామీర్‌పేట్ వరకూ అభివృద్ధి చేయతలపెట్టిన స్కై వేలకు అవసరమయ్యే భూముల కోసం ఇప్పటికే రక్షణ శాఖను కోరామని, అతిత్వరలో వీటి నిర్మాణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. బాలానగర్ చౌరస్తాలో రూ.400 కోట్లతో అభివృద్ధి చేయతలపెట్టిన ఫ్లైఓవర్ టెండర్ల పనులు ఖరారయ్యాయని, అతిత్వరలో ఈ పనులను మొదలుపెడుతామని వెల్లడించారు. కేవలం శివారు ప్రాంతాలే కాకుండా.. ప్రధాన ప్రాంతాల్లోని రద్దీని తగ్గించడానికి ప్రణాళికల్ని రచిస్తున్నామని మంత్రి చెప్పారు. బంజారా హిల్స్, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45నుంచి దుర్గంచెరువు మీదుగా ఔటర్ రింగురోడ్డుకు అనుసంధానంచేసే ఎలివేటెడ్ రహదారి రెండేండ్లలోపు పూర్తి అవ్వడాన్ని ప్రతిఒక్కరూ కండ్లారా చూస్తారనే ధీమా వ్యక్తంచేశారు.

ఊపర్ షేర్వాణీ.. అందర్ పరేషానీ

బిల్డర్స్ సమావేశంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు నవ్వులు పూయించాయి. 'ఊపర్ షేర్వాణీ అందర్ పరేషానీ' వంటి పరిస్థితి కేవలం బిల్డర్లలోనే కాదని.. రాజకీయ నాయకుల్లోనూ అదే పరిస్థితి ఉందనగానే సభ మొత్తం నవ్వులతో నిండిపోయింది. రాజకీయ నాయకులుగా మారిన బిల్డర్లు ఉన్నారని, ఈ రెండూ చేసేవారిని అడిగితే ఈ విషయం చెప్తారని అన్నారు. ప్రస్తుతం రాజకీయ నాయకుల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కన్పిస్తున్నదనగానే సభ నవ్వుల్లో మునిగిపోయింది.

వరంగల్ మెగాటెక్స్‌టైల్ పార్కుకు 16న శంకుస్థాపన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేయనున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు 16న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శంకుస్థాపన చేయనున్నారు. వరంగల్‌రూరల్ జిల్లాలోని గీసుగొండ మండలంలో ఉన్న శాయంపేట, సంగెం మండలంలోని చింతలపల్లి గ్రామాల మధ్య ఈ పార్కును నిర్మించనున్నారు. పార్కు కోసం ఇప్పటికే 1190 ఎకరాలను సేకరించారు. రూ.1150కోట్లతో మౌలికసదుపాయాలను కల్పిస్తారు. పర్యావరణ అనుమతులు కూడా రావడంతో పనులు వేగంగా పూర్తి చేసేందుకు టీఎస్‌ఐఐసీ అధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. దాదాపు రూ.11,500కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశమున్నట్టు అంచనా. టెక్స్‌టైల్ పార్కుతో 1.13లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనున్నది. బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన చేనేత కార్మికులు తిరిగి వచ్చే అవకాశం ఉన్నది. శంకుస్థాపన తర్వాత నిర్మాణ పనుల్లో వేగం పెరుగనున్నది. ప్రహరీ నిర్మించడానికి టీఎస్‌ఐఐసీ టెండర్లు పిలిచింది. భూసేకరణకు సహకరించిన రైతులకు, చొరవ తీసుకున్న అధికారులు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు. లక్షల మందికి ఉపాధి కల్పించే టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సీఎం కేసీఆర్‌కు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళాభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి అమోఘం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమబోర్డు చైర్‌పర్సన్ రాగం సుజాత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మహిళా అభ్యున్నతికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేస్తున్న కృషి అమోఘమని, ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో ప్రవేశపెట్టని విధంగా ఒంటరి మహిళలకు పెన్షన్ అందజేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్ రాగం సుజాత నాగేందర్‌యాదవ్ కొనియాడారు. కేంద్ర సాంఘికసంక్షేమ మండలి, కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశానికి ఆమె మెంబర్ హోదాలో హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళల అభ్యున్నతి కోసం ప్రవేశ పెట్టిన పలు పథకాలు, మహిళలకు అందుతున్న సంక్షేమ ఫలాలు గురించి వివరించారు.

చిరుద్యోగిలా శ్రీమంతుడు!

- సామాన్యుడిలా బతుకాలని కుటుంబం కట్టుబాటు
- హైదరాబాద్‌లో నెలరోజులు సేల్స్‌బాయ్‌గా ఉద్యోగం
- అనుభవాలను పంచుకున్న వజ్రాల వ్యాపారి కుమారుడు
- తెలంగాణ ప్రజలు మంచోళ్లని కితాబిచ్చిన హిరాత్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కోట్ల ఆస్తులు ఉన్నప్పటికీ, కుటుంబ కట్టుబాటు ప్రకారం ఓ వజ్రాల వ్యాపారి కుమారుడు అతి సామాన్యుడిగా హైదరాబాద్‌లో గడిపాడు. జీవితం విలువను అర్థం చేసుకోవడం కోసం ఇంటి పెద్దలు చూపినమార్గంలో పయనించాడు. ఫైవ్‌స్టార్ హోటళ్లలో విలాసాలు అనుభవించిన అతను..రూ.వందకు బెడ్ ఇచ్చే లాడ్జి కోసం వెతికాడు. అమెరికాలో బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివి, హైదరాబాద్‌లో సేల్స్‌బాయ్‌గా గడిపాడు. సూరత్ కేంద్రంగా వజ్రాల వ్యాపారం చేసే హరేకృష్ణ ఎక్స్‌పోర్ట్స్ యజమాని ఘన్‌శ్యాం ధోలకియా కుమారుడు హిరాత్ నెలరోజుల తన అనుభవాలను శుక్రవారం హైదరాబాద్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించాడు. 'నా పేరు హిరాత్. వయసు 23. అమెరికాలో బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివా. సూరత్‌లో నాన్న, తన ముగ్గురు సోదరులు వజ్రాల వ్యాపారం చేస్తారు. కుటుంబ సంప్రదాయం ప్రకారం ప్రతిఒక్కరూ జీవితం విలువ తెలుసుకునేందుకు కొన్నిరోజులపాటు నిరుపేదగా మారాలి. మావాళ్లు 15 ఏండ్లుగా ఈ కట్టుబాటును ఆచరిస్తున్నారు. ఏటా ఒకరు చేతిలో డబ్బులేకుండా నెలపాటు సామాన్యుడిలా కష్టపడి పనిచేసే



తాజ్‌దక్కన్ హోటల్‌లో మీడియా సమావేశం తర్వాత తండ్రి ఘన్‌శ్యాం, తల్లి, సోదరితో హిరాత్

బతుకాలి. వారానికో ఉద్యోగం మారాలి. కష్టం వస్తే భరించాలే తప్ప వెనుతిరుగొద్దు. కుటుంబ నేపథ్యం, చదువు, డిగ్రీలు కూడా చెప్పొద్దు. ఈ ఏడాది నా వంతు వచ్చింది. ఆ రోజు నా చేతిలో నాన్న హైదరాబాద్ విమానం టికెట్ పెట్టాడు. అంతకుముందు హైదరాబాద్ పేరు వినడమే తప్ప చూడలేదు. శంషాబాద్‌లో దిగి సికింద్రాబాద్‌కు చేరేటప్పటికీ జేబులో ఉన్నది రూ.500. ఆర్కే లాడ్జీలో రూ.వందకు బెడ్ ఇస్తే బసచేశా. ఓ రైతు బిడ్డనని, ఇంటర్మీడియట్ చదివానని, పనిచేస్తానని లాడ్జి మేనేజర్‌కు చెప్తే నమ్మారు. మెక్‌డోనాల్డ్స్, నైక్ ఔట్‌లెట్స్, జాక్సన్ జాన్, అడిడాస్ కంపెనీ వాళ్లకు అబద్ధాలు చెప్తే నమ్మారు. జాక్సన్‌జాన్ ఇంటర్వ్యూలో పత్తి, గోధుమ ఎన్ని నెలల పంట? క్వింటాల్ ధర ఎంతన్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయా. కానీ జాబ్ వచ్చింది. ఒకే రోజులో ఐదు సంస్థల్లో ఉద్యోగాలు వచ్చాయి. కొన్ని రోజులు ఫర్నిచర్ షాప్‌లో సేల్స్‌బాయ్‌గా పనిచేశా. నాలుగువారాల్లో నాలుగు ఉద్యోగాలు చేసి ఖర్చులు పోగా రూ.4,700 సంపాదించా. ఇక్కడ సాంబారు టేస్టీగా ఉంటుంది. రోజూ 49 ఎం బస్ ఎక్కి ప్రయాణిస్తూ సిటీ చూసేవాడిని. విదేశాల్లో ఉద్యోగాలు చేయాలని లేదు. ఇండియాలోనే బిజినెస్ చూసుకుంటా. దేశ పరిస్థితుల్ని చెడుగా ఊహించుకుంటూ, విదేశీ అవకాశాల్ని గొప్పగా భావించే ఆలోచన పోవాలనేది నా అభిప్రాయం' అని హిరాత్ వివరించాడు.

పాజిటివ్ తెలంగాణ

తెలంగాణ వాళ్లు చాలా మంచోళ్లు. పాజిటివ్‌గా ఉంటారు.. ఉద్యోగం కోసం వెతికేటప్పుడు బాగా సహకరించారని హిరాత్ కొనియాడారు. 'మెక్‌డోనాల్డ్స్‌లో ఐదురోజులు పని చేసి మానేస్తున్నానని చెప్పా, కంపెనీ రూల్స్ ప్రకారం నెలరోజులు పనిచేస్తేనే జీతం ఇస్తారు. నా పరిస్థితి చూసి ఔట్‌లెట్ మేనేజర్ సొంత డబ్బు ఇచ్చారు. రుద్రగుప్త అనే వ్యక్తి సెల్‌ఫోన్ ఇచ్చారు. అమీర్‌పేటకు దగ్గర లాల్‌బంగ్లా సమీపంలో ఉద్యోగం కోసం ఓ ఆఫీసుకు వెళ్లా. నా కథ విన్న ఆమె ఉద్యోగం ఇవ్వలేను. ముందు ఆకలితీర్చుకో అని రూ.500 ఇచ్చారు. ఉద్యోగం దొరికే చిరునామా ఇచ్చారు. అర్జంట్ సార్ అని రిక్వెస్ట్ చేస్తే సిటీలో 17 మంది లిఫ్టు ఇచ్చారు. అడిగిన వాళ్లలో ఎవరూ కాదనలేదు. హైదరాబాద్ ప్రజలు చాలా



ప్లైవుడ్ షోరూం సహోద్యోగితో హిరాత్ (ఫైల్)

పాజిటివ్‌గా ఉంటారు. ఈ విషయం బాగా నచ్చింది' అని హితేశ్ అనుభవాలను వివరించారు.

పెట్టుబడులకు చిరునామా.. తెలంగాణ!

- జీఈఎస్ నిర్వహణను దక్కించుకున్న హైదరాబాద్
- దేశవిదేశాల నుంచి 1200 మంది పారిశ్రామికవేత్తలు
- నవంబర్ 28 నుంచి 30 వరకు సదస్సు.. హాజరుకానున్న ప్రధాని మోదీ
- పెట్టుబడులను ఆకర్షించేందుకు పక్కా ప్రణాళిక
- అధికారులకు ఐటీశాఖ మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ ప్రభుత్వం మరో ఘనత సాధించింది. హైదరాబాద్ మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానున్నది. పెట్టుబడులు ఆకర్షించడంలో కీలకమైన గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్(జీఈఎస్) నిర్వహణకు హైదరాబాద్‌ను కేంద్రం ఎంపిక చేయడం, రాష్ట్రానికి వరంగా మారనున్నది. పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడే అంతర్జాతీయ సదస్సును నిర్వహించే అవకాశాన్ని దక్కించుకోవడంలో మంత్రి కే తారక రామారావు కృషి ఫలించింది. ఈ అవకాశాన్ని అనువుగా మలుచుకొని భారీస్థాయిలో పెట్టుబడులు సాధించడంపై మంత్రి కేటీఆర్ దృష్టి సారించారు.

పోటీలో నెగ్గిన హైదరాబాద్

ఏటా అమెరికా ఆధ్వర్యంలో జరిగే జీఈఎస్‌ను ఈ ఏడాది భారతదేశంలో నిర్వహించాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో మంత్రి కేటీఆర్ ఆదేశాలతో గత ఏడాది ఆగస్టులో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు నిర్వహించే అవకాశం తమకు ఇవ్వాలని రాష్ట్ర ఐటీశాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ కేంద్రానికి విన్నవించారు. ఢిల్లీ, అహ్మదాబాద్, బెంగళూరు, ముంబై, జైపూర్, విశాఖపట్నం వంటి నగరాలు పోటీపడినప్పటికీ, ఇక్కడ వసతులు, రాష్ట్ర ఆసక్తిని గమనించిన కేంద్రం హైదరాబాద్‌కే పచ్చజెండా ఊపింది. నవంబర్ 28 నుంచి 30 వరకు మూడురోజులపాటు హెచ్‌ఐసీసీలో సదస్సు జరుగనున్నది. ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూతురు ఇవాంక ట్రంప్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సహా దేశ,విదేశాల ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా హాజరుకానున్న 1200 మంది పారిశ్రామికవేత్తల్లో 400 మంది అమెరికా నుంచి, మరో 400 మంది ఇతర దేశాల నుంచి హాజరవుతారు. వీరిని అమెరికా ప్రభుత్వమే ఖరారు చేసి ఖర్చులను కూడా భరించనున్నది. మిగిలిన 400 మంది దేశం నుంచే హాజరవుతారు. వీరిని కేంద్రం తరుపున నీతి ఆయోగ్ ఎంపిక చేయనున్నది. నిర్వహణ బాధ్యతలను కూడా చేపట్టనున్నది. హెచ్‌ఐసీసీలో జరిగే సదస్సు విజయవంతం కోసం కమిటీలు ఏర్పాటుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వఅధికారులతో త్వరలో సమావేశం నిర్వహించి కమిటీలకు తుదిరూపు ఇవ్వనున్నారు. ఈ ఏడాది 'ఉమెన్ ఫస్ట్.. ప్రాస్పరిటీ ఫర్ ఆల్' అంశాన్ని సదస్సు ప్రధాన ఇతివృత్తంగా నిర్ణయించారు.

పారిశ్రామికవేత్తలను ఆకర్షించేలా ప్రణాళిక

అమెరికా-భారత ప్రభుత్వం నిర్వహించే జీఈఎస్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ పారిశ్రామికవేత్తల దృష్టి హైదరాబాద్‌పై పడనున్నది. పారిశ్రామికవేత్తలు తమ కంపెనీల యూనిట్లను ఇక్కడ నెలకొల్పే అవకాశాలను పరిశీలించే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భారీగా పెట్టుబడులు సాధించేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు ఆదేశించారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న నూతన పారిశ్రామిక విధానం, ఈవోడీబీలో దేశంలోనే తొలి స్థానంలో ఉన్న విషయం, ఆన్‌లైన్‌లో అనుమతులు, రాష్ట్రం ఏ పరిశ్రమలకు అనువైనది.. వనరులను వివరించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. టీఎస్‌ఐపాస్ ద్వారా 15 రోజుల్లో అనుమతులు ఇచ్చే విధానం దేశంతో పాటుగా ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తల ప్రశంసలు అందుకున్నది. ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలకు ఫార్మా సిటీ, మెడికల్ డివైజ్ పార్కు, జీనోమ్ వ్యాలీని చూపించాలని భావిస్తున్నారు. జీఈఎస్‌కు వచ్చిన ప్రతి పారిశ్రామికవేత్త రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొచ్చేలా,పర్యాటకంగానూ అనుకూలంగా మార్చుకోవడానికి ప్రణాళిక రూపొందించాలని అధికారులకు మంత్రి కేటీఆర్ సూచించారు. స్టార్టప్‌లకు కేంద్రంగా, దేశంలోనే అత్యధికంగా టెక్నికల్ ఇంక్యుబేటర్లు, ఐటీకి మేటిగా హైదరాబాద్‌కు గుర్తింపు ఉండటాన్ని సానుకూలంగా మలుచుకొని పెట్టుబడులను సాధించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.



హైదరాబాద్‌లో టీఎస్ఎస్పీడీసీఎల్ 'కరెంటోళ్ల నిరసన'లో మాట్లాడుతున్న టీఎస్ఈఈఏ అధ్యక్షుడు శివాజీ

ఏపీ విద్యుత్ ఉద్యోగుల ఆగడాలపై నిరసన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల ఆగడాలు మితిమీరాయని తెలంగాణ విద్యుత్ ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కరెంటోళ్ల నిరసన' పేరిట శుక్రవారం టీఎస్ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు మహాధర్నా నిర్వహించారు. ఉద్యోగుల విభజనను పూర్తిచేయాలని సీఎండీ రఘుమారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఏపీ సర్కారు అండతో అక్కడి విద్యుత్ఉద్యోగులు కోర్టులో కేసులు వేస్తున్నారని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించేందుకు గవర్నర్ నరసింహన్ సిద్ధంగాఉన్నా ఏపీ విద్యుత్ సంస్థల అధికారులు ముందుకు రావడం లేదన్నారు. ఏపీ విద్యుత్ ఉద్యోగుల తీరుపై 17వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన, 18న సామూహిక ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. 19 నుంచి రిలే దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, అకౌంట్స్ సెక్షన్ సెక్రటరీ జనరల్ అంజయ్య, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షుడిగా వివేకానందరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఈజీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా సీ వివేకానందరెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సీపీఈ టీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. జే హరికిషన్ జనరల్ సెక్రటరీగా, మేడ్చల్ డీపీఈవో గణేశ్ ట్రెజరర్‌గా, సంగారెడ్డి డీపీఈవో చంద్రయ్య, మహబూబ్‌నగర్ డీపీఈవో అనిత జాయింట్ సెక్రటరీలుగా, వెంకటేశ్ నేత, సీలం శ్రీనివాసరావు, అంజన్‌రావు అసోసియేట్ ప్రెసిడెంట్లుగా, కేఈబీ శాస్త్రి, శశిధర్‌రెడ్డి, సైదులు వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికయ్యారు.



డోక్లాం ప్రాంతంలో మన సైన్యం ఏ పరిస్థితులనైనా ఎదుర్కోవటానికి సన్నద్ధంగా ఉన్నది. సేనలకు చాలినంత ఆయుధ సంపత్తి లేదన్న దాంట్లో వాస్తవం లేదు. గత 22 రోజులుగా పరిస్థితులకు తగ్గట్టుగా సరఫరాలను అందిస్తున్నాం. ఎవరికీ ఎలాంటి భయాలు, అనుమానాలు ఉండాల్సిన అవసరం లేదు.

అరుణ్ జైట్లీ, కేంద్రమంత్రి

రాబోయే రోజుల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలన్నింటినీ ఏకం చేస్తాను. కాంగ్రెస్ ఒక్కటే బీజేపీని నిలువరించలేదు. నా ప్రయత్నమంతా ప్రతిపక్షాలను ఏకతాటిమీదికి తేవటమే.

మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి



చరిత్రలో నేడు




1851

కుట్టుమిషన్‌ను కనుగొన్న అమెరికాకు చెందిన ఐజాక్ సింగర్.

1877

ధ్వనిని రికార్డు చేసే యంత్రం 'ఎడిసన్ ఫోన్'ను కనుగొన్న థామస్ ఎడిసన్.





1908

మొదటి 'టీ-మోడల్ కారు'ను తయారుచేసిన ఫోర్డ్ కంపెనీ.

రిజర్వేషన్ల కోటా కోసం మరాఠాలు చేసిన మహా మౌనప్రదర్శన ముంబై నగరాన్ని స్తంభింపజేసింది. ఈ మధ్యకాలంలో సామాజికంగా బలమైన పునాదులు కలిగిన జాట్‌లు, మరాఠాలు రిజర్వేషన్ల కోసం ఉద్యమించటం సామాజిక అశాంతికి కారణమవుతున్నది. రిజర్వేషన్లు యాభై శాతంకన్నా మించరాదన్న సుప్రీంకోర్టు తీర్పు ఉన్నా, రిజర్వేషన్ల కోటా కావాలంటున్న సమూహాల సంఖ్య పెరుగుతున్నది. తమకు విద్య, ఉద్యోగాల్లో అన్యాయం జరుగుతున్నదంటున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ ఉచిత, నాణ్యమైన విద్య అందించటమే ఈ సవాళ్లకు సమాధానం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

ఎంతో ఉన్నత ఆశయాలు, లక్ష్యాలతో ప్రారంభమైన 'స్వచ్ఛభారత్' కార్యక్రమం మరింత అర్థవంతంగా అమలు కావాల్సి ఉన్నది. దీనికి ప్రభుత్వం నుంచి తగినంత ప్రోత్సాహం కావాలి. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సబ్సిడీ తో మరుగుదొడ్లు నిర్మించుకునే కార్యక్రమం మంచి ఫలితాలిచ్చింది. 2014 లో 39 శాతం ఉన్న మరుగుదొడ్లు 62.45 శాతానికి పెరిగా యి. వీటితో మహిళ ల ఆత్మగౌరవం పెరిగింది. అయితే నీటి సౌకర్యం లేని దళిత వాడల్లో మరుగుదొడ్ల నిర్మాణం జరుగలేదు.అలాగే పట్టణాల్లోని చెత్త సమస్య తీరలే దు. వీటిని ఆచరణా త్మకంగా పరిష్కరించుకున్నప్పుడే 'స్వచ్ఛభారత్ ఆవిష్కృతమవుతుంది.

ది హిందూ

దుండగులపై ఉపేక్ష

చండీగఢ్‌లో ఐఏఎస్ అధికారి కుమార్తెను బీజేపీ హర్యానా విభాగం అధ్యక్షుడి కుమారుడు, అతడి మిత్రుడు వెంబడించి అపహరణకు ప్రయత్నించడం, అతడి పట్ల పోలీసులు మొదట్లో ఉపేక్ష వహించడం మహిళల భద్రతారాహిత్యానికి అద్దం పడుతున్నది. ఈ నెల నాలుగవ తేదీ శుక్రవారం రాత్రి వర్ణిక కుందు అనే 29 ఏండ్ల యువతి చండీగఢ్‌లోని ఒక ప్రధాన వీధిలో కారు సొంతగా నడుపుకుంటూ తమ ఇంటికి పోతున్నప్పుడు బీజేపీ నేత సుభాష్ బరాలా కుమారుడు వికాస్, ఆయన మిత్రుడు ఆశిష్ ఆమెను తమ కారులో వెంబడించారు. ఆమె కారును వేగంగా నడుపుకుంటూ తప్పించుకునే ప్రయత్నం చేసేకొద్దీ, దుండగులు దాదాపు ఏడు కిలోమీటర్ల దూరం వెంటబడ్డారు. వర్ణిక వెల్లడించిన వివరాల ప్రకారం– వారు అమె కారును అనేక చోట్ల అడ్డుకున్నారు. ఒకచోట తమ కారును అడ్డుపెట్టి ఆపగలిగారు. వారిలో ఒకరు ఆమె కారు దగ్గరకు వచ్చి కారు అద్దాలపై కొట్టడమే కాకుండా, తలుపు తెరవడానికి ప్రయత్నించాడు. వర్ణిక వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తూనే పోలీసులకు సమాచారం అందించడం వల్ల వారు వెంటనే వచ్చి కాపాడారు. పోలీసులు దుండగులు ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తక్షణం స్పందించి ఆమెను కాపాడటం ప్రశంసనీయమే. వారు సమయానికి రాకపోతే తన పరిస్థితి ఎట్లా ఉండేదోనని బాధితురాలు కూడా అంటున్నారు. కానీ దుండగులను పోలీసు స్టేషన్‌కు తీసుకుపోయిన తరువాత పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ, ఆ తరువాత వారు నిర్వహించిన పాత్ర, కేసును నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలకు తావిస్తున్నది.

తమది భిన్నమైన పార్టీ అని బీజేపీ నేతలు అధికారంలోకి రాకముందు తరుచు చెప్పుకునేవారు. కానీ ఇప్పుడు కొడుకు చేసిన తప్పుకు తండ్రిని తప్పుపట్టడమేమిటని అంటున్నారు. నిజమే కానీ, రాజకీయ నాయకులు ఆదర్శ ప్రవర్తన కలిగి ఉండాలె. పుత్రరత్నం తప్పుతాగి యువతిని వెంటాడి అఘాయిత్యానికి పాల్పడాలని యత్నిస్తే, బహిరంగంగా ఖండించి శిక్ష పడేటట్టు చేయాలె. అంతే కానీ పరోక్ష మద్దతు ఇవ్వడం తప్పు. ఇంత జరిగిన తరువాత కూడా ఆ నాయకుడిని పదవి నుంచి తప్పించకపోవ డం పార్టీ పెద్దల తప్పు.

దుండగులు ఒక యువతిని వెంటాడటం, కారు తలుపును తెరిచే ప్రయత్నం చేయడాన్ని బట్టి వారి దురుద్దేశం ఏమిటో తెలుస్తూనే ఉన్నది. కానీ పోలీసులు యువతిని వెంబడించారనే సాధారణ కేసు పెట్టి, వారిని అరెస్టు చేసిన కొద్ది గంటలలోనే బెయిల్‌పై విడుదల చేశారు. ఆ తరువాత కూడా ఆమెను 'అడ్డుకున్నారు' అని మాత్రమే చేర్చారు. తనను అపహరించడానికి ప్రయత్నించారని ఆమె వెల్లడించలేదని పోలీసులు సమర్థించుకున్నారు. కానీ వారు తన కారు తలుపు తెరువడానికి ప్రయత్నించారని, తనను అపహరించాలనేది వారి ఉద్దేశమని స్పష్టమని ఆమె తన రాతపూర్వక ఫిర్యాదులోనే పేర్కొన్నారు. దుండగులు వర్ణికను వెంటాడిన రహదారిపై సీసీటీవీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసులు మొదట అన్నారు. ఈలోగా దుండగుల తరపున బాధితురాలికి వ్యతిరేకంగా దుష్ప్రచారం మొదలైంది. బీజేపీ నేత ఒకరు ఆ అమ్మాయి రాత్రి పూట బయటకు ఎందుకు వెళ్ళినట్టు అనే రీతిలో వ్యాఖ్య చేశారు. ఆమె ఫేస్‌బుక్‌లో పెట్టుకున్న మిత్రులతో దిగిన ఫొటోలను తప్పుడు అర్థం వచ్చే రీతిలో వ్యాఖ్యానిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం సాగింది. ఇంతలో నాయకులు, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు పత్రికల్లో, టీవీల్లో ప్రచారమై, ఒత్తిడి రావడంతో పోలీసులు తప్పనిసరై 'అపహరణ యత్నం' అని చేర్చి నాన్‌బెయిలబుల్ కేసు పెట్టి వారిని అరెస్టు చేశారు. సీసీటీవీ దృశ్యాలు కూడా బయటకు వచ్చాయి. వాటిలో వర్ణిక కారును దుండగుల కారు వెంటాడుతున్నట్టు స్పష్టంగా ఉన్నది. అయితే ఆమెను అడ్డుకున్న చోట మాత్రం కెమెరాలు పనిచేయడం లేదని అంటున్నారు. దుండగులను అరెస్టు చేసినప్పుడు వచ్చిన వైద్యుడు వారి నోటి నుంచి మద్యం సేవించిన వాసన వస్తున్నదని వెల్లడించారు. అయితే రక్త పరీక్ష చేయించుకోవడానికి వారు నిరాకరించారు. వారు మద్యం కొనుక్కున్న దృశ్యాలు కూడా లభ్యమయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనాలను కూడా పోలీసులు సేకరించారు.

యువతిపై అఘాయిత్యానికి పాల్పడటం సాధ్యం కాలేదు కానీ, వారికి ఆ ఉద్దేశం ఉన్నదనేది స్పష్టం. బాధితురాలు ఒక ఉన్నతాధికారి కుమార్తె కనుక ధైర్యంగా నిలబడి న్యాయం కోసం పోరాడుతున్నారు. కానీ బీజేపీ హర్యానా శాఖ అధ్యక్షుడు తన కుమారుడికి అండగా నిలబడినందుకు, పార్టీ ఆయనను తప్పు పట్టడం లేదు. మొదట్లో పోలీసులు వారికి అనుకూలంగా వ్యవహరించారు. చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతం అయినందు వల్ల అధికార యంత్రాంగం కేంద్రం అజమాయిషీలో ఉంటుంది. అందువల్ల కేంద్ర ప్రభుత్వమైనా వెంటనే స్పందించి, అనుమానాలకు తావులేకుండా వ్యవహరించవలసింది. తమది భిన్నమైన పార్టీ అని బీజేపీ నేతలు అధికారంలోకి రాకముందే తరచు చెప్పుకునేవారు. కానీ ఇప్పుడు కొడుకు చేసిన తప్పుకు తండ్రిని తప్పుపట్టడమేమిటని అంటున్నారు. నిజమే కానీ, రాజకీయ నాయకులు ఆదర్శ ప్రవర్తన కలిగి ఉండాలె. పుత్రరత్నం తప్పుతాగి యువతిని వెంటాడి అఘాయిత్యానికి పాల్పడాలని యత్నిస్తే, బహిరంగంగా ఖండించి శిక్ష పడేటట్టు చేయాలె. అంతే కానీ పరోక్ష మద్దతు ఇవ్వడం తప్పు. ఇంత జరిగిన తరువాత కూడా ఆ నాయకుడిని పదవి నుంచి తప్పించకపోవడం పార్టీ పెద్దల తప్పు. ప్రతిపక్షాలు ఈ ఉదంతాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూస్తున్నాయి. ఈ సంగతి పక్కన పెడితే దేశంలో చట్టబద్ధ పాలన నెలకొల్పడం పాలకపక్షం బాధ్యత.

జనగళం

సమస్యలు పరిష్కరించాలె

రాష్ట్రంలోని దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకుల పరిస్థితి దయనీయంగా ఉన్నది. వారి సమస్యలు పరిష్కరించాలి. దేవునికి, భక్తునికి అనుసంధానకర్తగా వ్యవహరించే అర్చకులు చాలీచాలని జీతాలతో, విశ్రాంతి లేక ఆరోగ్యాలు పాడై ఇబ్బందులు పడుతున్నారు. దేవాలయాల్లో కనీస సౌకర్యాల్లేక మానసికంగా వేదన పడుతున్నారు. ఇప్పటికైనా వారి సమస్యలపై స్పందించి దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు నెలకు రెండు రోజులు సెలవులు ఇస్తూ, సమయ వేళలు కుదించాలి. ప్రభుత్వం ఇచ్చే ధూపదీప, నైవేద్య పథకాలు సమర్థంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

- వి.రాజశేఖర శర్మ, నాగర్‌కర్నూలు

బ్యాంకుల తీరు మారాలె

ఇటీవల బ్యాంకులు ఖాతాదారుల అకౌంటులో మూడువేల రూపాయలు కనీసంగా డిపాజిట్ ఉండాలనే నిబంధన పెడుతున్నారు. లేకపోతే అకౌంటు మూసేస్తామని చెబుతున్నారు. ఇంత మొత్తం డబ్బును ఖాతాలో ఉంచటం విద్యార్థులకు, మధ్య, చిన్నతరగతి వారికి సాధ్యమయ్యే పనికాదు. ఈ నిబంధనలను సడలించాలె.

- యం.కె.మూర్తి, జమ్మిగడ్డ,సూర్యాపేట

కార్మికుల స్థితిగతులు పట్టించుకోవాలి

చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో వందకు పైగా కంపెనీలున్నాయి. వీటిలో దినకూలీలుగా ఎక్కువమంది బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాలనుంచి వచ్చిన వలసకూలీలే. వీరికి కనీస వేతనాలు అమలు జరుగక దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారు. కార్మికుల సమస్యలను అధికారులు పట్టించుకొని వారిని ఆదుకోవాలి.

- గుండమల్ల సతీష్ కుమార్, సంస్థాన్ నారాయణపురం

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

ఏడు పదుల పరిణత భారతం

'భారతికి ఆరతిదేరా, తరుణ భారతికి ఆరతిదేరా' ఏండ్ల కిందట రాసిన ఒక సంగీత రూపకంలోని పల్లవి ఇది. మొదట రాడికల్ హ్యూమనిస్ట్, తర్వాత ఏ ఇస్ట్ కాని ప్రముఖ రచయిత, మేధావి, తాత్త్విక చింతనాపరుడు త్రిపురనేని గోపీచంద్ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో గ్రామస్థుల కార్యక్రమాల ప్రయోక్తగా (ప్రొడ్యూసర్) ఉన్నప్పుడు ఢిల్లీలో ఒక అంతర్జాతీయ ప్రదర్శన శాలకు పంపించడానికి ఓయూలో చదువుతున్న నన్ను, నా కవి మిత్రుడిని పిలిచి అర్జెంటుగా ఈ సంగీత రూపకం రాయమన్నారు రికార్డింగ్ కోసం.

అక్కడే, ఆకాశవాణి ఆవరణంలో చెట్ల కింద కూర్చొని ఆ రూపకం రాశాం. అప్పుడు, చాలా ఏండ్ల కిందట ఉన్నది 'తరుణ భారతి'. ఇన్నేండ్ల తర్వాత ఇప్పుడున్నది తరుణ భారతి కాదు, పరిణతి పొందిన భారతి. క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏండ్లు నిండాయి. తర్వాత, దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఏండ్లయింది. ఏవీ సులభంగా, క్షణాల్లో, కేవలం మాటలు, నినాదాలతో జరుగలేదు. మహాకవి దాశరథి ఒక గజల్ (గాలిబ్‌ది) ను అనువదిస్తూ అన్నారు. 'ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము, నరుడు నరుడౌట యెంతొ దుష్కరము సుమ్ము'.. స్వాతంత్ర్య సాధనకు అనేక పోరాటాలు, ఉద్యమాలు జరుపవలసి వచ్చింది. 1757లో బెంగాల్ నవాబు సిరాజుద్దౌలా ఈస్టిండియా కంపెనీ సేనాని లార్డ్ క్లయివ్‌తో ప్లాసీ యుద్ధంలో పోరాడి, తన సేనాధిపతి మీర్ జాఫర్ ద్రోహం కారణంగా ఓడిపోయిన సంఘటనను పరిగణిస్తే భారత స్వాతంత్రోద్యమానిది దాదాపు 200 ఏండ్ల చరిత్ర. 1857లో ఝాన్సీ లక్ష్మీబాయి, నానాసాహెబ్, తాంతియా తోపే, మంగళ్‌పాండే, ఇక్కడ తుర్రే బాజ్‌ఖాన్ తదితరుల నాయకత్వంలో–మీరట్‌లో మొదలై దక్షిణ భారతం వరకు విస్తరించిన తిరుగుబాటును (మొదటి స్వాతంత్ర్య సంగ్రామం) పరికిస్తే భారత స్వాతంత్ర్య ఉద్యమానిది తొంభై ఏండ్ల చరిత్ర. 1885 డిసెంబర్‌లో కొందరు ఆంగ్లేయ మేధావులు, ఉదారవాదుల చొరవతో, ప్రోత్సాహంతో బొంబాయిలో స్థాపితమైన భారత జాతీయ కాంగ్రెస్ ముప్పై ఏండ్ల వరకు కేవలం చర్చలు, సంప్రదింపులు, విజ్ఞప్తి పత్రాల సమర్పణ వరకు, విన్నపాల వరకే పరిమితమైంది. దాదాభాయి నౌరోజీ, ఫిరోజ్‌షా మెహతా, గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధర తిలక్, సురేంద్రనాథ్ బెనర్జీ తదితర మహా మేధావులు, అకళంక దేశభక్తులు రంగం మీదికి వచ్చినా, లోకమాన్య తిలక్ 'స్వరాజ్యం నా జన్మహక్కు' అని గర్జించినా అతివాదుల, మితవాదుల ఘర్షణలతో చివికిన భారత జాతీయ కాంగ్రెస్ సామాన్య జనకోటి దృష్టిని ఆకర్షించలేకపోయింది. ఇరువై ఏండ్ల పాటు దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహ సమర ప్రయోగాలు కొనసాగించిన మహాత్మా గాంధీ తర్వాత తిలక్, గోఖలే అభ్యర్థనతో స్వదేశానికి శాశ్వతంగా 1915లో తిరిగి వచ్చిన తర్వాతనే, ఆయన నాయకత్వంలో, ఆయన నిర్వహించిన అపూర్వ శాంతియుత పోరాట కార్యక్రమాలతో భారత జాతీయ కాంగ్రెస్ ప్రజల మధ్యకు మొదటిసారి వెళ్లగలిగింది. 1915 జనవరి, 9న బొంబాయిలో అడుగుపెట్టిన తర్వాత గాంధీజీ వెం టనే పోరాటాలకు ఆరాటపడలేదు. తన రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే సలహా పాటించి గాంధీజీ ఖరీదైన దుస్తులను త్యజించి, మోకాళ్ల మీదికి ధోవతితో, చొక్కాలేకుండా కాలి నడకన, మూడో తరగతి రైలు పెట్టెలో దేశమంతటా విస్తృతంగా పర్యటించారు. వందేండ్ల కిందటనే గాంధీజీ ఈ దేశంలోని కోట్లాది ప్రజల పేదరికాన్ని స్వయంగా చూసి సామాన్యుల దారిద్ర్యం, అజ్ఞానం, అమాయకత్వం, అనారోగ్యం, అపరిశుభ్రత గురించి మాట్లాడి, ఈ దుస్థితిని నివారించే మార్గాలను సూచించారు. గాంధీజీని 'డియర్ మహాత్మాజీ' అని సంబోధించిన రవీంద్రనాథ్ టాగోర్ మాటలివి.. 'వేలాది దరిద్రుల, నిరుపేద ల గుడిసెల వాకిళ్ల లో గాంధీజీ వారిలో ఒకడిగా నిలిచాడు. వారి భాషలో మాట్లాడాడు. సజీవ సత్యంగా ఆయన కనిపించాడు. భారతీయులందరు తనవాడని భావించిన వాడు ఆయన ఒక్కడే'.

గాంధీజీ 1917లో చంపారన్, బార్డోలి, పోరాటాలతో మొదలుపెట్టి 1919లో రౌలట్ చట్టం పట్ల నిరసన తెలిపే కార్యక్రమాలతో 1930లో దండి ఉప్పు సత్యాగ్రహం దాకా సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన శాంతియుత కార్యక్రమాలతో, సకల భారతావనికి ఏకైక నాయకుడిగా ప్రశస్తి పొందారు. దాదాపు ముప్పై ఏండ్ల శాంతియుత సత్యాగ్రహ సమరం, ఎడతెగని చర్చలు, సంప్రదింపుల అనంతరం గాంధీజీ అంతిమ అస్త్రంగా 'క్విట్ ఇండియా' పిలుపునిచ్చి బ్రిటిష్ పాలకులను హెచ్చరించడానికి నిర్ణయించారు. అభిప్రాయ భేదాలున్న కొందరు దేశ ప్రజల అభిప్రాయాన్ని గమనించి గాంధీజీ నిర్ణయాన్ని శిరసావహించక తప్పలేదు. వార్ధా ఆశ్రమం నుంచి 1942 ఆగస్టు, 8 నాటికి గాంధీజీ బొంబాయి చేరారు. గాంధీజీ గట్టిగా బలపరచిన క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ, వర్కింగ్ కమిటీ 1942 ఆగస్టు 8న ఆమోదించాయి. ఆగస్టు 9న గాంధీజీని అరెస్టు చేసి పూణెలోని ఆగాఖాన్ భవన్‌లో నిర్బంధించారు. జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయి పటేల్, మౌలానా ఆజాద్, రాజేంద్రప్రసాద్ తదితర అగ్రనాయకులను, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వేలాది కార్యకర్తలను, ఉద్యమకారులను, సామాన్య ప్రజలను బ్రిటిష్ పాలకులు దేశమంతటా జైళ్లలో నిర్బంధించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం ఒక మహోజ్వల ఘట్టం. జైలు నుంచి విడుదలైన తర్వాత సర్దార్ పటేల్, వైశ్రాయి మౌంట్ బాటన్‌తో మాట్లాడుతూ.. 'ఇక మీరు ఈ దేశాన్ని పాలించలేర'న్నారు. ఒక వంక లక్షలాది ప్రజలు, ఉద్యమకారులు సకల త్యాగాలకు సిద్ధమై ముందు నడుస్తున్నప్పుడు కొందరు మీర్ జాఫర్ వంటి ద్రోహులు బ్రిటిష్ పాలకుల ముందు మోకరిల్లి, తలవంచి, క్షమార్పణ పత్రాలు రాసిచ్చి చెంపలేసుకున్నారు. ఆ ద్రోహుల వారసుల కారణంగా ఇప్పటికీ ఈ దేశం సమైక్యతకు విఘాతం కలిగే ప్రమాదం కనిపిస్తున్నది. కుల, మత విద్వేషాల, మతోన్మాద చర్యల, అసహన శక్తుల విజృంభణ ఉండని శాంతియుత భారతం కోసం గాంధీజీ కలలుగన్నారు. ఈ కలలు ఇష్టంకాని మతోన్మాదుల తుపాకి గుండ్లకు ఆయన బలైనారు. పేదరికం నిర్మూలన, హింసాత్మక ధోరణుల నియంత్రణ గాంధీజీ పరమాశయాలు. గాంధీజీ ఆశయాలను ఆచరించడానికి చిత్తశుద్ధితో గత మూడేండ్ల నుంచి అవిరళ, అకుంఠిత, అనల్ప కృషి జరుగుతున్నది ఒక్క తెలంగాణలోనే.. ఏ కంటిలోను కన్నీరు ఉండరాదన్న గాంధీజీ ప్రబోధానికి అంకితమై సత్ఫలితాలను సత్వరంగా చూపిస్తున్నది ఒక్క తెలంగాణ రాష్ట్రమే. ఆంధ్ర పాలకుల దోపిడి, అణచివేత నుంచి అసామాన్య ఉద్యమాలు, అశేష త్యాగాల ఫలితంగా విముక్తి పొంది అద్భుత పునర్నిర్మాణంలో నిమగ్నమైన తెలంగాణ రాష్ట్రం ప్రగతికి భంగం కలిగించే అసహనం స్పష్టంగా కనిపిస్తున్నది. పునర్నిర్మాణానికి, ప్రగతి యాత్రకు అర్థమైన ప్రత్యేక సహకారం అందించడానికి బదు లు ప్రగతి నిరోధక చర్యలను చేపట్టే కుటిల యత్నాలు జరుగుతున్నాయి.

భారత స్వాతంత్రోద్యమం, విశేషించి అందులో ఒక ఉజ్వల ఘట్టమైన క్విట్ ఇండియా సమరం ఈ దేశం భిన్నత్వంలోని ఏకత్వానికి, వసుధైక కుటుంబ భావనకు ప్రతీకలు. బ్రిటిష్ పాలనకు దాసోహమన్న ద్రోహులు తప్ప దేశంలోని అన్ని మతాల, వర్గాల వారు భారత స్వాతంత్రోద్యమంలో స్వచ్ఛందంగా సమిధలైనారు. భారత జాతీయవాదం, దేశభక్తి అసహనానికి, సంకుచిత ధోరణులకు, విద్వేషానికి అతీతమైనవని గాంధీజీ, రవీంద్రనాథ్ టాగోర్ ఉద్బోధించారు. 1913లో 'గీతాంజలి' గీతా సంకలనానికి నోబెల్ బహుమతి పొందిన రవీంద్రుడు 1921 మే నెలలో, స్టాక్‌హోంలో ఆ బహుమతిని స్వీకరిస్తూ కావించిన ప్రసంగంలో భారతీయ ఆత్మను, స్ఫూర్తిని స్పష్టీకరిస్తూ అన్న ఈ మాటలు ఈ రోజు దేశభక్తి, జాతీయవాదం పేరిట అసహనాన్ని, హింసాత్మక ధోరణులను రెచ్చగొడుతున్నవారు గమనించవలసినవి. "I do not think that it is the spirit of India to reject anything, reject any race, reject any culture. The spirit of India has always proclaimed the ideal of unity. This ideal of unity never rejects anything, any race or any culture. India is there to unite all human races.." రవీంద్రుడు విశ్వకవీశ్వరుడే కాదు, విఖ్యాత ఆధ్యాత్మిక భావ సంపన్నుడు. ఏడు పదుల భారతం ఇప్పుడు ఏ మార్గంలో పయనిస్తున్నదన్నది కీలక ప్రశ్న. దేశంలో గడిచిన మూడేండ్ల నుంచి సామాజిక, రాజకీయ, ఆర్థిక, ప్రజాస్వామ్య, పరిపాలనా రంగాల్లో జరుగుతున్న విఫల, విష ప్రయోగాలు, వితండ వాదనలు, వక్రభాష్యాలు ప్రజాతంత్ర వాదులకు కలవరం కలిగించడం సహజం. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రమాదకరంగా విస్తరణవాదం విజృంభిస్తున్నది. భారత రాజ్యాంగం ప్రసాదించిన ఫెడరల్ వ్యవస్థకు, ఫెడరల్ ప్రజాస్వామ్యానికి ఏకచ్ఛత్రాధిపత్యంతో తిలోదకాలిచ్చే ప్రయత్నాలు జోరుగా జరుగుతున్నాయి. 1980లో జనతా పార్టీ పక్షాన గెలిచిన భజన్‌లాల్ మొత్తం పార్టీని మూటగట్టి పార్టీ ఫిరాయించినప్పుడు కూడా ఇటువంటి ప్రమాదం కనిపించలేదు. హఠాత్తుగా నోట్ల రద్దు, సర్జికల్ స్ట్రైక్స్, జీఎస్టీ తదితర చర్యలు ఆశించిన ఫలితం కంటే ఊహించని నష్టాలు ఎక్కువ కలిగిస్తున్నాయని అంగీకరించడానికి సిద్ధంగా లేరు. ప్రజాస్వామ్య ముసుగుతో అమలవుతున్న నిరంకుశ విధానాలు, శుష్క నినాదాలు విపరీత పరిణామాలకు దారితీస్తున్నాయి. మూడేండ్లయినా కశ్మీరు మంటలు ఆరడం లేదు. రెండు నెలలైనా డోక్లాం వివాదం కొనసాగుతున్నది. ఈ వివాదంలో ప్రపంచ దేశాలన్నీ మనల్నే సమర్థిస్తున్నాయని విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ ప్రకటించిన మరునాడే నేపాల్ విదేశాంగ మంత్రి మేము ఎవరినీ సమర్థించడం లేదని ప్రకటించడం గమనార్హం.

ప్రజాస్వామ్య ముసుగుతో అమలవుతున్న నిరంకుశ విధానాలు, శుష్క నినాదాలు విపరీత పరిణామాలకు దారితీస్తున్నాయి. మూడేండ్లయినా కశ్మీరు మంటలు ఆరడం లేదు. రెండు నెలలైనా డోక్లాం వివాదం కొనసాగుతున్నది. ఈ వివాదంలో ప్రపంచ దేశాలన్నీ మనల్నే సమర్థిస్తున్నాయని విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ ప్రకటించిన మరునాడే నేపాల్ విదేశాంగ మంత్రి మేము ఎవరినీ సమర్థించడం లేదని ప్రకటించడం గమనార్హం.


గ్రంథాలయాలే వెలుగుబాటలు

విశ్లేషణ



డాక్టర్ కందిమళ్ళ భారతి

'విద్య ఒక నిరంతర ప్రక్రియ. తల్లి ఒడిలో కూర్చొని మాటలు నేర్చుకోవడం మొదలుకొని మనిషి మరణించేదాకా ఏదో ఒక అంశాన్ని తెలుసుకుంటూనే ఉంటాడు, అభ్యసిస్తూనే ఉంటాడు. జ్ఞానాన్ని పెంచుకుంటూనే ఉంటాడు. ఈ జ్ఞాన సముపార్జనకు ప్రధానమైన మార్గం గ్రంథాలయం. ఇదొక సార్వజనీన శాశ్వత స్వయంశిక్షణ సాధనం. ప్రజలందరికీ సమానావకాశాలు కల్పించే ఏకైక మందిరం. అందుకే గ్రంథాలయాన్ని ఎలాంటి ప్రతిఫలం కోరకుండా సేవ చేసే సంస్థ అంటారు. 'గ్రంథాలయ ఉపయోగం మనకున్న ధనసంపదను బట్టి గాక, దాన్ని మనం ఉపయోగించుకోగల శక్తిని బట్టి నిర్ణయమవుతుంది' అంటారు పద్మశ్రీ షియాలి రామామృత రంగనాథన్. ఇది ఆ మహా మానవుడి 125వ జయంతి సందర్భం. ఆయన గ్రంథాలయ శాస్త్రానికి సంబంధించిన ఎన్నో నూతన సిద్ధాంతాలను రూపొందించారు. దేశంలో గ్రంథపాలకుల హోదాను అధ్యాపకులతో సమం చేయడానికి అద్వితీయమైన కృషి చేశారు. ఆ దార్శనికుని జయంతిని పురస్కరించుకొని గ్రంథాలయాల గురించి మాట్లాడుకుందాం.



గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. ఆధునిక దేవాలయాలు. వీటిలో సకల శాస్త్రాలకు, కళలకు, సాహిత్య ప్రక్రియలకు సంబంధించిన గ్రంథాలు పాఠకుల కోసం ఎదురుచూస్తుంటాయి. దిన, వార, మాస పత్రికలెన్నో అందుబాటులో ఉంటాయి. ప్రపంచ పరిజ్ఞానమంతా గ్రంథాల్లో భద్రపరచబడి ఉంటుంది. ఒక వ్యక్తి శీలాన్ని, సంస్కారాన్ని, వ్యక్తిత్వాన్ని రూపొందించేవి గ్రంథాలయాలే. గ్రంథాలయాలకు వెళ్ళేవారి ప్రవర్తనలో, వెళ్ళనివారి ప్రవర్తనలో స్పష్టమైన తేడా కనబడుతుంది.

పిల్లల కోసం బాల సాహిత్యం, వృద్ధుల కోసం పురాణ సాహిత్యం, అన్ని వయస్సుల వారికి ఉపయోగపడే సాహిత్య గ్రంథాలు గ్రంథాలయంలో దొరుకుతాయి. పుస్తక పఠనం గొప్ప వరం. మన ఆలోచనా తీరుతెన్నులను, స్పందించే పద్ధతులను, జీవన విధానాన్ని మనం చదివే గ్రంథాలు ప్రభావితం చేస్తాయి. 'నేను ఫలానా పుస్తకం చదివి నా జీవిత గమనాన్ని ఎంచుకున్నాను' అనే ప్రముఖ వ్యక్తుల మాటలను మనం వింటూనే ఉంటాం. అంటే మన మీద పుస్తకాల ప్రభావం ఎంతో ఉంటుంది. మనకు తెలియకుండానే మనకు సంస్కారం ఎలా రూపొందుతుందో దీన్నిబట్టే అర్థమవుతున్నది.

ప్రపంచంలో పేరెన్నికగన్న ప్రముఖ వ్యక్తుల అనుభవాలు, సమాజంలో గుర్తింపుపొందిన సుప్రసిద్ధుల జీవిత చరిత్రలు, దేశభక్తుల స్వీయ చరిత్రలు చదువడం మనకు స్ఫూర్తినిస్తుంది. మన జీవిత గమ్యాన్ని, గమనాన్ని ప్రభావితం చేస్తుంది. గ్రంథాలయాలకు వెళ్ళకముందు మనకు అనేక విషయాలు తెలుసునన్న భ్రమ, విశ్వాసం చాలామందికి ఉంటుంది. గ్రంథాలయ సందర్శనం ద్వారా, ఉత్తమ గ్రంథాలు చదివిన తర్వాత మనకు తక్కువ తెలుసునని అర్థం అవుతుంది. మనం తెలుసుకోవలసింది, నేర్చుకోవలసింది చాలా ఉందని బోధపడుతుంది. అజ్ఞానపు చీకట్లు తొలిగిపోతాయి. విజ్ఞానపు జ్యోతులు వెలుగడం ప్రారంభమవుతుంది. భారత జాతీయోద్యమం, తెలంగాణ విమోచనోద్యమం మొదలైన ప్రజా ఉద్యమాలన్నింటికీ గ్రంథాలయాలు కేంద్ర బిందువులుగా ఉన్నాయి. తెలుగునాట తెలుగుభాషా పరిరక్షణోద్యమం గ్రంథాలయాల ద్వారానే ప్రారంభమైంది. పదిమంది మేధావులు, దేశభక్తులు, సమాజ సేవాతత్పరులు ఒకచోట చేరడానికి, చర్చించుకోవడానికి, సమాలోచన చేయడానికి గ్రంథాలయాలు తోడ్పడుతాయి. గ్రంథాలయాల్లో సమావేశ మందిరాలు, సభాస్థలులు కూడా ఉంటాయి. అక్కడ ప్రయోజనకరమైన సదస్సులు, ఇష్టాగోష్ఠి జరుగుతుంటాయి. ఇవి గ్రంథాలయ పాఠకుల మానసిక వికాసానికి ఉపయోగపడుతాయి.

గ్రంథాలయాల అవసరాన్ని, ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ఒక రాష్ట్ర గ్రంథాలయాన్ని, గ్రంథాలయ శాఖను ఏర్పాటుచేసింది. అలాగే అన్ని జిల్లాల్లో జిల్లా గ్రంథాలయాలు, ప్రముఖ నగరాల్లో నగర గ్రంథాలయాలు, ప్రాంతీయ గ్రంథాలయాలు, శాఖా గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. పాఠకులకు కావలసిన విలువైన, అపురూపమైన గ్రంథాలు నేడు అందుబాటులో ఉన్నాయి. వాటిని చదివి జ్ఞానం పెంచుకోవలసిన బాధ్యత పాఠకులదే. కాలం మారుతున్న కొద్దీ కాలంతో పాటు గ్రంథాలయాల తీరుతెన్నులూ, పని విధానంలోనూ క్రమంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పుడు గ్రంథాలయాలు కేవలం గ్రంథాలను నిలువజేసే కేంద్రాలుగా కాకుండా సేవాకేంద్రాలుగా పరిణామం చెందుతున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మనం సాధిస్తున్న ప్రగతి ప్రభావాలు గ్రంథాలయాల పైన కూడా స్పష్టంగానే పడుతున్నాయి. ప్రచురిత గ్రంథాల స్థానంలో క్రమంగా ఎలక్ట్రానిక్ సాధనాలు వచ్చేస్తున్నాయి. కంప్యూటర్ వినియోగం, ఇంటర్నెట్ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో గ్రంథాలయ వ్యవస్థలోనూ మౌలికమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అయినా సకల శాస్త్రాలకూ, సాంకేతిక విజ్ఞానానికి వెన్నెముకగా కొనసాగుతున్నది గ్రంథాలయాలే.

పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో గ్రంథాలయాలు ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉన్నాయి. నేడు మనం గర్వంగా చెప్పుకుంటున్న గొప్ప దేశభక్తులు, జాతీయోద్యమ నాయకులు, మహాకవులు, రచయితలు, మేధావులు, శాస్త్రవేత్తలు, కళాకారులు అందరూ గ్రంథాలయాల నుంచి సమాజంలోకి వచ్చినవారే. ఈ సమాజ గమనాన్ని ప్రభావితం చేసినవారే. ఈ వాస్తవాన్ని మనం గమనంలో పెట్టుకోవాలి. గ్రంథ పఠనం ఒక ఆరోగ్యకరమైన అలవాటు. ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే విజ్ఞాన కేంద్రాలైన గ్రంథాలయాలకు వెళ్దాం. ఉత్తమ గ్రంథాల నుంచి స్ఫూర్తిని పొందుదాం. మన వ్యక్తిత్వాలను రూపొందించుకుందాం. 'ఒక మంచి పుస్తకం, ఒక మంచి మిత్రుడితో సమానం' అన్న సూక్తిని గుర్తుంచుకుందాం. ఎంతో జ్ఞానసంపద గ్రంథాలయాల రూపంలో మనకు అందుబాటులో ఉన్నది. ఆ గ్రంథాలయాలను ఉపయోగించు కొని జ్ఞానసంపదను వృద్ధి చేసుకుందాం. ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు మనవంతుగా పాటుపడుదాం.

(నేడు పద్మశ్రీ షియాలి రామామృత రంగనాథన్ జయంతి..)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

డిసెంబర్ 5 నుంచి 'అయోధ్య'పై తుది విచారణ: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 11: అయోధ్యలోని రామ జన్మభూమి-బాబ్రీ మసీదు స్థల వివాదంపై తుది వాదనలను డిసెంబర్ 5వ తేదీ నుంచి విననున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేయబోమని స్పష్టం చేసింది. ఈ వివాదానికి కేంద్ర బిందువైన 2.77 ఎకరాల భూమి పంపకం విషయంలో మూడు మార్గాలు సూచిస్తూ అలహాబాద్ హైకోర్టు 2010లో తుది తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2011లో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సస్పెండ్ చేసింది. ఈ కేసులో దాఖలైన అప్పీళ్లన్నింటిపై త్వరలో విచారణ చేపట్టి తుది తీర్పునిస్తామని స్పష్టం చేసింది. అయితే ఇప్పటివరకు సుప్రీంకోర్టు ఎలాంటి వాదనలు వినలేదు. ఈ నేపథ్యంలో జస్టిస్‌లు దీపక్ మిశ్రా, అశోక్ భూషణ్, అబ్దుల్ నజీర్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. తుది వాదనలను డిసెంబర్ 5వ తేదీ నుంచి విననున్నట్టు ప్రకటించింది.

బీహార్‌లో కలెక్టర్ ఆత్మహత్య

- జీవితంపై విరక్తితోనేనని సూసైడ్‌నోట్



ఘజియాబాద్, ఆగస్టు 11: సీనియర్ ఐఏఎస్ అధికారి, బీహార్‌లోని బక్సర్ జిల్లా కలెక్టర్ ముకేశ్‌పాండే గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. శుక్రవారం ఉదయం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్ స్టేషన్‌కు సమీపంలోని రైలు పట్టాలపై ఆయన మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు, సూసైడ్‌నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. 2012 బ్యాచ్‌కు చెందిన పాండే.. జీవితంపై విరక్తితో ఢిల్లీలోని ఓ హోటల్ పదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నానని మొదట సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. అయితే ఘజియాబాద్‌లోని పట్టాలపై మృతదేహం లభించిందని, ఘటనాస్థలంలో దొరికిన పేపర్‌లో మాత్రం హోటల్‌లో సూసైడ్ నోట్ పెట్టినట్లు రాశారని సీనియర్ ఎస్పీ హెచ్‌ఎన్ సింగ్ తెలిపారు. ఐఏఎస్ ముకేశ్ మృతిపట్ల సీఎం నితీశ్ సంతాపం తెలిపారు.

ఉత్తర కొరియాపై సైనిక చర్యకు సిద్ధం

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 11: అమెరికాపై క్షిపణిదాడులు చేస్తామని బెదిరిస్తున్న ఉత్తర కొరియాపై సైనిక చర్యకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఆ దేశం గనుక తెలివితక్కువగా వ్యవహరిస్తే చర్య తప్పదని హెచ్చరించారు. ప్రపంచాన్ని అణువిముక్తం చేయాలని అనుకొంటున్నానని చెప్పారు. న్యూజెర్సీ రాష్ట్రంలోని బెడ్‌మినిస్టర్ ప్రాంతంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రపంచానికి భూతాపమే మహా ఉపద్రవమన్న మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా అభిప్రాయంతో ఏకీభవించనని, అణ్వాయుధాలు అంతకన్నా పెనుముప్పు అని తెలిపారు. ఈ ముప్పు తొలిగిపోవాలంటే అమెరికా, రష్యా, చైనా, పాకిస్థాన్‌తోపాటు అన్ని దేశాలు తమ వద్ద ఉన్న అణ్వాయుధాలను నిర్మూలించాలన్నారు. 755 మంది దౌత్యసిబ్బందిని రష్యా వెనకకు పంపడం వల్ల వేతనాల బిల్లు తగ్గి తమకు మేలే జరిగిందని, ఇందుకు పుతిన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు.

యూపీలో 30 మంది చిన్నారుల మృత్యువాత

- ఆక్సిజన్ కొరతే కారణమని విమర్శలు



గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ దవాఖానలో చికిత్స పొందుతున్న చిన్నారులు

గోరఖ్‌పూర్, ఆగస్టు 11: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ సొంత లోక్‌సభ నియోజకవర్గం గోరఖ్‌పూర్ కేంద్రంలోని ప్రభుత్వ బాబా రాఘవ్‌దాస్ మెడికల్ కళాశాల దవాఖానలో గత రెండు రోజుల్లో 30 మంది బాలలు మృత్యువాత పడ్డారు. నవజాత శిశువుల వార్డులో 17 మంది, మెదడు వాపు నివారణ వార్డులో ఐదుగురు, జనరల్ వార్డులో ఎనిమిది మంది మృతి చెందారు. ఈ మృతులకు కారణాలను తెలుసుకునేందుకు విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ రౌతేలా చెప్పారు. నివేదిక అందాక కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. గురువారం అర్ధరాత్రి దాటి తర్వాత ఏడుగురు చిన్నారులు మృతి చెందగా, ఈ నెల 9, 10 తేదీల్లో 23 మంది మరణించారని రాజీవ్ రౌతేలా చెప్పారు. ఆక్సిజన్ సౌకర్యం లేకపోవడంవల్లే చిన్నారులు మృతిచెందారని విమర్శలు వెలువడ్డాయి. అయితే ఆక్సిజన్ సిలిండర్లు సరిపడా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.



ప్రమాణస్వీకారం అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న వెంకయ్యనాయుడు





ప్రమాణానికి ముందు గాంధీజీ సమాధి, దీన్‌దయాళ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకయ్య



చైర్మన్ హోదాలో రాజ్యసభకు వచ్చిన వెంకయ్యనాయుడుకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ చైర్మన్ కురియన్, వివిధ పక్షాల నేతలు

టీం ఇండియా స్ఫూర్తితో పనిచేద్దాం

- పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రతిష్ఠను పెంచుదాం
- సమర్థవంతమైన చట్టాల రూపకల్పనలో రాజ్యసభ కీలకపాత్ర పోషించాలి
- రాజ్యసభ చైర్మన్‌గా వెంకయ్య తొలి ప్రసంగం
- చర్చకు ప్రతీ ఎంపీకి అవకాశం కల్పిస్తానని హామీ
- వెంకయ్య నాయుడుతో ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేయించిన రాష్ట్రపతి రామ్‌నాథ్



రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్‌హాల్‌లో ప్రమాణం అనంతరం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో కరచాలనం చేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: 'టీం ఇండియా స్ఫూర్తితో పనిచేద్దాం. సహకార సమాఖ్య స్ఫూర్తితో పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రతిష్ఠను ఇనుమడింపజేద్దాం' అని అధికార, ప్రతిపక్షాలకు కొత్త ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. రాజకీయ భేదాభిప్రాయాల ప్రభావాన్ని పార్లమెంటరీ వ్యవస్థపై పడనీయొద్దని, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పేర్కొన్నట్లుగా 'భిన్న కోణాల్లో ఆలోచిద్దాం.. చర్చిద్దాం.. అంతిమంగా నిర్ణయిద్దాం' అన్న విషయాన్ని సదా గుర్తుంచుకోవాలని హితవు పలికారు. దశాబ్దాల క్రియాశీల రాజకీయ జీవితాన్ని విడిచిపెట్టి.. రాజ్యాంగబద్ధమైన ఉపరాష్ట్రపతి పదవిని వెంకయ్యనాయుడు శుక్రవారం చేపట్టారు. ఆయన చేత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణం చేయించారు. రాష్ట్రపతిభవన్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో వెంకయ్య.. హిందీలో దేవుడి సాక్షిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రులు, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, విపక్షాల నేతలు, రాష్ట్రాల సీఎంలు, వివిధ దేశాల రాయబారులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు రాజ్‌ఘాట్‌కు వెళ్లిన వెంకయ్యనాయుడు జాతిపిత మహాత్మాగాంధీకి నివాళి అర్పించారు. సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విగ్రహాల వద్ద ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంలో వెంకయ్య వెంట ఆయన సతీమణి ఉష కూడా ఉన్నారు. అనంతరం వెంకయ్య రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి.. అక్కడ ప్రమాణం చేశారు. ఉపరాష్ట్రపతిగా పదవీబాధ్యతలు స్వీకరించిన తర్వాత చైర్మన్ హోదాలో రాజ్యసభకు వెళ్లారు. పెద్దలసభ సభ్యులు వెంకయ్యకు ఘనస్వాగతం పలికారు. ఆయనను అభినందిస్తూ.. ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత గులాంనబీఆజాద్, వివిధ పార్టీల ఎంపీలు మాట్లాడారు. అనంతరం, వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ 'టీం ఇండియా' స్ఫూర్తితో పనిచేద్దామని ఎంపీలకు పిలుపునిచ్చారు. 'భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత. ఉమ్మడి ప్రయోజనాల కోసం ఐక్యంగా ఉండలేమా? దేశ యువత ఆకాంక్షలు నెరవేర్చలేమా? భిన్నాభిప్రాయాలను వెల్లడించే గొప్ప అవకాశాన్ని ప్రజాస్వామ్యం మనకు కల్పించింది. రాజకీయాల్లో భేదాభిప్రాయాల ప్రభావం పార్లమెంటరీ వ్యవస్థపై పడనీయొద్దు. సహకార సమాఖ్య స్ఫూర్తితో పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రతిష్ఠను ఇనుమడింపజేద్దాం' అని పిలుపునిచ్చారు. వివిధ అంశాలను స్పృశిస్తూ వెంకయ్య ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

'పెద్దల సభలో సభ్యులు వివిధ రంగాలకు చెందినవారై ఉంటారు. ఆ రంగాలపై వారికి లోతైన పరిజ్ఞానం ఉంటుంది. అందుకనుగుణంగా వివిధ అంశాలపై జరిగే చర్చలను సభ్యులు సుసంపన్నంచేయాలి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్న దేశం మనది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మనకు గుర్తింపు ఉంది. దానికి అనుగుణంగా సమగ్రంగా, సమర్ధవంతమైన చట్టాల రూపకల్పనలో రాజ్యసభ కీలకపాత్ర పోషించాలి. సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలున్నా పరస్పర సహకారంతో దేశ ప్రయోజనాలు, ప్రజాకాంక్షలకు అనుగుణంగా మెలగాలి. వంద రోజులకన్నా తక్కువగా జరిగే పార్లమెంట్ సమావేశాల్లో విలువైన సమయం పూర్తిగా సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. ఏడు దశాబ్దాల్లో మనం కోల్పోయిన వాటి సాకారం దిశగా కృషి జరుగాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లవుతున్నా పేదరికం, నిరక్షరాస్యత, అసమానత్వం, గ్రామీణ-పట్టణాల అంతరాలు, అధికార దుర్వినియోగం వంటివి సవాళ్లుగా ఉన్నాయి. వాటిని ఎదుర్కోవాలి.

సభ్యుడి స్థాయి నుంచి చైర్మన్ వరకు..

నేను నాలుగు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నా. సభానాయకుడిగా వస్తానని ఎన్నడూ ఊహించలేదు. పార్లమెంట్‌లో తమ సమస్యలు చర్చిస్తారని, పరిష్కారం లభిస్తుందన్న అభిప్రాయంతో ప్రజలు ఉన్నారు. సభలో గందరగోళం జరిగితే దానిపై ప్రజలు ఆందోళన చెందుతుంటారు. ఎంపీలందరూ దీనిపై ఆత్మపరిశీలన చేసుకోవాలి. సభలో సభ్యుల మాట, ఆచరణ ఆదర్శంగా ఉండాలి. చట్టాల సవరణ, కొత్త చట్టాల రూపకల్పనలో రోల్‌మోడల్‌గా ఉండాలి. ఆర్థిక, సామాజిక పురోగతి బాధ్యత కేవలం ప్రభుత్వానిది మాత్రమే కాదు. విపక్షాలు మరింత బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలి. నేను విపక్ష సభ్యుడిగా ప్రభుత్వ విధానాల్లోని లోపాలను, పొరపాట్లను ఎత్తిచూపాను. చాలా తీవ్ర విమర్శలు చేశాను. కానీ ఎన్నడూ హద్దులు దాటలేదు.

మహనీయుల స్ఫూర్తితో బాధ్యతగా వ్యవహరించాలి

రాజ్యాంగం ప్రబోధించిన విలువలను, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని, మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి మహనీయుల ఆలోచనలు, దేశ విముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను గుర్తుచేసుకుంటూ సభా సమావేశాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరిద్దాం. చైర్మన్‌గా నాకు అన్ని పార్టీలూ, సభ్యులందరూ సమానమే. ఏ అంశంపై ప్రస్తావనకైనా సభ్యుడికి అవకాశం కల్పించడానికి నేను సిద్ధం ' అని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

ప్రధాని మోదీతో తమిళనాడు సీఎం భేటీ

- విలీనంపై ప్రధానికి వివరించేందుకే సమావేశమని ఊహాగాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఏఐఏడీఎంకే పార్టీలోని రెండు వర్గాలు విలీనం కానున్నాయనే ఊహాగానాల నేపథ్యంలో తమిళనాడు సీఎం కే పళనిస్వామి శుక్రవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీతో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గురువారం నిర్వహించిన పార్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రధానికి వివరించేందుకే ఆయన మోదీతో సమావేశమయ్యారనే ప్రచారం జోరుగా సాగింది. ఇదే సమయంలో మాజీ సీఎం పన్నీరు సెల్వం సైతం ఢిల్లీలోనే ఉండటంతో ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. ఈ భేటీలో పార్టీ విషయాలేవీ చర్చించలేదని, నీట్ పరీక్ష నుంచి తమ రాష్ట్రానికి మినహాయింపు ఇవ్వాలని మాత్రమే సీఎం కోరారని చెన్నైలో అధికారిక ప్రకటన విడుదలైంది. మరోవైపు ఏఐఏడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ దినకరన్‌కు వ్యతిరేకంగా పార్టీ చేసిన తీర్మానం ప్రతిని పన్నీరు సెల్వం ఎన్నికల సంఘానికి అందజేశారు.

నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ శరద్‌యాదవ్‌కు ఉంది: నితీశ్

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఏ నిర్ణయమైనా తీసుకునే స్వేచ్ఛ శరద్‌యాదవ్‌కు ఉందని జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ చెప్పారు. 'పార్టీ నిర్ణయం తీసుకున్నది. ఇక మిగిలింది ఆయన తన నిర్ణయం తీసుకోవడమే' అని పేర్కొన్నారు. పార్టీలో ఉండలా? వద్దా? అనేది శరద్‌యాదవే తేల్చుకోవాలని నితీశ్ పరోక్షంగా సంకేతాలిచ్చినట్లయ్యింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన అనంతరం నితీశ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మహాకూటమి నుంచి వైదొలిగి బీజేపీతో చేతులు కలిపిన అనంతరం నితీశ్ తొలిసారిగా ఢిల్లీ వచ్చారు. ఉపరాష్ట్రపతి ప్రమాణస్వీకారోత్సవ అనంతరం ప్రధాని మోదీ, బీజేపీ చీఫ్ అమిత్‌షాలతో ఆయన సమావేశమయ్యారు. రాజకీయ పరిణామాలు, ప్రభుత్వంలో చేరికపై వారు చర్చించారు.

సాధారణ నేపథ్యం.. అసాధారణ ఎదుగుదల

- ఇది మన ప్రజాస్వామ్య గొప్పతనం
- స్వాతంత్ర్యానంతరం జన్మించిన తొలి ఉపరాష్ట్రపతి వెంకయ్యే : మోదీ



శుక్రవారం రాజ్యసభలో ప్రధాని మోదీ మాట్లాడుతున్న దృశ్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 11: రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి లాంటి దేశ అత్యున్నత పదవుల్లో సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగిన వ్యక్తులు కూర్చున్నారని, ఇది ప్రజాస్వామ్య పరిణతిని తెలియజేస్తున్నదని ప్రధాని మోదీ అన్నారు. ఉపరాష్ట్రపతిగా నియమితులైన వెంకయ్య శుక్రవారం రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మోదీ ఆయనకు స్వాగతం పలికారు. అట్టడుగు, వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతిగా, వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా అత్యున్నత స్థానాలను అలంకరించడం అందరికీ గర్వకారణమన్నారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించిన తొలి ఉప రాష్ట్రపతి వెంకయ్యేనని చెప్పారు. వెంకయ్య వాక్చాతుర్యం అద్భుతమని, అకట్టుకునేలా మాట్లాడటం ఆయన నుంచి నేర్చుకోవాలని అన్నారు. గ్రామీణాభివృద్ధి కోసం ఆయన చాలా కృషి చేశారని, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనను ఆయనే రూపొందించారని తెలిపారు. సహచర న్యాయవాది.. న్యాయమూర్తిగా మారితే ఎలా ఉంటుందో తమ పరిస్థితి అలా ఉందని మోదీ చమత్కరించారు.

స్వాతంత్ర్యం కోసం ధనికులూ త్యాగాలు చేశారు : ఆజాద్

స్వాతంత్రోద్యమంలో పేదలే కాదు, ధనికులూ త్యాగాలు చేశారని రాజ్యసభలో కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ అన్నారు. రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకయ్యనాయుడుకు స్వాగతం పలికిన సందర్భంగా.. పేదింటి నుంచి వచ్చినవారు అత్యున్నత పదవులను అలంకరించారన్న మోదీ వ్యాఖ్యలను ఆజాద్ పరోక్షంగా ప్రస్తావించారు. మోతీలాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, సుభాష్ చంద్రబోస్ వంటివారు తమ ఆస్తుల్ని స్వాతంత్ర్యోద్యమం కోసం ధారపోశారని, జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. 'పేదలు, ధనికులు అన్న తేడా కాదు.. ఇది ప్రజాస్వామ్యం అందరికీ అందించిన అవకాశం' అని ఆజాద్ పేర్కొన్నారు.

19 రోజుల్లో 11 బిల్లులకు ఆమోదం

- ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు శుక్రవారం ముగిశాయి. గత నెల 17న రాష్ట్రపతి ఎన్నికలతో మొదలైన సమావేశాలు శుక్రవారం ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారంతో నిరవధిక వాయిదా పడ్డాయి. మొత్తం 19 రోజులు జరిగిన సమావేశాల్లో 15కొత్త బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టగలిగింది. పెండింగ్ బిల్లులతో కలిపి మొత్తం 34 బిల్లులకుగాను 11 బిల్లులు మాత్రమే ఆమోదం పొందాయి. రెండు ఆర్థిక అనుబంధ బిల్లులను ఆమోదించాయి. ఐఐఎం బిల్లు, ట్రిపుల్ ఐటీ సవరణ బిల్లు, ఉచిత నిర్బంధ విద్య బిల్లు, నాబార్డు సవరణ బిల్లు, కంపెనీల సవరణ బిల్లు, ఫ్యాక్టరీల సవరణ బిల్లు, బ్యాంకుల క్రమబద్ధీకరణ బిల్లు, స్టేట్‌బ్యాంకుల విలీన బిల్లు, జమ్ముకశ్మీర్ జీఎస్టీ బిల్లు తదితర బిల్లులకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. లోక్‌సభ 67శాతం, రాజ్యసభ 72శాతం పనితీరు కనబర్చాయి. గోరక్షకుల దాడులు, వరదలు, వ్యవసాయ రంగ సంక్షోభం తదితర అంశాలపై ఉభయ సభలు చర్చించాయి. లోక్‌సభలో 76.6 గంటల పాటు సమావేశాలు జరగ్గా, రాజ్యసభ 81 గంటల పాటు జరిగింది. మొత్తం ఈ 19 రోజుల సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయం లోక్‌సభలో 12.1 గంటలు, రాజ్యసభలో 8.2 గంటల పాటు జరిగాయి. లోక్‌సభలో 53 ప్రశ్నలకు, రాజ్యసభలో 46 ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. లోక్‌సభలో టీఆర్‌ఎస్ ఎంపీల సగటు హాజరు 70%గా నమోదైనట్లు పీఆర్‌ఎస్ గణాంకాల ద్వారా తెలుస్తున్నది.

సెన్సార్ బోర్డు చైర్మన్ పహ్లాజ్ నిహలానీ తొలగింపు

- కొత్త చైర్మన్ ప్రసూన్ జోషి: సభ్యులుగా జీవిత, గౌతమి

న్యూఢిల్లీ, ఆగస్టు 11: సెన్సార్‌బోర్డు చైర్మన్ పహ్లాజ్ నిహలానీని తొలగిస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. నిహలానీ స్థానంలో పాటల రచయిత ప్రసూన్ జోషి (45)ని సెన్సార్ బోర్డు చైర్మన్‌గాగా నియమించినట్లు కేంద్ర సమాచార, ప్రసారాల మంత్రిత్వశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 12 మంది సభ్యులతో బోర్డును పునర్వ్యవస్థీకరించినట్లు సెన్సార్ బోర్డు సీఈవో అనురాగ్ శ్రీవాత్సవ్ తెలిపారు. కొత్తగా నియమితులైన సభ్యుల్లో జీవితా రాజశేఖర్, గౌతమి తాడిమల్ల, విద్యాబాలన్, నరేంద్ర కోహ్లి తదితరులున్నారు.

సరిహద్దుల్లో సైన్యం మోహరింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 11: చైనాతో ఉన్న సరిహద్దుల వెంబడి సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ పరిధిలో అదనపు సైనిక బలగాలను మోహరించాలని కేంద్రం నిర్ణయించింది. డోక్లాం ముక్కోణ జంక్షన్ వద్ద చైనాతో ఉద్రిక్తత కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్రం వ్యూహాత్మకంగా బలగాలను మోహరించిందని రక్షణ శాఖ అధికారులు తెలిపారు.సరిహద్దుల్లో చైనా భారీగా సైన్యాన్ని మోహరించిన నేపథ్యంలో సిక్కిం నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు 1,400 కి.మీ పొడవునా బలగాలను మోహరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు సుమారు 45 వేల మంది సైనికులను తరలించారని సమాచారం.



ఢిల్లీలో శుక్రవారం సోనియా అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన బెంగాల్ సీఎం మమతాబెనర్జీ (తృణమూల్), అహ్మద్‌పటేల్, గులాంనబీ ఆజాద్, ఏకే ఆంటోనీ (కాంగ్రెస్), డీ రాజా (సీపీఐ), వివిధ విపక్ష పార్టీల నాయకులు

16 ప్రతిపక్ష పార్టీల భేటీ

- బీజేపీని ఎదుర్కోవడంపై చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు 11: పదహారు ప్రతిపక్ష పార్టీలు శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ అధ్యక్షతన సమావేశమయ్యాయి. సమావేశానికి ఎన్సీపీ గైర్హాజరు కాగా.. జేడీయూ అసంతృప్త ఎంపీ అలీ అన్వర్ అన్సారీ హాజరయ్యారు. బీహార్‌లో జేడీయూ బీజేపీతో పొత్తుపెట్టుకోవడాన్ని ఆయన వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినాయకురాలు మమతాబెనర్జీ, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సహా మిగతా పార్టీల నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఏకమవడానికి అనుసరించాల్సిన విధానాలపై ఈ భేటీలో చర్చించామని సీతారాం ఏచూరి తెలిపారు. ముఖ్యంగా రైతుల సమస్యలపై పోరాడుతామని ఆయన స్పష్టంచేశారు. 2014లో కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ.. వరుసగా రాష్ట్రాల్లో విజయం సాధిస్తున్నది. ఈ క్రమంలో ప్రతిపక్ష పార్టీలు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించాయి.






స్పీకర్ ఇంట పెండ్లి సందడి

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి చిన్న కుమారుడు క్రాంత్‌కుమార్ వివాహం కే రవిచారి కుమార్తె నవ్యతో శుక్రవారం హైదరాబాద్ శివారులోని శంషాబాద్ కేఎల్‌సీపీ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, కేటీఆర్, ఎంపీలు కవిత, బాల్క సుమన్, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, టీ న్యూస్ ఎండీ జోగినపల్లి సంతోష్‌కుమార్ తదితరులు.

రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

అత్యధికంగా మహబూబాబాద్‌లో 11.9 సెం.మీటర్లు

రానున్న రోజుల్లో ఆశాజనకంగా..

సోమవారం నుంచి ఊపందుకోనున్న వానలు



హైదరాబాద్‌లోని ఎల్లారెడ్డిగూడలో శుక్రవారం కురుస్తున్న వర్షం

హైదరాబాద్/న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: ఒడిశా నుంచి కోస్తాంధ్రా మీదుగా దక్షిణ తమిళనాడు వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో మూడో రోజైన శుక్రవారం కూడా పలు జిల్లాల్లో చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. గాలుల దిశలో మార్పుతో నైరుతి రుతుపవనాల్లో కాస్త వేగం తగ్గినందున శని, ఆదివారాల్లో చాలా ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ బేగంపేటలోని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం నుంచి రెండ్రోజులపాటు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్, అమీర్‌పేట, బేగంపేట, ఖైరతాబాద్, కోఠి, ముషీరాబాద్ తదితర చోట్ల శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. నగర వ్యాప్తంగా సగటున 7 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 11.9 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడ మండలంలో 14.5 మి.మీ., డోర్నకల్ 10.4, కురవి 9.2, మహబూబాబాద్ 16.4, గూడూరు 21.4, మరిపెడ 4.4, నెల్లికుదురు 5.4, నర్సింహులపేట 18.2, తొర్రూరు 9.6 మి.మీటర్లు కురువగా, గంగారం, కేసముద్రం, చిన్నగూడూరు, దంతాలపల్లి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో అత్యధికంగా 11.6 మి.మీటర్ల వర్షం కురిసింది. చింతపల్లిలో 10.4 మి.మీ., మిర్యాలగూడలో 7.4, త్రిపురారంలో 6.4, పెద్దఅడిశర్లపల్లిలో 6.2, కట్టంగూర్ 5.6, చిట్యాల 5.0 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా మంచాల్‌లో 3.4 సెం.మీలు, పెద్దముల్‌లో 1.9 సెం.మీ., కాగా రాష్ట్రవ్యాప్తంగా గుండాలలో 6 సెం.మీ., మణుగూరు, ఎన్కూరుల్లో 4 సెం.మీ., సిర్పూర్, మంచాల, ఖమ్మం పట్టణం, డిచ్‌పల్లి, బెజ్జంకిలో 3 సెం.మీ., చొప్పున వర్షపాతం నమోదైనట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

తప్పు చేస్తే పోలీసుకైనా శిక్ష!

చట్టం అందరికీ సమానమేనని నిరూపిస్తున్న సిటీ పోలీస్ విభాగం

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన సిబ్బందిపై జరిమానాతోపాటు శాఖాపరమైన చర్యలు, బదిలీలు

ఇప్పటివరకు 245 మందిపై చర్యలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: చట్టానికి ఎవరు అతీతులు కారు.. చట్టం అందరికీ సమానమేనన్న విషయాన్ని హైదరాబాద్ పోలీసు విభాగం ఆచరణాత్మకంగా చూపిస్తున్నది. ట్రాఫిక్ నిబంధనల పాటింపు విషయంలో సామాన్య ప్రజలైనా, అధికారులైనా ఒకటేనని తన చర్యల ద్వారా నిరూపిస్తున్నది. పొరపాటు చేస్తే పోలీసులను కూడా వదిలి పెట్టడం లేదు. ఆ మాట కొస్తే పోలీసులపట్ల ఇంకాస్త కఠినంగానే వ్యవహరిస్తున్నది. జరిమానా విధించడంతోపాటు వారిపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటున్నది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే ఈ విధంగా 245 మందిపై చర్యలు తీసుకున్నారు. మరో 75 మందిపై చర్యలు తీసుకోబోతున్నారు. తెలంగాణ వచ్చిన తరువాత మూడేండ్లుగా ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలనే లక్ష్యంతో హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం పనిచేస్తున్నది. రూల్స్ పాటించని పోలీసులకు చలానాతోపాటు చార్జ్ మెమోలు ఇస్తున్నారు. అవసరమైతే బదిలీ కూడా చేస్తున్నారు. ఇటీవల రాంగోపాల్‌పేట్‌లో రాకేశ్‌సాగర్ అనే కానిస్టేబుల్‌పై ట్రాఫిక్ ఉల్లంఘన కేసు నమోదు కావడంతో, సెంట్రల్ జోన్ డీసీపీ జోయెల్ డేవీస్ అతనిని హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో సామాన్యులకు పోలీసులు ఆదర్శంగా, స్ఫూర్తిదాయకంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి తరుచు సమావేశాలలో సిబ్బందికి సూచిస్తున్నారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. పోలీసులు ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘిస్తే ఆ సమాచారం తమకు అందజేయాలని సిటీ పోలీసు ఉన్నతాధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు. అటువంటి పోలీసుల ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెట్టినా తాము చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో హెల్మెట్ లేకుండా బైక్ నడుపడం, రాంగ్ రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, నోపార్కింగ్, సిగ్నల్ జంపింగ్.. ఇలా ఏ నిబంధనను పోలీసులు ఉల్లంఘించినా ప్రజలు ఫొటో తీస్తున్నారు. హైదరాబాద్ పోలీస్, హైదరాబాద్ ట్రాఫిక్, హాక్ ఐ విభాగాల ఉన్నతాధికారులకు ట్విట్టర్, హైదరాబాద్ వాట్సాప్‌ల ద్వారా సదరు ఫోటోలను పంపిస్తున్నారు. అధికారులు వాటిని పరిశీలించి పొరపాటు చేసిన పోలీసులపై చర్యలకు ఆదేశిస్తున్నారు. సామాన్యులు ఉల్లంఘనలకు పాల్పడితే జరిమానా చలాన్లు జారీ చేస్తారు. కొత్త నిబంధనల మేరకు వాహనదారుపై తదుపరి చర్యల కోసం పాయింట్లు వేస్తున్నారు. అదే పోలీసులు తప్పు చేస్తే అతనిని గుర్తించి, చార్జ్ మెమో ఇస్తున్నారు. కొందరిపై బదిలీ వేటు కూడా వేశారు. ఈ విధంగా ఇప్పటివరకు 66 మంది ఎస్సైలకు చార్జ్ మెమోలు జారీ అయ్యాయి.



హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ఓ పోలీసు (సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఫొటో ఇది)

ఉల్లంఘనలకు పాల్పడిన వారి సంఖ్య

ఎస్సైలు	-	66
హెడ్‌కానిస్టేబుళ్లు	-	13
కానిస్టేబుళ్లు	-	86
హోంగార్డులు	-	80

పోలీసులు ఆదర్శంగా ఉండాలనే



ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రతి పోలీసు ప్రజలకు ఆదర్శంగా నిలువాలని మేం సూచిస్తున్నాం. చాలమందిలో మార్పు వచ్చింది. అందరూ నిబంధనలు పాటించాల్సిందే. అలా చేయనివారిని గుర్తించి, వారి ఫోటోలను ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో పంపిస్తే విచారణ జరిపి చలాన్లు జారీ చేస్తున్నాం. ఆ సమాచారాన్ని ఆ ఉద్యోగి పనిచేసే జోన్‌కు, కమిషనరేట్‌కు పంపిస్తున్నాం. తప్పుచేసిన పోలీస్ జరిమానాతోపాటు శాఖాపరమైన చర్యలను ఎదుర్కోవాల్సిఉంటుంది.

- ట్రాఫిక్ జాయింట్ సీపీ, డాక్టర్ రవీందర్

టీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతా: డీఎస్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్‌లోకి తాను వెళ్లే ప్రశ్నే లేదని టీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు డీ శ్రీనివాస్ స్పష్టంచేశారు. టీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని మరోసారి ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లోని కొందరు తనపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. పార్టీలో చేరుతున్నానంటున్న కాంగ్రెస్ నాయకులు, అదే విషయాన్ని మీడియా ఎదుట చెప్పాలని డిమాండ్‌చేశారు. కొన్ని పత్రికలు, టీవీ చానళ్లు తన విశ్వసనీయతను దెబ్బతీసేలా వార్తలు రాస్తున్నాయని అన్నారు. ఇకపై ఇలాంటి వార్తలు రాస్తే తీవ్రంగా స్పందిస్తానని హెచ్చరించారు.

18 మంది వేదపండితుల నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేవాదాయశాఖలో 18 మంది వేదపండితులను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మూడు నెలల కిందట వేదపండితులను నియమించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 21 మంది హాజరయ్యారు. కృష్ణయజుర్వేదం, పాంచరాత్ర ఆగమం, వైఖానస ఆగమం వంటి ఆగమశాస్త్రాలను, వేదవిద్యను అధ్యయనం చేసి వేదపాఠాలను చెప్పగలుతున్న వారిని ఎంపికచేసినట్టు అధికారులు తెలిపారు. సీఎం కేసీఆర్‌కు అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ కృతజ్ఞతలు తెలిపారు.

సీతారామ ప్రాజెక్టుకు టీవోఆర్ అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సీతారామ ప్రాజెక్టు మొదటి దశకు టీవోఆర్ (టర్మ్స్ ఆఫ్ రెఫరెన్సెస్) ఖరారుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ పరిధిలోని నిపుణుల అంచనాల కమిటీ (ఈఏసీ) అనుమతి లభించింది. దీనికి సంబంధించిన వివరాలను మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. గతనెల 11వ తేదీన జరిగిన ఈఏసీ ఆరో సమావేశంలో దేశంలోని పలు ప్రాజెక్టులపై చర్చించారు. ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని సుమారు 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూపొందించిన సీతారామ ప్రాజెక్టు మొదటి దశ వివరాలను అధికారులు కమిటీ ముందుంచారు. సమైక్య రాష్ట్రంలో ఉన్నపుడు ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్‌గా ఉన్న ప్రాజెక్టులను కలిపి తెలంగాణ ప్రభుత్వం రీడిజైనింగ్‌లో సీతారామ పేరుతో సమీకృత ప్రాజెక్టుగా రూపొందించిందని అధికారులు తెలిపారు. గోదావరి నుంచి 70.40 టీఎంసీల నీటిని ఎత్తిపోసి సుమారు 3.28 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడంతోపాటు మరో 3.45 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం 4,885 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉండగా అందులో 1,930 హెక్టార్లు అటవీ భూములు, 2955 హెక్టార్లు ప్రైవేటు భూములున్నాయని పేర్కొన్నారు. రూ.11,931.73 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో ఒక్క ఆవాసం కూడా ముంపునకు గురికావడంలేదని తెలిపారు. వివరాలన్నింటినీ పరిశీలించిన అనంతరం ఈఏసీ పలు షరతులను పేర్కొంటూ టీవోఆర్ ఖరారుకు అనుమతినిచ్చింది.

నీటి విడుదలకు కర్ణాటక సానుకూలం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌తోపాటు నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం తమ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సానుకూలంగా ఉన్నట్టు సమాచారం. శుక్రవారం బెంగళూరులో కర్ణాటక సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన జరిగిన కృష్ణా భాగ్య జల్‌నిగమ్ బోర్డు సమావేశంలోనూ ఈ అంశంపై చర్చ జరిగినట్టు తెలిసింది. నీటి విడుదలపై కర్ణాటక సానుకూలంగా ఉన్నదని, తుదినిర్ణయం తీసుకోలేదని రాష్ట్ర నీటిపారుదలశాఖ వర్గాలు తెలిపాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఇన్‌ఫ్లో లేకపోవడంతో ఎగువన నిండుగా ఉన్న కర్ణాటక ప్రాజెక్టుల నుంచి 15 టీఎంసీల నీటిని విడుదలచేయాలని కర్ణాటక జలవనరులశాఖ మంత్రి పాటిల్‌కు ఇటీవల రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులేఖ లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ లేఖను కర్ణాటక మంత్రికి అందజేసిన నాగార్జునసాగర్ సీఈ సునీల్, రెండురోజులుగా అక్కడే మకాం వేశారు. ఆ రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శిని కలిసి పరిస్థితిని వివరించారు. రాష్ట్ర నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి కూడా కర్ణాటక ముఖ్య కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడి నీటి విడుదలకు సహకరించాలని కోరినట్టు తెలిసింది.

పెట్టుబడులకు యూఏఈ ఎక్స్ఛేంజ్ ఆసక్తి

మంత్రి కేటీఆర్‌తో చైర్మన్ బీఆర్ శెట్టి భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు చెందిన యూఏఈ ఎక్స్ఛేంజ్ చైర్మన్ బీఆర్ శెట్టి ముందుకొచ్చారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమశాఖల మంత్రి కే తారకరామారావుతో శుక్రవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై మంత్రి కేటీఆర్ ఆయనకు వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫార్మా సిటీ, మెడికల్ డివైసెస్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని, వాటిలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి కోరారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన పారిశ్రామిక విధానం, నిర్ణీత సమయంలో అనుమతులు, ఆన్‌లైన్ విధానాల గురించి మంత్రి వివరించారు. ఈవోడీబీలో దేశంలోనే రాష్ట్రం మొదటిస్థానంలో నిలిచిందని చెప్పారు. హైదరాబాద్ నగరం బల్క్‌డ్రగ్ రాజధానిగా ఉన్నదని, లైఫ్‌సైన్సెస్, ఏరోస్పేస్ రంగాల్లోనూ అధికంగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. మంత్రి కేటీఆర్ ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన బీఆర్ శెట్టి.. ఫార్మాసిటీ, మెడికల్ డివైసెస్ పార్కుల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబర్చారు. దీంతోపాటు నగరంలోని హెల్త్‌కేర్ రంగంలోనూ తమకు ఆసక్తి ఉన్నదని శెట్టి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం గురించి తమకు చాలామంది అనేక విషయాలు చెప్పారని, మంత్రి కేటీఆర్ ద్వారా పారిశ్రామిక ప్రగతిని స్వయంగా తెలుసుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వచ్చేలా తాము స్వయంగా సహకరిస్తామని, దుబాయ్, అబుదాబీల్లోని పారిశ్రామికవేత్తలతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణలో తమ సంస్థ తరపున సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు.



శుక్రవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో యూఏఈ ఎక్స్ఛేంజ్ చైర్మన్ బీఆర్ శెట్టితో కరచాలనం చేస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమశాఖల మంత్రి కే తారకరామారావు

ప్రభుత్వ ఉద్యోగులకు పురస్కారాలు

వివిధ విభాగాల్లో 13 మంది గుర్తింపు.. స్వాతంత్ర్య దినోత్సవాన అందజేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహక పురస్కారాలను ప్రకటించింది. వివిధ విభాగాల్లో ఎంపికచేసిన 13 మంది ఉద్యోగులకు ఈ నెల 15న గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో అవార్డులు ఇచ్చి సత్కరించనున్నారు. మొదటి బహుమతి రూ. 5 లక్షలు, ద్వితీయ రూ.3 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.2లక్షల చెక్కుతోపాటు శాలువా, జ్ఞాపికలను ఇచ్చి సత్కరించనున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జే రాజేశ్ కూడా పురస్కారానికి ఎంపికయ్యారు.

అవార్డు గ్రహీతలు వీరే:

క్యాటగిరీ	ర్యాంకు	పేరు	హోదా	శాఖ లేదా జిల్లా
గ్రూప్-1	1	డాక్టర్ సీహెచ్ మధుసూదన్	అసోసియేట్ ప్రొఫెసర్	ఉస్మానియా వైద్య కళాశాల
	2	సురేశ్‌బాబు	డీపీవో	సిద్దిపేట
	3.	పీడబ్ల్యూ జాన్సన్	డీఆర్డీవో	వికారాబాద్
గ్రూప్-2	1	ఖానాపూర్ చంద్రకళ	ఆర్డీవో	హైదరాబాద్
	2	జీ విశ్వనాథం గుప్తా	హెడ్‌మాస్టర్	రంగారెడ్డి
	3	రమీజుద్దీన్ అహ్మద్	మండల గణాంకాధికారి	పెద్దపల్లి
గ్రూప్-3	1	శ్రీమతి జయమ్మ	స్టాఫ్‌నర్స్	మహబూబ్‌నగర్
	2	కే ప్రకాశ్	పంచాయతీ సెక్రటరీ	వరంగల్ రూరల్
	3	డీ శంకర్‌కుమార్	పీఏ టు సీపీఆర్వో	ఐ అండ్ పీఆర్
గ్రూప్-4	1	బీ దశరథ	సైకిల్ ఆర్డర్లీ	మహిళా శిశు సంక్షేమశాఖ
	2	కే గంగయ్య	ఆఫీస్ సబార్డినేట్	కామారెడ్డి
	3	కే కిష్టయ్య	ఆఫీస్ సబార్డినేట్	యాదాద్రి

ములుగు ఫారెస్ట్ కాలేజీకి 25 కోట్లు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ప్రపంచస్థాయి నాణ్యత ప్రమాణాలతో సిద్దిపేట జిల్లా ములుగులో ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను ప్రారంభించడానికి అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అటవీ కళాశాల, పరిశోధన సంస్థ నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసింది. తాజాగా శుక్రవారం మరో రూ.25 కోట్ల విడుదలకు పాలనాపరమైన అనుమతులను జారీచేస్తూ ప్రభుత్వం జారీచేసింది.

నవంబర్ 8 నుంచి 20వ బాలల చిత్రోత్సవాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 20వ అంతర్జాతీయ బాలల చిత్రోత్సవాలను నవంబర్ 8వ తేదీ నుంచి 14వ తేదీవరకు నిర్వహించనున్నట్టు రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ పేర్కొన్నారు. నవంబర్ 8న శిల్పకళావేదికలో ప్రారంభోత్సవాలను నిర్వహించనున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు దేశవిదేశాల నుంచి, రాష్ట్రం నుంచి వేలసంఖ్యలో ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. చిత్రోత్సవాల కోసం జంటనగరాల్లో 12 సినిమా థియేటర్లను తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చిల్డ్రన్ ఫిలిం సొసైటీ ఆఫ్ ఇండియా అధికారులు ఎంపికచేయాలని ఆదేశించారు. పోటీకి వచ్చే బాలల చిత్రాలు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జర్నలిస్టు సొసైటీకి భూమి స్వాధీనం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జర్నలిస్టుల కోసం జవహర్‌లాల్ నెహ్రూ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీకి భూమిని స్వాధీనం చేయాలంటూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. బాచుపల్లి మండలం నిజాంపేటలో 32 ఎకరాల భూమిని స్వాధీనం చేయాలని ప్రభుత్వం మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీచేసింది. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి ప్రభుత్వం నిజాంపేటలో 32 ఎకరాలు, పేట్ బషీర్‌బాద్‌లో 38 ఎకరాలు కేటాయించింది. తాజాగా నిజాంపేటలోని భూమిని సొసైటీకి బదలాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. సీఎం కేసీఆర్‌కు హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్ క్రాంతికిరణ్, కార్యదర్శి ఎన్ వంశీ శ్రీనివాస్ శుక్రవారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. పేట్ బషీరాబాద్ స్థలాన్నీ సొసైటీకి స్వాధీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారన్నారు.

టీఎస్‌పీఎస్సీ సభ్యుల జీతాలు పెంపు

ఇకపై వేతనంలో డీఏ ఉండదు.. పెంపు స్వల్పమే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ చైర్మన్‌తోఆపటు సభ్యుల జీతాలను భారీగా పెంచుతూ ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకున్నది. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జీతాన్ని రూ.80 వేల నుంచి రూ.2.25 లక్షలకు, సభ్యుల జీతాన్ని రూ. 79వేల నుంచి రూ. 2,24,100 కు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. పెరిగిన జీతాలు 2016 జనవరి నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొన్నది. ఏడో కేంద్ర వేతన సవరణ సంఘం సిఫారసుల మేరకు జీతాల పెంపుపై నిర్ణయం తీసుకున్నట్టు జీవోలో పేర్కొన్నది. ప్రస్తుతం చెల్లిస్తున్న జీతంతోపాటు 89 శాతం డీఏ కూడా కలిపి చెల్లిస్తున్నారు. ఇకపై చెల్లించే వేతనంలో డీఏ ఉండదు. అందువల్ల చైర్మన్, సభ్యులకు పెరిగే వేతనాలు సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు మాత్రమే ఉండనున్నాయి. ఆరో వేతన సవరణ సంఘం సిఫారసుల ప్రకారం ఉమ్మడిరాష్ట్రంలో పబ్లిక్ సర్వీసు కమిషన్ సభ్యులకు వేతనాలు చెల్లించారు. పదేండ్లకు ఒకసారి కేంద్రం వేతన సవరణ సిఫారసులను అమలుచేస్తున్నది. ఇందులో భాగంగానే సుప్రీం, హైకోర్టు జడ్జీలకు, అఖిలభారత సివిల్ సర్వీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తున్నది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులకు హైకోర్టు జడ్జీలతో సమానమైన వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఆ వరుసలోనే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల వేతనాలను ప్రభుత్వం స్వల్పంగా పెంచుతూ ఉత్వర్వులు జారీచేసింది.

గ్రంథాలయ భవనాలకు రూ.62 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో గ్రంథాలయాలకు భవనాలు నిర్మించేందుకు, శిథిల భవనాలను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.62కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కొత్త జిల్లా కేంద్రాల్లో గ్రంథాలయ భవనాలను నిర్మించనున్నారు. ఇప్పటికే స్థల సేకరణ పూర్తి చేశారు. సిరిసిల్లా, జగిత్యాల, జనగామ జిల్లా కేంద్రాల్లో ఒక్కో భవన నిర్మాణానికి రూ.50 లక్షల చొప్పున మంజూరు చేశారు. మహబూబ్‌నగర్‌లో శిథిలమైన భవనం స్థానంలో కొత్తది నిర్మించేందుకు రూ.52 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికే ప్రభుత్వం డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఫౌండేషన్‌తో అవగాహన కుదుర్చుకున్నది. ఈ ఫౌండేషన్ సహాయంతో స్టేట్ లైబ్రరీతోపాటు నగరంలోని 86 గ్రంథాలయాలను డిజిటలైజ్ చేయనున్నారు.

నేడు గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథన్ జయంతి

గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథన్ జయంతిని శనివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ అయాచితం శ్రీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని జిల్లాల గ్రంథాలయ సెక్రటరీలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మరో ఐదు ఎక్సైజ్ ఈఎస్ పోస్టులు ఇవ్వండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఆబ్కారీశాఖలో ప్రస్తుతం ఉన్న 29 ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్టులను పెంచాలని కోరుతూ ప్రభుత్వానికి ఆ శాఖ ప్రతిపాదించింది. కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో కొన్నింటికి ఈఎస్ క్యాడర్‌స్థాయి అధికారులు లేక ఏఈఎస్‌లతో కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నది. కొత్త జిల్లాలు ఆసిఫాబాద్ కుమ్రంభీం, సిరిసిల్ల, జనగామ, నిర్మల్, వనపర్తిల్లో ఈఎస్ క్యాడర్ పోస్టులు లేక ఏఈఎస్‌లకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపింది. కొత్తగా మరో ఐదు ఈఎస్ పోస్టులను పెంచితే హెచ్‌వోడీ బాధ్యతలు సక్రమంగా నిర్వహించే వీలు కలుగుతుందని ప్రతిపాదనల్లో ప్రభుత్వానికి నివేదించింది. ఈ ఫైలుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆమోదం తెలిపితే మరో 5 ఈఎస్ పోస్టులు ఆబ్కారీశాఖ ఖాతాలో చేరుతాయి. త్వరగా కొత్త పోస్టులు వస్తాయని ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

న్యాయప్రచురణ సంస్థలకు ఆర్థికసాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: న్యాయశాస్త్ర పరిజ్ఞాన విషయాలను స్థానిక భాషల్లో ప్రచురిస్తున్న స్వచ్ఛంద సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నది. న్యాయస్థానాల ఉత్తర్వులు, చట్టాలను హిందీ లేదా స్థానిక భాషల్లో ప్రచురణతోపాటు అనువాదం చేస్తున్న సంస్థలకు ఆర్థిక సహాయాన్ని ఇస్తున్నది. ఇందుకు ఆయా సంస్థలు జిల్లా కలెక్టర్ లేదా సంబంధిత రాష్ట్ర న్యాయశాఖ ధ్రువీకరణ చేయించి ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవడానికి కేంద్రం అవకాశం కల్పించింది. తెలుగు, హిందీ భాషల్లో న్యాయశాస్త్ర ప్రచురణలు, అనువాదాలు చేస్తున్న సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.



శుక్రవారం మన కూరగాయలు కేంద్రాన్ని ప్రారంభించి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్కే జోషికి కూరగాయలు అమ్ముతున్న మంత్రి హరీశ్‌రావు

ఎర్రమంజిల్‌లో 'మన కూరగాయలు'

• ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎర్రమంజిల్ సమీపంలోని జలసౌధ వద్ద ఏర్పాటు చేసిన మన కూరగాయలు కేంద్రాన్ని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్కే జోషితో కలిసి మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు మార్కెటింగ్‌శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న ఈ కేంద్రాలు రైతులకు అండగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో వంద మన కూరగాయలు కేంద్రాలను ఏర్పాటు చేయడాన్ని లక్ష్యం గా నిర్ణయించుకున్నామన్నారు. ఈ కేంద్రాలతో రైతులకు సరైన ధర రావడంతోపాటు వినియోగదారులకు తక్కువ ధరలో తాజా కూరగాయలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌త్రివేదికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్

హోంగార్డులకు సౌకర్యాలు కల్పించాలి

• ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హోంగార్డులతో స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ పోస్టును ఏర్పాటుచేసి, వారికి ఉద్యోగ, ఆరోగ్యభద్రతను కల్పించాలని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు, శాసనసభ్యుడు వీ శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఇతర నాయకులు దయానంద్, మల్లారెడ్డి తదితరులు హోంశాఖ కార్యదర్శి రాజీవ్ త్రివేదిని శుక్రవారం కలిసి చర్చించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభలో ఇచ్చిన హామీ మేరకు హోంగార్డులను క్రమబద్ధీకరించాలని కోరారు. పోలీసులకు అందిస్తున్న విధంగానే హోం గార్డులకు అలవెన్సులు, దుస్తులు అందించాలన్నా రు. ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్లలో రెండుశాతం కోటాను హోంగార్డులకు కేటాయించాలని, అర్హత ఉన్నవారికి నాలుగోతరగతి ఉద్యోగులుగా పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

15న ఓడీఎఫ్‌గా మేడ్చల్ జిల్లా

• రేపటితో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి: కలెక్టర్ ఎంవీ రెడ్డి

మేడ్చల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: పంద్రాగస్టున మేడ్చల్ జిల్లాను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత జిల్లాగా ప్రకటించుకుందామని కలెక్టర్ ఎంవీ రెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియను ఆదివారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వచ్ఛభారత్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయితేనే ఓడీఎఫ్ ప్రకటన సాధ్యమవుతుందని, ఇందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మరుగుదొడ్ల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీలుగా 'స్వచ్ఛతాగ్రహి'లను నియమిస్తామని ప్రకటించారు. వీరికి తడి, పొడి చెత్తలను వేరుచేసే విధానం, సోప్‌కిట్‌ల నిర్మాణం వంటి అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 17వ తేదీన శామీర్‌పేట్, మేడ్చల్ మండలాల పరిధిలో, 18వ తేదీన కీసర, ఘట్‌కేసర్ మండలాల్లో, 19వ తేదీన కుత్బుల్లాపూర్‌లో శిక్షణ తరగతులను నిర్వహిస్తామని చెప్పారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ మేడ్చల్ నినాదాలతో ప్రత్యేకంగా బ్యానర్లు ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 15వ తేదీ వరకు స్వేచ్ఛ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో డీపీవో సురేశ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఓడీఎఫ్‌పై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఎంవీరెడ్డి

ఎకరంతో రియల్‌కు రెక్కలు

లే అవుట్ల అనుమతుల సడలింపుతో చక్కని ఫలితం • హెచ్‌ఎండీఏ పరిధిలో పెరిగిన ఎకరం లే అవుట్లు

అక్రమాలకు చెక్.. ఖజానాకు పెరిగిన ఆదాయం • మధ్యతరగతి కుటుంబాలకు నెరవేరుతున్న సొంతింటి కల

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నిర్మాణ రంగం అనుమతుల్లో ఉన్న ప్రధాన అవరోధాలను ప్రభుత్వం తొలిగించడంతో గ్రేటర్ పరిధిలో రియల్ ఎస్టేట్‌కు రెక్కలొచ్చాయి. ఇప్పుడు నిబంధనలు సరళీకృతమయ్యాయి. అవినీతిరహిత సేవలు.. సింగిల్‌విండో విధానం అమల్లోకి వచ్చింది. కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఆన్‌లైన్ అనుమతులు అందుబాటులోకి వచ్చాయి. అక్రమ లే అవుట్లకు ముకుతాడు పడింది. ఫలితంగా నిర్మాణదారులు, కొనుగోలుదారుల్లో నమ్మకం పెరిగింది. ఒకప్పటి రియల్ బూమ్‌ను తలదన్నేలా శివార్లలో కొత్త వెంచర్లు, విల్లాలు, అపార్ట్‌మెంట్లు పుట్టుకొస్తున్నాయి. ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, పెద్ద అంబర్‌పేట, ఆదిభట్ల, బొంగుళూరు జంక్షన్, తెల్లాపూర్, సాగర్ రోడ్, ఘట్‌కేసర్, ఉప్పల్ టూ భువనగిరి, శేరిలింగంపల్లి, మేడ్చల్, మహేశ్వరం పరిధిలో కొత్త వెంచర్లతో రియల్ కళ సంతరించుకుంటున్నది. తాజాగా ఎకరం స్థలంలోనూ లే అవుట్ చేసుకునే వెసులుబాటు కల్పించడంతో 'రియల్' రంగానికి రెక్కలొచ్చాయి.

మోసాలకు ముకుతాడు..

2031 మాస్టర్‌ప్లాన్ నిబంధనల ప్రకారం 10 ఎకరాలు ఉంటేనే లే అవుట్లకు అనుమతి ఇవ్వాలి. ప్రభుత్వం ఈ నిబంధనలో సడలింపు ఇస్తూ ఎకరం స్థలంలోనూ లే అవుట్ వేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ రెండేండ్ల కిందట జీవో నం.102ను జారీ చేసింది. 10 ఎకరాలలోపు స్థలంలోనే అత్యధికంగా అక్రమ లే అవుట్లు వెలిసి మోసాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ ఖజానాకు భారీ స్థాయిలో గండి పడుతుందని గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నది. జీవో 288, 33 ప్రకారం ఎకరంలో లే అవుట్ చేసినా 30 శాతం అంతర్గత రహదారులు, 10 శాతం ప్రజా అవసరాలు, మొత్తంలో 25 శాతం మేర హెచ్‌ఎండీఏకు తనఖా పెట్టడం వంటి నిబంధనలు ఉన్నాయి. ప్రాసెసింగ్ ఫీజు, డెవలప్‌మెంట్ ఫీజు,మార్కెట్ ఆధారంగా ఫీజులు చెల్లించి లే అవుట్లలో 120 గజాలతో ప్లాట్లు వేస్తున్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలకు మార్గం సుగమం అవుతున్నది. మరోవైపు అక్రమ లే అవుట్లకు చెక్ పడడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు గణనీయంగా ఆదాయం వస్తున్నది. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధిలో నెలకు దాదాపు 600కు పైగా లే అవుట్లు, భవనాలు అనుమతి పొందుతుండగా, ఇందులో అత్యధికం ఎకరం లే అవుట్లే కావడం విశేషం.

అత్యధికంగా ఎకరం లే అవుట్లు ఇక్కడే..

పటాన్‌చెరువు, అబ్దుల్లాపూర్‌మెట్, అమీన్‌పూర్, దుండిగల్, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఘట్‌కేసర్, కీసర, రామచంద్రాపురం, మేడ్చల్, బీబీనగర్, బాలాపూర్, శామీర్‌పేట, కొంపల్లి, ఆదిభట్ల, మేడిపల్లి, సంగారెడ్డి మండలాల పరిధిలో అత్యధికంగా ఎకరం లే అవుట్లు వెలిశాయి.ఈ ప్రాంతాల్లో ఇప్పటి వరకు 65 లే అవుట్లకు అనుమతులు ఇవ్వగా, రూ. 30 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో సులభంగా అనుమతులు

ఎకరం స్థలంలో లే అవుట్ల వెసులుబాటుతో అక్రమ లే అవుట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడంతో నిర్మాణరంగాలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నాయి. మధ్యవర్తుల ప్రయేయం లేకుండా ఆన్‌లైన్‌లో ఇంటి వద్దనే అనుమతులు పొందే వీలు కల్పించడం ఫలితాన్నిస్తున్నది. ఎకరం స్థలం లే అవుట్ల ద్వారా అందరికీ మేలు జరుగుతుంది. **- చిరంజీవులు, హెచ్‌ఎండీఏ కమిషనర్**

ఎర్రమంజిల్ నుంచి మూడు కోర్టుల తరలింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎర్రమంజిల్ న్యాయస్థానాల ప్రాంగణం నుంచి మూడు కోర్టులను సికింద్రాబాద్ కోర్టు కాంప్లెక్స్‌కు తరలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు రిజిస్ట్రార్ (పరిపాలన) సూచనల మేరకు ప్రస్తుతం ఎర్రమంజిల్‌లో నిర్వహిస్తున్న 14, 15, 16వ అదనపు న్యాయమూర్తి, అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయస్థానాలను సికింద్రాబాద్‌కు తరలిస్తున్నట్లు న్యాయశాఖ కార్యదర్శి వీ నిరంజన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

ఏడు కిలోల గంజాయి స్వాధీనం

అబిడ్స్, నమస్తే తెలంగాణ: అక్రమంగా గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్న ఓ మహిళను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్, మంగళ్‌హాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళ్‌హాట్ గంగాబౌలి రాణి అవంతిబాయినగర్‌కు చెందిన లక్ష్మీబాయి (47) శుక్రవారం గండిహనుమాన్, గంగాబౌలి, మంగళ్‌హాట్ ప్రాంతాల్లో ప్లాస్టిక్ సంచిలో ఏడు కిలోల గంజాయిని ఉంచుకొని విక్రయించేందుకు ప్రయత్నించింది. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు పోలీసులు ఆమెను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆమెను రిమాండ్‌కు తరలించారు.

పంద్రాగస్టుకు పక్కాగా..

గోల్కొండలో ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్



గోల్కొండలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎస్ ఎస్పీ సింగ్ తదితరులు



పంద్రాగస్టు వేడుకల కోసం కవాతు సాధన చేస్తున్న పోలీసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గోల్కొండ కోట వేదికగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్పీ సింగ్ ఆదేశించారు. పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం సంబంధిత అధికారులతో గోల్కొండ కోటలో ఆయన సమీక్షించారు. గతేడాదిలాగే ఈసారి కూడా వేడుకలను వైభవంగా జరుపుకోవాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పక్కాగా చేయాలని సీఎస్ సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, స్వాతంత్ర్యసమరయోధులు, విద్యార్థులు, ప్రజ లు పాల్గొననున్నందున పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. అతిథులు, అవార్డుగ్రహీతలు, మీడియా ప్రతినిధులు, వీఐపీలు ఎక్కడ ఆసీనులు కావాలో స్పష్టంగా నిర్దేశించాలని, అవార్డుగ్రహీతల వెంట మరో ఇద్దరిని మాత్రమే అనుమతించాలని సూచించారు. రాణీమహల్ వద్ద జాతీయపతాకాన్ని ఎగురవేసే స్టేజీని, కోట ప్రధాన గేటు వద్ద పోలీసులు నిర్వహించే పరేడ్ రిహార్సల్స్‌ను సీఎస్ పరిశీలించారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ ఐజీ ఎంకే సింగ్, సీఐడీ ఐజీ శిఖాగోయెల్, ప్రొటోకాల్ డీఐజీ అంజనీకుమార్, నగర పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి, అదనపు కమిషనర్ శ్రీనివాస్‌రావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

'ముత్తూట్' కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

• రెండు తుపాకులు, 15 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ సందీప్ శాండిల్య

శేరిలింగంపల్లి: హైదరాబాద్ నగరంలో సంచలనం సృష్టించిన మైలార్‌దేవ్‌పల్లి ముత్తూట్ ఫైనాన్స్ దోపిడీ యత్నం కేసులో ప్రధాన నిందితుడు షరీఫ్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండు తుపాకులు, 15 రౌండ్ల బుల్లెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ముత్తూట్ కేసులో మొత్తం ఎనిమిది మంది పాల్గొనగా నలుగురిని గతంలోనే అరెస్ట్ చేశారు. అసలు సూత్రధారి, కరుడుగట్టిన నేరస్తుడైన ముంబైవాసి మహమ్మద్ షరీఫ్ అబ్దుల్ ఖాదర్ ఖాద్రీ (42)ని తాజాగా అరెస్ట్ చేశారు. కాగా మరో ముగ్గురు నిందితులు రాజేశ్, షారుఖ్, షేర్‌ఖాన్ పరారీలో ఉన్నారు. షరీఫ్ తన జీవితకాలంలో ఎక్కువ భాగం జైలులోనే గడిపాడు. జైలుకు వెళ్లిన ప్రతిసారీ అక్కడి పరిచయాలతో రాటుదేలుతూ దోపిడీలకు పాల్పడుతున్నాడు. ముత్తూట్ దోపిడీకి కూడా జైలు పరిచయాలను ఉపయోగించుకున్నాడు. అతని వద్ద లభించిన బుల్లెట్లు పోలీసుల ద్వారానే చేరి ఉంటాయని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ దోపిడీ కోసం షరీఫ్ మొత్తం రూ.3 లక్షలు ఖర్చు పెట్టినట్టు విచారణలో వెల్లడించాడు. ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులను అభినందించారు. సమావేశంలో సైబరాబాద్ జాయింట్ పోలీస్ కమిషనర్ షానవాజ్ ఖాసిం, క్రైం డీసీపీ జానకీ షర్మిల పాల్గొన్నారు.

'నో డ్రగ్స్' ఉద్యమానికి సారథులు మీరే

విద్యార్థులకు పిలుపునిచ్చిన అకున్ సబర్వాల్

ఉస్మానియా యూనివర్సిటీ: డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి విద్యార్థులే సారథులై దేశాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి చేయాలని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ వాడుమని ఎవరైనా బలవంతం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోవద్దని సూచించారు. డ్రగ్స్ గురించి ఏదైనా చిన్న సమాచారం అందినా తక్షణమే పోలీసులకుగానీ, తల్లిదండ్రులకు గానీ తెలుపాలని కోరారు. హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో 'మార్చింగ్ టువర్డ్స్ ఏ డ్రగ్ ఫ్రీ నేషన్: రోల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' అనే అంశంపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇఫ్లూ వీసీ ప్రొఫెసర్ సురేశ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అకున్ సబర్వాల్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో డ్రగ్స్‌కు సంబంధించి ఇప్పటివరకు 11 కేసులు నమోదు చేసి 22 మందిని అరెస్ట్ చేశామన్నారు. డ్రగ్స్ విషయంలో చాలా మంది ఫోన్ నంబర్లు మాత్రమే ఉన్నాయని, వాటి ఆధారంగానే అనేక మందిని విచారణకు పిలిపిస్తున్నామని చెప్పారు. డ్రగ్స్ బాధితుల్లో విద్యార్థులు ఉన్నారని, వారి భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నామన్నారు. విద్యార్థులకు డ్రగ్స్ గురించి సంపూర్ణ అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే విద్యాసంస్థల్లో సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.



తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక- 2017 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

ఈ-శిక్షణతో ఉద్యోగులకు ప్రయోజనం

ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే ఉద్యోగులకు ఈ-శిక్షణ ఎంతో ప్రయోజనకరమని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో రంగారెడ్డి జిల్లా ఉద్యోగులకు ఈ-శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఎం కేసీఆర్ ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటారని, ఉద్యోగులు. ప్రజల అవసరాలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజలకు సేవ చేయాలనే తపన ఉండాలని సూచించారు. గతంలో గ్రూప్- ఏ,బీ ఉద్యోగులకే ఈ-శిక్షణ ఉండేదని, ప్రస్తుతం గ్రూప్-సీ, డీ ఉద్యోగులకు కూడా శిక్షణ ఇస్తున్నట్టు డీవోపీటీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ దేవేశ్ చతుర్వేది చెప్పారు. కార్యక్రమంలో కేంద్రం డైరెక్టర్ జనరల్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య, జేడీజీ ఎంపీ సేథీ, అదనపు డీజీ బీ వెంకటేశ్వరరావు, జీఎం శ్రీదేవి పాల్గొన్నారు.

తెలుగులో తెలంగాణ సామాజిక, ఆర్థిక సర్వే

'బంగారు తెలంగాణ దిశగా- నిన్నటి నేపథ్యం, రేపటి సంకల్పం' పేరుతో తెలుగులో అనువదించిన తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక- 2017 పుస్తకాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు ఎస్ నిరంజన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణకు సంబంధించిన పూర్తి సమాచారం ఇందులో లభించనుంది. విభాగాల వారిగా, పట్టికలతో అందరికి అర్థమయ్యేలా రూపొందించిన ఈ పుస్తకాలు ఖైరతాబాద్‌లోని గణాంక భవన్‌లో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ నెల 18 నుంచి అన్ని జిల్లాల్లోని కలెక్టరేట్లలో అందుబాటులో ఉంటాయని,పుస్తకం ధర రూ. 150గా నిర్ణయించామన్నారు.

'టాస్క్‌ఫోర్స్' నిర్దోషులపై యూపీలో కేసులు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: బేగంపేట టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై జరిగిన మానవబాంబు దాడి కేసులో నిర్దోషులుగా బయటపడిన నషిఖుల్ బిస్వాస్, మహ్మద్ హిలాలుద్దీన్‌ను ఉత్తరప్రదేశ్‌లోని జాన్‌పూర్ జైలుకు తరలిస్తున్నట్టు చంచల్‌గూడ జైలు అధికారులు తెలిపారు. మానవబాంబు దాడి కేసులో కర్ణాటకలోని బీదర్‌కు చెందిన అజ్మల్ అలీఖాన్, సయ్యద్ అజామత్ అలీ, మహమ్మద్ బరుద్వాలా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన నషిఖుల్ బిస్వాస్, మహమ్మద్ హిలాలుద్దీన్, హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ కలీం, మహ్మద్ అబ్దుల్ జాహెద్, షేక్ అబ్దుల్ ఖాజా, షకీల్, సయ్యద్ హాజీ విచారణను ఎదుర్కొన్నారు. న్యాయస్థానం వీరిని గురువారం నిర్దోషులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఏడుగురు విడుదలవగా, పశ్చిమబెంగాల్‌కు చెందిన నషిఖుల్ బిస్వాస్, మహమ్మద్ హిలాలుద్దీన్‌కు విముక్తి లభించలేదు. వీరిపై ఉత్తరప్రదేశ్‌లో కేసులు ఉన్నందన వారంలో ఉత్తరప్రదేశ్‌లోని జాన్‌పూర్ జైలుకు తరలిస్తామని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ సైదయ్య తెలిపారు. నిర్దోషిగా బయటపడిన పేలుళ్ల కేసు నుంచి బయపడిన హైదరాబాద్ వాసి మహ్మద్ అబ్దుల్ జాహెద్, విచారణ సమయంలో ఎస్కార్ట్ పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఘటనపై నాంపల్లిలో కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరవగా, విచారణ సెప్టెంబర్ నాలుగో తేదీకి వాయిదా పడింది.

'మెడికల్' ప్రవేశాలకు రెండోవిడుత కౌన్సెలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి శనివారం రెండో విడుత కౌన్సెలింగ్ జరుగనున్నది. తొలివిడుత కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. 2017-18 విద్యా సంవత్సరానికి కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ ఎంబీబీఎస్, బీడీఎస్‌కు రూపొందించిన మెరిట్ జాబితా ఏ క్యాటగిరీ (కన్వీనర్ కోటా) ఎంపికచేసిన విద్యార్థులు చేరకపోవడంతో మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 11 నుంచి 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కేఎన్‌ఆర్ యూహెచ్‌ఎస్ వీసీ కరుణాకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్సిటీ గుర్తింపుపొందిన మెడికల్, డెంటల్ కళాశాల్లో ప్రవేశానికి ఏ క్యాటగిరీలో మిగిలినవాటిని రెండోవిడుత వెబ్‌ఆప్షన్ నిర్వహించి, కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పట్నాల్లోనూ ఇంటింటికీ ఆరు మొక్కలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పల్లెలనే కాదు.. పట్నాలనూ పచ్చగా మార్చేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశంతో ప్రతి ఇంటా ఆరు మొక్కలను నాటేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని, నగరాలు, పట్నాల్లోనూ ఇదే తీరున మొక్కలను సరఫరా చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. అటవీ, గ్రామీణాభివృద్ధిశాఖ, ఇతర శాఖలు కలిపి 2,925 నర్సరీల్లో 42కోట్ల మొక్కలను సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు. పట్నాల్లో ఇంటింటికీ పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. ఇందులో అపార్ట్‌మెంట్ల వాసులు, కాలనీ ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. పారిశ్రామిక, స్వచ్ఛంద సంస్థలు, ఇతర పౌరసంఘాల సహకారం తీసుకోవాలని చెప్పారు. కార్పొరేట్ సంస్థల నుంచి సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్) నిధిని తీసుకొని, వారిని మొక్కలు నాటే యజ్ఞంలో పాల్గొనేలా చేయాలని సూచించారు. పట్నంలో ఇంటింటికీ మొక్కలను సరఫరా చేయడానికి గ్రీన్‌బ్రిగేడ్ల సాయం తీసుకోవాలన్నారు. బస్తీలు, కాలనీలు, పార్కులు, ఇతర స్థలాల్లో నాటే మొక్కల సంరక్షణకు దత్తత కార్యక్రమాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. మొక్కలను తరలించే వాహనాల్లో మైక్‌ను అమర్చి ఎక్కడెక్కడ ఏ రకం మొక్కలు అందుబాటులో ఉన్నాయనే విషయంపై ప్రచారం చేయాలని చెప్పారు.

బీసీ ఓవర్సీస్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

• ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 30 వరకు అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ ఓవర్సీస్ విద్యాపథకానికి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు బీసీ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏటా 300 మంది విద్యార్థులకు బీసీ ఓవర్సీస్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు ఉండాలని, వయో పరిమితి 30 ఏండ్లు మించరాదన్నారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ప్యూర్ సైన్స్, అగ్రికల్చర్ సైన్స్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్ తదితర సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. యూఎస్, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేవారికి ప్రభుత్వం రూ.20 లక్షల ఆర్థిక సహకారాన్ని అందించనున్నది.

దరఖాస్తుతో సమర్పించాల్సినవి..

దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈ ధ్రువపత్రాలను అందజేయాల్సి ఉంటుంది. కుల, ఆదాయ, పుట్టినతేదీ, ఆధార్‌కార్డు, ఈ-పాస్ ఐడీ నంబర్, స్థానిక ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్ కాపీ, పది, ఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయి మెమోలు, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, జీఆర్‌ఈ, జీఎంఏటీ స్కోర్ల వివరాలు సమర్పించాలి. ట్యాక్స్ అసెస్‌మెంట్, విదేశీ విశ్వవిద్యాలయంలో ప్రవేశానికి సంబంధించిన అనుమతి పత్రం, బ్యాంకు పాసుపుస్తకం, ఫొటో స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఎంపిక కోసం ప్రత్యేక కమిటీ

బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా స్పెషల్ చీఫ్ సెక్రటరీ/ బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి, ఎస్సీ అభివృద్ధిశాఖ కమిషనర్, సాంకేతిక విద్య కమిషనర్, బీసీ సంక్షేమశాఖ కమిషనర్, విదేశీ విద్యకు సంబంధించిన నిపుణుడు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు.

1,111

ఈవారంలో సెన్సెక్స్ నష్టపోయిన పాయింట్లు

ముంబై, ఆగస్టు 11: స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. అమెరికా-కొరియా దేశాలు యుద్ధానికి కాలు దువ్వుతుండటంతో దలాల్‌స్ట్రీట్ వర్గాల్లో నెలకొన్న భయాందోళనలు ఈసారి వృద్ధి అవకాశాలపై ఆర్థిక సర్వే హెచ్చరించడంతో మరింత పెరిగాయి. దాంతో ప్రామాణిక సూచీలు ఒక శాతానికిపైగా నష్టపోయాయి. శుక్రవారం స్టాక్ ఎక్స్చేంజ్‌లలో ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 317.74 పాయింట్లు కోల్పోయి 31,213.59 వద్దకు పడిపోయింది. జూలై 4 తర్వాత సూచీకిదే కనిష్ఠ ముగింపు స్థాయి. గత నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 794.08 పాయింట్లు క్షీణించింది. తాజా సెషన్‌లో నిఫ్టీ 109.45 పాయింట్లు జారుకొని 9,710.80 వద్ద స్థిరపడింది. జూలై 7 తర్వాత సూచీకిదే కనిష్ఠ ముగింపు స్థాయి. గడిచిన ఐదు వారాలు వరుసగా బలపడుతూ వచ్చిన సూచీలు ఈవారమంతా నష్టాల్లోనే పయనించాయి. ఈవారం మొత్తానికి సెన్సెక్స్ 1,111.82, నిఫ్టీ 355.53 పాయింట్లు నష్టపోయాయి. వారాంతం ట్రేడింగ్‌లో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.95 వేల కోట్లకుపైగా పతనమై రూ.127,08,846 కోట్లకు పరిమితమైంది. సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీల్లో ఎస్‌బీఐ షేర్లు అత్యధికంగా 5.36 శాతం క్షీణించాయి. మహీంద్రా అండ్ మహీంద్రా 3.10 శాతం జారుకోగా.. రిలయన్స్, ఎల్ అండ్ టీ, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ స్టాకులు 2 శాతానికి పైగా పడిపోయాయి. డాక్టర్ రెడ్డీస్ మాత్రం 3.20 శాతం లాభపడి సెన్సెక్స్ టాప్‌గెనర్‌గా నిలిచింది.

సెన్సెక్స్	నిఫ్టీ
31,214	9,711
↘ 318	↘ 109

బంగారం ధరలు

ముంబై

24 క్యారెట్లు	29,210
22 క్యారెట్లు	28,060
వెండి (కిలో)	39,110

ముడి చమురు (బ్రెంట్)

↘ 51.75

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.45	67.78
ఆస్ట్రేలియా డాలర్	45.87	53.08
బహ్రెయిన్ దినార్	158.39	181.41
యూరో	68.80	79.78
జపాన్ యెన్/100	53.66	62.22
కువైట్ దినార్	175.89	219.10
ఒమన్ రియాల్	154.98	177.35
సౌదీ రియాల్	15.54	18.42
సింగపూర్ డాలర్	42.88	50.80
స్టెర్లింగ్ పౌండ్	75.92	88.06
యూఏఈ దిర్హామ్	15.91	18.60

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌ఏ
హైదరాబాద్	338-00	338-00
రంగారెడ్డి	338-00	338-00
మెదక్	338-00	338-00
కరీంనగర్	340-00	---
వరంగల్	340-00	---
రిటైల్ ప్రైస్	4-00	4-00

చికెన్ ధరలు

ఫారం ధర	77.00
రిటైల్ లైవ్	91.00
డ్రెస్డ్	127.00
స్కిన్‌లెస్	150.00

ఈసారి 7.5% వృద్ధి కష్టమే!

ఆర్థిక వ్యవస్థపై అనిశ్చితి మబ్బులు.. భవిష్యత్ సవాళ్లమయమే.. హెచ్చరించిన ఆర్థిక సర్వే నివేదిక

న్యూఢిల్లీ, ఆగస్టు 11:

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ పురోగతి అవకాశాలపై అనిశ్చితి నెలకొందని ప్రభుత్వ ఆర్థిక సర్వే నివేదిక హెచ్చరించింది. గతంలో అంచనావేసిన 6.75- 7.5 శాతం వృద్ధి శ్రేణిలో గరిష్ఠ స్థాయిని చేరుకోవడం కష్టమేనని రిపోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా వడ్డీరేట్లు మరింత తగ్గాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. రూపాయి బలోపేతం, పంటరుణాల మాఫీ, విద్యుత్, టెలికం సంస్థల ఆస్తుల నాణ్యతలో క్షీణత, జీఎస్టీ అమలుతో ఉత్పన్నమయ్యే సమస్యల రూపంలో ఆర్థిక వ్యవస్థకు భవిష్యత్‌లో సవాళ్లు ఎదురుకావచ్చని, వృద్ధికి అవరోధంగా మారవచ్చని నివేదిక పేర్కొంది. ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితుల కారణంగా ఆర్థిక వ్యవస్థ పుంజుకోలేకపోతున్నదని, ఫలితంగా ద్రవ్య స్థిరీకరణ లక్ష్యాలు గురితప్పే అవకాశాలు లేకపోలేవని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ రూపొందించిన 'ఆర్థిక సర్వే 2016-17' రెండో భాగాన్ని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. మొదటి భాగాన్ని జనవరి 31న పార్లమెంట్‌కు సమర్పించింది. ఆర్థిక సర్వే రెండో భాగం ముఖ్యాంశాలు..



- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2017-18) వృద్ధిరేటు 7.5 శాతానికి చేరుకోవడం కష్టమే. జనవరిలో విడుదల చేసిన ఆర్థిక సర్వే మొదటి భాగంలో ఈసారి వృద్ధిరేటును 6.75-7.5 శాతం స్థాయిలో ఉంటుందని ప్రభుత్వం అంచనావేసింది.
- ఈ సారి ద్రవ్యలోటు జీడీపీలో 3.2 శాతంగా నమోదుకావచ్చు. గతసారి 3.5 శాతంగా ఉంది.
- వచ్చే ఏడాది మార్చికల్లా రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం దిగువనే కొనసాగవచ్చు.
- ఈసారి ఆర్థిక వ్యవస్థ పురోగతిపై అనిశ్చితి నెలకొంది.
- ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయిలోనే కొనసాగుతున్న నేపథ్యంలో ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్బీఐ రెపోరేటును మరో 0.25-0.75 శాతం మేర తగ్గించేందుకు అవకాశం ఉంది.
- జీఎస్టీ అమలుతోపాటు ఎయిర్‌ఇండియా ప్రైవేటీకరణ, ఇంధన సబ్సిడీల వ్యయం తగ్గింపు, బ్యాంకుల మొండిబకాయిల పరిష్కారం వంటి సంస్థాగత సంస్కరణలను చేపట్టాం.
- జీఎస్టీ అమలు నేపథ్యంలో పన్నుల పరిధి పెరిగినట్లుగా ప్రాథమిక సంకేతాలందుతున్నాయి
- పెద్ద నోట్ల రద్దు తర్వాత నామమాత్ర జీడీపీ పుంజుకుంది. అలాగే కొత్తగా 5.4 లక్షల మంది పన్ను చెల్లింపుదారుల జాబితాలో చేరారు. పెద్ద నోట్ల రద్దు నిర్ణయం సత్ఫలితాలు మున్ముందు కూడా చవిచూస్తాం.
- పంట రుణాల మాఫీ కారణంగా ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌కు జీడీపీలో 0.7 శాతం మేర గండిపడవచ్చు. రాష్ర్టాల పంట రుణాల మాఫీ విలువ రూ.2.7 లక్షల కోట్ల స్థాయికి చేరుకోవచ్చు.
- వ్యవసాయోత్పత్తుల సరఫరాపై ఆంక్షలు, నిల్వలపై పరిమితులకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉంది.
- బ్యాంకుల రుణ వృద్ధి తగ్గుతూ వస్తున్నది. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకుల రుణ వృద్ధి సమృద్ధిగా ఉంది.
- ఏడో వేతన సంఘం సిఫారసుల మేరకు ఇంటి అద్దె భత్యం పెంపుతో ద్రవ్యోల్బణం 0.40-1 శాతం మేర పెరిగే అవకాశం ఉంది.
- ఆర్థికవ్యవస్థ మందగించిన నేపథ్యంలో ద్రవ్యోల్బణం 4 శాతం దిగువనే కొనసాగవచ్చు.
- చమురు ధరలపై భౌగోళిక రాజకీయ పరిస్థితుల ప్రభావం ముందున్నంతగా లేదు.
- గత ఏడాది సెప్టెంబర్ నాటికి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల వాటా 9.2 శాతంగా నమోదుకాగా.. మార్చి 2017 నాటికి 9.5 శాతానికి పెరిగింది.
- 2030కల్లా జీడీపీపై ఉద్గారాల తీవ్రతను 33-35 శాతం మేర తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి వాటాను 40 శాతానికి పెంచుతాం.
- పేదలకు మరింత సమర్థనీయమైన ఇంధన వనరుల లభ్యతను పెంచాల్సిన అవసరం ఉంది.
- గడిచిన ఆర్థిక సంవత్సరంలో(2016-17) కరెంట్ ఖాతా లోటు జీడీపీలో 0.7 శాతానికి తగ్గింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో (2015-16) 1.1 శాతంగా నమోదైంది.
- గత ఆర్థిక సంవత్సరంలో స్థూల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 6,020 కోట్ల డాలర్లకు చేరుకుంది. 2015-16లో 5,560 కోట్ల డాలర్లుగా ఉంది. నికర ఎఫ్‌డీఐలు మాత్రం 2015-16లో నమోదైన 3,600 కోట్ల డాలర్ల నుంచి 3,560 కోట్ల డాలర్లకు తగ్గాయి.
- విదేశీ మారక నిల్వలు 38,640 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. భారీగా విదేశీ మారక నిల్వలున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ది రెండో స్థానం. బ్రెజిల్ మొదటి స్థానంలో ఉంది.
- అంతర్జాతీయ వాణిజ్యం మళ్లీ చిగురిస్తున్నది. 2017లో ప్రపంచ వాణిజ్య వృద్ధి 3.8 శాతానికి చేరుకోవచ్చని అంచనా. వచ్చే ఏడాది 3.9 శాతానికి పెరిగే అవకాశం ఉంది. భారత వాణిజ్య వృద్ధి కూడా పుంజుకుంటున్నది.
- ప్రాథమిక విద్యలో నాణ్యత తగ్గుతున్నది. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడం సవాలే.
- దేశంలో ఉపాధి కల్పన అతిపెద్ద సవాలుగా మారింది. ఉద్యోగ మార్కెట్‌లో అనధికార, అసంఘటిత, కాలానుగుణ కార్మికుల వాటానే అధికం. తగినన్ని ఉద్యోగాలు అందుబాటులో లేకపోవడం, నైపుణ్య కొరత వంటి సమస్యలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. కఠిన చట్టాలు జాబ్ మార్కెట్ వృద్ధికి అవరోధంగా మారాయి.
- మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మౌలిక వసతుల లేమిని పరిష్కరించేందుకు బహుముఖ వ్యూహాన్ని అనుసరించనున్నాం. రహదారుల నెట్‌వర్క్‌ను భారీగా అభివృద్ధి చేసేందుకు భారత్‌మాలా పేరుతో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టాం. రూ. లక్ష కోట్ల రోడ్డు ప్రాజెక్టులను పునర్వ్యవస్థీకరించాం. అంతర్జాతీయ విమాన మార్గాల్లో దేశీయ ఎయిర్‌లైన్స్ వాటా పెంచే విషయంపై దృష్టిసారించాం. అంతర్గత జలమార్గాల అభివృద్ధి, రైల్వే శాఖను మరింత మెరుగుపర్చనున్నాం.
- అమెరికాతోపాటు పలు దేశాల వీసా నిబంధనలు కఠినతరం కావడంతోపాటు, సిబ్బందికి ఆధునిక సాంకేతికతపై పునర్‌శిక్షణ ఇవ్వాల్సిరావడం దేశీయ ఐటీ-బీపీవో ఇండస్ట్రీకి కీలక సవాళ్లుగా మారాయి.
- భారత వాణిజ్య లోటు (ఎగుమతుల కంటే దిగుమతుల విలువ అధికంగా ఉండటం) పెరుగుతుండటం, అమెరికాతోపాటు పలు అభివృద్ధి చెందిన దేశాలు వాణిజ్య పరంగా ప్రపంచీకరణ వ్యతిరేక విధానాలు అవలంభిస్తుండటం ఆందోళనకరం.
- టెలికం రంగంలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) పెరుగుతుండటం ఆందోళనకరం. రిలయన్స్ జియో రంగప్రవేశంతో ఇతర టెలికం సంస్థల ఆదాయం గణనీయంగా తగ్గింది.
- వైద్యం, విద్య వంటి సామాజిక సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వం పెట్టే ఖర్చు 11.5 శాతం పెరిగి రూ.11,18,094 కోట్లకు పెరిగింది. అయితే, భారత్ వైజ్ఞానిక దేశంగా ఎదుగుతున్న నేపథ్యంలో సామాజిక మౌలిక వనరులను బలోపేతం చేసుకునేందుకు వ్యయాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉంది.
- దేశంలో మహిళలపై లైంగిక వేధింపులు, అపహరణలు వంటి నేరాలు భయంకరమైన స్థాయికి పెరిగాయి. దేశ జనాభాలో సగం వాటా ఉన్న మహిళల స్వేచ్ఛకు, సాధికారతకు ఈ పరిణామాలు ప్రధాన ప్రతిబంధకాలుగా మారాయి.
- గడిచిన ఆర్థిక సంవత్సరంలో దేశీయ కార్పొరేట్ సంస్థలు బాండ్ల జారీ ద్వారా రూ.6.7 లక్షల కోట్ల నిధులు సేకరించాయి.

ఆశావాదం.. ఆందోళన

ఆర్థిక సర్వేపై పారిశ్రామిక వర్గాలు

దేశ పురోగతి అవకాశాలపై ఆర్థిక సర్వే నివేదిక ఆందోళనలతోపాటు ఆశావాదాన్ని కూడా వ్యక్తం చేసిందని పారిశ్రామిక వర్గాలన్నాయి. నివేదిక ప్రస్తుత సవాళ్లకు అద్దంపట్టేలా ఉందని, ఆర్థిక వ్యవస్థ పూర్తి సామర్థ్యం మేరకు వృద్ధి చెందేందుకు విశ్వసనీయమైన పరిష్కారాలను సూచించిందని అన్నారు. ఇటు బ్యాంకులు, అటు కార్పొరేట్ సంస్థల ఆస్తుల నాణ్యత పెంచే విషయంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రముఖ వాణిజ్య మండళ్లు సీఐఐ, ఫిక్కీ, అసోచామ్ ప్రశంసించాయి.

అన్ని రంగాల్లో మందగమనం

ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్



ఆర్థిక వ్యవస్థలో అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందకొడిగా సాగుతున్నాయని, స్వల్పకాలిక సవాళ్లను పరిష్కరించడం ద్వారా వృద్ధిని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం వీలైనన్ని సాధనాలను ఉపయోగించాలని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ సూచించారు. బలపడుతున్న రూపాయి, పంట రుణాల మాఫీ, జీఎస్టీ అమలుతో ఎదురుకానున్న సవాళ్లు వృద్ధిని అడ్డుకోవచ్చని, పుంజుకుంటున్న ఎగుమతులొక్కటే ఆశాజనకంగా కన్పిస్తున్నాయన్నారు. రైతులకు దిగుబడిపై గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఉందని, మార్కెట్ రేటును కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కంటే పెంచగలిగే విధానాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

స్టాక్ మార్కెట్ ర్యాలీ తాత్కాలికమే!

స్టాక్ మార్కెట్లో గడిచిన కొన్ని నెలలుగా కొనసాగుతున్న బుల్‌ర్యాలీ తాత్కాలికమేనని సుబ్రమణియన్ హెచ్చరించారు. మార్కెట్లో ద్రవ్యలభ్యత మోతాదుకు మించి పెరుగుడం ఈ ర్యాలీకి కారణమని, త్వరలోనే మార్కెట్ సూచీలు దిద్దుబాటుకు లోనుకావచ్చని, మళ్లీ సాధారణ స్థాయికి చేరుకోవచ్చన్నారు. గత ఐదు వారాల్లో వరుసగా బలపడుతూ వచ్చిన స్టాక్ మార్కెట్ సూచీలు ఈవారంలో వరుస నష్టాల్లో కొనసాగుతున్నాయి.

పడకేసిన పారిశ్రామికం

- జూన్‌లో -0.1 శాతానికి క్షీణించిన ఐఐపీ



న్యూఢిల్లీ, ఆగస్టు 11: పారిశ్రామికం మళ్లీ పడకేసింది. తయారీ, క్యాపిటల్ గూడ్స్ రంగాల్లో నెలకొన్న నిస్తేజం కారణంగా పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) రుణాత్మకంలోకి మళ్లింది. జూన్ నెలకుగాను సూచీ - 0.1 శాతానికి జారుకుంది. గనులు, విద్యుత్ ఉత్పత్తి, మౌలిక/నిర్మాణ పరికరాలు, వినియోగదారుల వస్తువులు కూడా నిరాశాజనక పనితీరు కనబర్చడంతో పారిశ్రామిక రంగ మరింత పతనమవడానికి కారణమైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో పారిశ్రామిక రంగ వృద్ధి 8 శాతంగా నమోదైందని కేంద్ర గణాంక శాఖ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పారిశ్రామిక వృద్ధిరేటు రుణాత్మక జోన్‌లోకి రావడం ఇదే తొలిసారి. ఏప్రిల్‌లో 3.4 శాతంగా నమోదవగా, ఆ తర్వాతి నెలలో 2.8 శాతంగా ఉంది. ఐఐపీ డాటాలో 77 శాతం వాటా కలిగిన తయారీ రంగ వృద్ధి - 0.4 శాతానికి పడిపోయింది. 2016 సంవత్సరం ఇదే కాలానికి 7.5 శాతంగా ఉంది. గనులు, విద్యుత్ రంగాలు కూడా నిరాశాజనక పనితీరును కనబరిచాయి. జూన్‌లో గనుల వృద్ధి 10.2 శాతం నుంచి 0.4 శాతానికి పరిమితమవగా, విద్యుత్ వృద్ధి 9.8 శాతం నుంచి 2.1 శాతానికి జారుకుంది. పెట్టుబడులకు ప్రామాణికమైన క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి 6.8 శాతంగా నమోదైంది. గతేడాది ఇదే నెలలో నమోదైన 14.8 శాతంతో పోలిస్తే రెండింతలు తగ్గింది. అలాగే ప్రాథమిక వస్తువులలో వృద్ధి 0.2 శాతంగాను, ఇంటర్‌మీడియట్ గూడ్స్‌లో 0.6 శాతానికి తగ్గాయి. కన్జ్యూమర్ డ్యూరబుల్ -2.1 శాతంగాను, కన్జ్యూమర్ నాన్-డ్యూరబుల్ రికార్డు స్థాయి 4.9 శాతం వృద్ధిని కనబరిచింది. 23 పారిశ్రామిక విభాగాల్లో 15 రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను పారిశ్రామిక వృద్ధిరేటు 2 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వృద్ధి 7.1 శాతంగా ఉంది.

పార్శ్వనాథ్‌తోసహా 6 సంస్థలకు ఊరట

న్యూఢిల్లీ, ఆగస్టు 11: అనుమానిత షెల్ కంపెనీల జాబితాకెక్కిన పార్శ్వనాథ్ డెవలపర్స్‌తోపాటు మరో ఐదు సంస్థలకు కొంత ఊరట లభించింది. ఈ సంస్థల షేర్లపై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెబీ' విధించిన ట్రేడింగ్ ఆంక్షలపై సెక్యూరిటీస్ అపిల్లెట్ ట్రిబ్యునల్ (శాట్) స్టే విధించింది. దాంతో స్టాక్ ఎక్స్చేంజ్‌లు సోమవారం నుంచి ఈ కంపెనీల షేర్లలో ట్రేడింగ్‌ను పునఃప్రారంభించనున్నాయి. పార్శ్వనాథ్‌తోపాటు ఎస్క్యూఎస్ ఇండియా, బీఎఫ్ఎస్ఐ, పిన్‌కాన్ స్పిరిట్, సిగ్నెట్ ఇండస్ట్రీస్‌లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ అయిన సంస్థలు కాగా.. కవిత్ ఇండస్ట్రీస్, కల్పన ఇండస్ట్రీస్ (ఇండియా) లిమిటెడ్ కేవలం బీఎస్ఈలోనే లిస్టయ్యాయి. ఈ కంపెనీల షేర్లను గ్రేడెడ్ నిఘా వ్యవస్థ నుంచి బదలాయించి ఈనెల 14 నుంచి రోజువారీ ట్రేడింగ్‌కు అందుబాటులో ఉంచనున్నట్లు స్టాక్ ఎక్స్చేంజ్‌లు సమాచారం ఇచ్చాయి. అనుమానిత షెల్ కంపెనీ జాబితాకెక్కిన జే కుమార్, ప్రకాశ్ ఇండస్ట్రీస్‌లు గురువారమే శాట్ నుంచి స్టే తెచ్చుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం 331 అనుమానిత షెల్ కంపెనీల లిస్ట్‌ను సెబీకి పంపింది. దాంతో ఆ సంస్థలపై ట్రేడింగ్ ఆంక్షలు విధించాలని ఎక్స్చేంజ్‌లను సెబీ ఆదేశించింది. షెల్ కంపెనీ ట్యాగ్‌ను సవాలు చేస్తూ కొన్ని సంస్థలు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. ప్రాథమిక దర్యాప్తు కూడా చేయకుండా ఆంక్షలు విధించడం సరికాదన్న ట్రిబ్యునల్ సెబీ ఆదేశాలపై స్టే విధించింది.

మూడింతలైన ఎస్‌బీఐ లాభం

- క్యూ1లో రూ.3,032 కోట్లుగా నమోదు
- భారీగా పెరిగిన మొండిబకాయిల భారం

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఆర్థిక ఫలితాలు అంచనాలు మించాయి. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ ఏకీకృత (కన్సాలిడేటెడ్) నికర లాభం రూ.3,032 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలానికి నమోదైన రూ.1,046 కోట్ల కన్సాలిడేటెడ్ లాభంతో పోలిస్తే మూడింతలు పెరిగింది. బ్యాంక్ స్టాండలోన్(స్వతంత్ర) నికర లాభం మాత్రం ఐదింతలు పెరిగి రూ.2,006 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలానికి స్టాండలోన్ లాభం రూ.374 కోట్లుగా ఉంది. ఐదు అనుబంధ బ్యాంకులతోపాటు భారతీయ మహిళా బ్యాంక్‌ను తనలో విలీనం చేసుకున్న తర్వాత ఎస్‌బీఐ విడుదల చేసిన తొలి త్రైమాసికపు ఆర్థిక ఫలితాలివి. ఈ సారి లాభాలు మెరుగైనప్పటికీ మొండిబకాయిలతోపాటు (ఎన్‌పీఏ) ఇతర కీలక అంశాల్లో బ్యాంక్ క్షీణతను కనబర్చింది. ముఖ్యంగా బ్యాంక్ ఎన్‌పీఏలు భారీగా పెరుగడం ఆందోళన కల్గించే విషయం. సమీక్ష కాలానికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 9.97 శాతానికి పెరిగాయి. అంతక్రితం ఏడాది ఇదేకాలానికి 7.40 శాతంగా నమోదయ్యాయి. నికర ఎన్‌పీఏలు వార్షిక ప్రాతిపదికన 4.36 శాతం నుంచి 5.97 శాతానికి ఎగబాకాయి. జూన్ 2016 చివరి నాటికి రూ.1,37,662 కోట్ల స్థాయిలో ఉన్న నిరర్థక ఆస్తుల విలువ గడిచిన త్రైమాసికానికి రూ.1,88,068 కోట్లకు చేరుకున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ నిర్వహణ ఆదాయం 5.17 శాతం క్షీణించి రూ.25,612 కోట్లకు పరిమితమైంది. 2016-17 సంవత్సరంలో ఇదే కాలానికి రూ.27,007 కోట్లుగా ఉంది. ఫీజుల రూపంలో బ్యాంక్‌కు రూ.4,870 కోట్ల ఆదాయం లభించింది. నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 3.51 శాతం పతనమై రూ.17,606 కోట్లకు పడిపోయింది. వడ్డీయేతర ఆదాయంలో 8.62 శాతం క్షీణించి రూ.8,006 కోట్లుగా నమోదైంది. గడిచిన త్రైమాసికంలో బేస్‌రేటు/ఎంసీఎల్ఆర్ తగ్గించడంతో రూ.3,400 కోట్ల ఆదాయం కోల్పోవాల్సి వచ్చిందని బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. జూన్ 30 నాటికి బ్యాంక్ డిపాజిట్లు 13.28 శాతం పెరిగి రూ.26,02,534 కోట్లకు చేరుకున్నాయి. అలాగే అడ్వాన్స్‌లు స్వల్పంగా పెరిగి రూ.18,86,666 కోట్లకు చేరాయి. ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో రూ.70,776.56 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయాన్ని ఆర్జించింది.

బీవోబీకి కేటాయింపుల దెబ్బ

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ఆర్థిక ఫలితాలకు కేటాయింపుల సెగ తగిలింది. గడిచిన త్రైమాసికానికిగాను రూ.203.39 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు బ్యాంక్ ప్రకటించింది. 2016-17 ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.423.62 కోట్ల లాభంతో పోలిస్తే 52 శాతం క్షీణించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి అధికంగా నిధులు కేటాయించడం వల్లనే లాభాల్లో గండిపడిందని బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. సమీక్షకాలానికి బ్యాంక్ రూ.12,103.86 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. జూన్ 2016 నాటికి రూ.42,991 కోట్లుగా ఉన్న బ్యాంక్ మొండి బకాయిలు గడిచిన త్రైమాసికానికిగాను రూ.46,172.77 కోట్లకు పెరిగాయి. శాతాల వారీగా చూస్తే 11.40 శాతంగా నమోదయ్యాయి. నికర ఎన్‌పీఏ రూ.20,783.77 కోట్ల(5.73 శాతం) నుంచి రూ.19,519.31 కోట్లకు(5.17 శాతం) తగ్గాయి. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.2,156.69 కోట్ల స్థాయిలో నిధులను కేటాయించింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు ధర 3.91 శాతం పతనం చెంది రూ.142.55 వద్ద స్థిరపడింది.

విశాఖ లాభం రూ.23 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 11: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.22.96 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు విశాఖ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.16.68 కోట్ల లాభంతో పోలిస్తే 37.64 శాతం వృద్ధి నమోదైంది. ఆదాయం విషయానికి వస్తే రూ.342.30 కోట్లు ఆర్జించింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలులోకి రావడంతో అమ్మకాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపాయని కంపెనీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ తెలిపారు. దేశ ఆర్థిక పరిస్థితులు కుదుటపడుతుండటం, తక్కువ ద్రవ్యోల్బణం, సాధారణ వర్షాలు కురుస్తుండటంతో ఈ ఏడాది వ్యాపారంపై ఆశాభావంతో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. వ్యాపార విస్తరణలో భాగంగా హర్యానాలో రూ.100 కోట్ల పెట్టుబడితో వీ-బోర్డ్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. 2020 నాటికి రూ.1,500 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.960 కోట్లుగా నమోదైంది. కంపెనీ షేరు ధర 1 శాతం లాభపడి రూ.436 వద్ద స్థిరపడింది.

బిగ్‌బజార్ స్వాతంత్ర్య దినోత్సవ ఆఫర్లు

హైదరాబాద్, ఆగస్టు 11: ఫ్యూచర్ గ్రూపునకు చెందిన రిటైల్ సంస్థ బిగ్‌బజార్.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక తగ్గింపు ఆఫర్లను ప్రకటించింది. మహాబచత్ పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్లు ఈ నెల 12 నుంచి 16 వరకు అంటే ఐదు రోజులపాటు అందుబాటులో ఉండనున్నాయని కంపెనీ సీఈవో సదాశివ్ నాయక్ తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి గృహోపకరణాలు, ఆహార పదార్థాలు, దుస్తులు, ఇతర ఉత్పత్తులను తగ్గింపు ధరకే విక్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు. కొనుగోలుదారులకు ప్రయోజనాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఆఫర్‌ను ప్రకటించినట్లు, రూ.2 వేల కంటే అధికంగా షాపింగ్ చేసిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డు కలిగిన వారికి 7 శాతం అదనంగా రాయితీ లభించనున్నది. అలాగే ఫ్యూచర్ పే వ్యాలెట్‌లో రూ.500 లభిస్తున్నది.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
శనివారం 12 ఆగస్టు 2017
WWW. NTNEWS.COM





అడవిలో పుట్టింది. ఉద్యమాల్లో పెరిగింది. తెలంగాణ తెగువ తోడైంది. ఉస్మానియా చైతన్యం తీర్చిదిద్దింది. అడవిబిడ్డ ఆచార్య వృత్తికి ఎంపికైంది. రిజర్వేషన్లు అవకాశమిచ్చినా.. ఆదివాసీలకు అందనంత దూరంలోనే ఉన్నతోద్యోగాలున్న రోజుల్లో.. గుమ్మడి అనురాధ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇంతవరకూ వినిపించని ఆదివాసీ గొంతుక తొలిసారిగా విశ్వవిద్యాలయ తరగతిగదుల్లో వినిపించబోతున్నది!

ఆదివాసీ ఆణిముత్యం!

ఆదివాసులు తరతరాలుగా అరకొర వసతుల మధ్య బతుకెళ్లదీస్తున్నారు. చదువుకూ.. తిండికీ.. బట్టకూ దూరంగా ఉంటూ జాతి సంపదను తరాలుగా పరిరక్షిస్తున్న అడవి మల్లెలు వాళ్లు. నవ నాగరికతకు దూరంగా బతుకడమే తప్ప అలవికాని సంపదకోసం కరెన్సీ రెపరెపలు తెలియవు. పెట్టుబడిదారీ సామ్రాజ్యకాంక్ష వల్ల ఆదివాసీల జీవితాలు ఎండిపోతూ.. మండిపోతూ మనుగడే ప్రశ్నార్థకమవుతుంటే జల్.. జంగల్.. జమీన్ కోసం ఉద్యమ దివిటీలై రగులుతున్నారు. ఎగిసే నిప్పురవ్వలై తమలోని ప్రతిభా పాటవాలను.. సత్తాను చాటుతున్నారు.

పేదరికమే: అనురాధను లాయర్‌గా చూడాలన్నది తండ్రి గుమ్మడి నర్సయ్య కోరిక. ఆయన మాజీ శాసనసభ్యుడే అయినా పేదరికం అనుభవిస్తున్నారు. అనురాధకు మాత్రం లాయర్‌గా పనిచేయడం ఇష్టం లేదు. దీంతో ఆచార్య వృత్తిలోకి ఇష్టంగా చేరిపోయింది. అనురాధ చేరికతో ఆచార్య వృత్తిలో ఒక ఆదివాసీ అడుగుపెట్టినట్లైంది. సివిల్స్ సాధించి ఆదివాసీలకు సేవ చేయాలనుకున్న అనురాధ జీవితాన్ని పేదరికం అనేక మలుపులు తిప్పింది. ఆ పేదరికాన్ని కష్టపడి గెలుస్తూ అడవిబిడ్డలు గర్వించేలా ఘనతను సాధించింది.

టీచర్లు మంచోళ్లు: ప్రాథమిక స్థాయి నుంచే టీచర్లు తనను ప్రోత్సహించారని.. అక్కడే తన లక్ష్యానికి బీజం పడిందని అనురాధ చెప్తున్నారు. 'మా టీచర్లు (ఏపీటీడబ్ల్యూఆర్ఎస్, సుదిమళ్ల, ఖమ్మం జిల్లా) ఉన్నత చదువుల్లో ఏఏ కోర్సులుంటయి. ఏఏ ఉద్యోగాలుంటయి. ఏ కోర్సులో చేరి, ఏ ఉద్యోగం చేయవచ్చో చెప్పేటోళ్లు. సివిల్స్ చదువాలంటే ఆర్ట్స్ కోర్సు చేసిన వాళ్లకే అవకాశాలెక్కువని చెప్పారు. అప్పటికే సివిల్ సర్వీస్‌లో చేరాలన్న కోరిక ఉంది. ఇంటర్మీడియట్‌లో హెచ్ఈసీ తీసుకున్న. డిగ్రీలో ఎకనామిక్స్ లెక్చరర్ కోటేశ్వరరావు చాలా బాగా చెప్పేవారు. ఆయన వల్ల అర్థశాస్త్రంపై ఆసక్తి పెరిగింది. ఎంఏ ఎకనామిక్స్ చేయాలనుకున్న. ఆ రోజుల్లో పీడీఎస్‌యూ మీటింగ్‌లో పాల్గొనేందుకు ఉస్మానియా క్యాంపస్‌కు వచ్చిన. ఆర్ట్స్ కాలేజీ అద్భుతంగా అనిపించింది' అన్నారు.

కష్టాల ప్రయాణం: 2011లో సివిల్స్ మెయిన్స్ సిలబస్ మారింది. అనురాధ మళ్లీ కోచింగ్‌కు పోవాలి. 'కోచింగ్ ఫీజు లక్ష రూపాయలకు పైమాటే. అంతడబ్బు లేదు. ఆర్‌సీ రెడ్డి గారు మొదటిసారి కోచింగ్ ఫ్రీగా ఇచ్చారు. అప్పట్లో బుక్స్ కొనడానికి కూడా డబ్బులు లేవు. కోచింగ్ మానేద్దామనుకున్నా. పాలేరుగా ఉండయినా నిన్ను చదివిస్తనన్నడు నాన్న. ప్రేమతో అన్నాడు. కానీ ఆయన ఆరోగ్యం బాగాలేదు. కిడ్నీ సమస్యతో నెల రోజులు నిమ్స్‌లోనే ఉన్నడు. ఏడాది ఇంటికే పరిమితమైండు. నాన్నకు బాగాలేకపోవడంతో వ్యవసాయం కూడా కలిసిరాలేదు. ఇక సివిల్స్ వద్దనుకున్న. జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగం కోసం ప్రిపేర్ అయిన. ప్రిలిమ్స్, మెయిన్స్ బాగనే రాసిన. ఇంటర్వ్యూకు పిలిచారు. ఆ తర్వాత ఉద్యోగానికైతే పిలువలేదు. ఎల్ఎల్ఎమ్ అయిపోగానే పీహెచ్‌డీలో చేరిన. మెరిట్ ఆధారంగా యూజీసీ రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్ ఇచ్చింది. ఆ సహకారంతో చదువు సాఫీగా సాగింది' అని తన కష్టాల ప్రస్థానం గురించి చెప్పింది అనురాధ.

ఉద్యమ కెరటం : తెలంగాణ ఉద్యమం, పేదరికం అనురాధ చదువుల్ని, అవకాశాల్ని అనేక దారులు మళ్లించాయి. ఆ ప్రయాణానికి తెలంగాణ ఉద్యమం ఓ కారణం అంటున్నదామె. 'సివిల్స్‌కు ప్రిపేరవుతున్న సందర్భంలో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్నది. క్యాంపస్‌లో, నగరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. క్యాంపస్‌లో ఉంటూ సివిల్స్ కోచింగ్‌కు పోయిన. సివిల్స్ ప్రిపరేషన్‌తో ఏపీపీఎస్సీ గ్రూప్స్ కూడా రాయాలనుకున్న. అప్పట్లో గ్రూప్ వన్ ఆఫీసర్ ఉద్యోగాల్లో ఏఏ ప్రాంతాలకు ఎన్ని పోస్టులో స్పష్టత ఇచ్చినంకనే నోటిఫికేషన్ ఇవ్వాలని తెలంగాణ ఉద్యమ సంఘాలు డిమాండ్ చేసినయి. కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రిలిమ్స్ పరీక్షకు హాజరైన. ఉద్యమ సంఘాల పిలుపునకు మద్దతుగా పరీక్ష పేపర్లు చించి నిరసన తెలిపిన. నాలాంటి వాళ్ల నిరసనను ప్రభుత్వం పట్టించుకోలేదు. చించివేసిన వాళ్లకు నిరాశే మిగిలింది. పరీక్ష రాసినవాళ్లకు కొలువులు దక్కినయి. అప్పట్లో అట్లా ఉద్యోగం చేజారింది. ఆ తర్వాత సివిల్స్‌లోనూ పరీక్ష రాయకుండానే చేదు అనుభవం మిగిలింది' అని చెప్పింది అనురాధ.

అనురాధ స్ఫూర్తి:
ఉస్మానియా ఉద్యమ చరిత్ర తెలిశాక అక్కడే చదవాలనుకున్నానంటున్నది అనురాధ. 'పీజీ ఎంట్రన్స్ రాసిన. కానీ కోఠీ ఉమెన్స్ కాలేజీలో ఎకనామిక్స్ వచ్చింది. ఎల్ఎల్‌బీలో క్యాంపస్‌లో సీటు వచ్చింది. క్యాంపస్‌లోనే చదువాలి. ఉద్యమాల్లో ఉండాలని యూనివర్సిటీ లా కాలేజీలో చేరిన. తెలంగాణ ఉద్యమ కార్యక్రమాలే ప్రధాన పాఠాలయ్యాయి ఆ రోజుల్లో. సివిల్స్ ఆఫీసర్ కావాలన్న నా కోరిక తీరలేదు. లాయర్ కావాలన్న నాన్న కోరికా తీరలేదు. కానీ మా మంచి టీచర్ల ప్రోత్సాహంతో నేను ఈ స్థితికి వచ్చిన. ఈ వృత్తిలో వాళ్లలాగే ఎందరికో దారిచూపే అవకాశం ఉందన్న సంతృప్తి మిగిలింది' అంటున్న అనురాధ అధ్యాపక జీవితం కూడా సంతృప్తిగా సాగిపోవాలె. ఆ స్ఫూర్తితో మరెందరో ఆదివాసీలు ఈ దారిలోకి అడుగుపెట్టాలె.

తల ఎందుకు తిరుగుతున్నది?

అడుగండి చెబుతా



నా వయసు 38 సంవత్సరాలు. నాకు తరచుగా కళ్లు తిరుగుతుంటాయి. ఈ సమస్య నన్ను 4 సంవత్సరాలుగా వేధిస్తున్నది. గుండె స్కాన్, బ్రెయిన్ ఎంఆర్ఐ వంటి అన్ని పరీక్షలు చేయించుకున్నాను. అన్ని రిపోర్టులూ నార్మల్ అనే వచ్చాయి. నాకు ఏదైనా డిప్రెషన్ ఉన్నపుడు ఈ సమస్య తీవ్రంగా ఉంటున్నది. ఈ సమయంలో మెడ నొప్పి కూడా ఉంటున్నది. నా సమస్యకు సరైన పరిష్కారం సూచించగలరు?

ప్రశాంత్, జగిత్యాల

మీ లక్షణాలను బట్టి మీకు మరిన్ని పరీక్షలు అవసరమవుతాయని అనిపిస్తున్నది. మీ సమస్యకు అసలు కారణం తెలుసుకోవడానికి అవి తప్పనిసరి. అది గుర్తించగలిగితేనే చికిత్స ప్రారంభించడానికి వీలవుతుంది. ఇలా తల తిరుగడానికి ముఖ్యంగా మూడు కారణాలు ఉండవచ్చు. మొదటిది బినైన్ పొజిషనల్ వర్టిగో(బీవీపీ). ఇది లోపలి చెవికి సంబంధించిన సమస్య. ఈ సమస్యలో తల, మెడ తిప్పినప్పుడల్లా తల తిరుగడం చాలా తీవ్రంగా ఉంటుంది. దీనికి వెస్టిబ్యూలార్ రిహెబిలిటేషన్ అనే ప్రత్యేకమైన వ్యాయామాలు చెయ్యాల్సి ఉంటుంది. రెండో కారణం మెదడులోని రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం లేదా ఏదైనా ఇన్‌ఫెక్షన్ లేదా ట్యూమర్ ఉండడం వంటివి కారణం కావచ్చు. మీ ఎంఆర్ఐ నార్మల్‌గానే ఉంది కాబట్టి అది కాకపోవచ్చు. ఇక మూడోది సర్వైకల్ స్పాండిలోసిస్. ఈ సమస్యలో కూడా మెడనొప్పితో పాటు కళ్లు తిరుగుతాయి. ఈ సమస్యకు చికిత్సగా ఫిజియోథెరపీ చెయ్యడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయి. వీటితో పాటు మందులు కూడా వాడాలి. మీకు డిప్రెషన్ కూడా కలుగుతున్నదని అంటున్నారు కాబట్టి దానికి కూడా చికిత్స తీసుకోవడం అవసరం. మీకు దగ్గరలో ఉన్న న్యూరాలజిస్ట్‌ను సంప్రదిస్తే మీ సమస్యకు సరైన పరిష్కారాన్ని చూపిస్తారు.

డాక్టర్ సుధీర్ కుమార్
సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్
అపోలో హాస్పిటల్స్
హైదరాబాద్



మాకు రాయండి

మీకు ఆరోగ్యపరమైన సమస్యలు, సందేహాలున్నాయా?
అయితే మాకు రాయండి. నిపుణులతో సలహాలు ఇప్పిస్తాం.
నమస్తే తెలంగాణ – అడుగండి చెబుతా(హెల్త్‌డెస్క్)
మా అడ్రస్ : #8-2-3\1\7\8\9, క్రిష్ణాపురం, రోడ్ నెం.10,
బంజారాహిల్స్, హైదరాబాద్-500034. health@ntdaily.news

వాట్సప్!

ట్వీట్

సంజన గర్లానీ
@actressanjjanaa



సంజనను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

157,445



మనసు ఆరోగ్యంగా లేనప్పుడు మెడిటేషన్ చేయాలి. విశ్రాంతి తీసుకోవాలి. విపరీతమైన వైరల్ ఫీవర్ వచ్చినప్పుడు నేను అదే చేశాను. అనుభవిస్తే గానీ దాని విలువ తెలియలేదు.

సమ్‌థింగ్ స్పెషల్



క్యారెట్ పిట్ట.. చేసినోడు దిట్ట!

కామన్‌మ్యాన్ వాయిస్

మా కామారెడ్డి జిల్లా వర్షాధార, భూగర్భ జల ఆధారిత వ్యవసాయం ఉన్న ప్రాంతం. బోర్లు పడక, అప్పులు అయి గల్ఫ్ పోయిన వారెందరో, మా కుటుంబమే ఒక ఉదాహరణ. అటు నిజాం సాగర్, ఇటు శ్రీరాం సాగర్ ఉన్న కామారెడ్డి పరిసర ప్రాంతాలు కరువు ప్రాంతాలు గానే ఉన్నాయి. సగటు వర్షపాతం కంటే ప్రతిసారి తక్కువనే ఉంది. అలాంటి ప్రాంతానికి నదీ జలాలు వస్తున్నాయంటే అడ్డుపడే వారిపై రైతుల ఆగ్రహం సహజం. కోదండరాం గో బ్యాక్.

Naveen Kumar

పురుషుడు నిష్క్రమిస్తే గదిలో ఏదో వదిలి వెళ్తాడు. అదే స్త్రీ నిష్క్రమిస్తే గది శూన్యమే. చివరికి జ్ఞాపకాలని కూడా తీసుకు వెళ్తుంది. అందుకే స్త్రీ లేని జీవితం శూన్యం.

Madhukar Vydhyula

వైరల్ వీడియో



ఒక గర్భిణికి కిటికీ దగ్గర కూర్చుని ప్రయాణం చేయడం ఇష్టం. కానీ ఇప్పుడు ఆ ఇష్టాన్ని మార్చుకున్నది. ఆమెనే కాదు.. ఓ ఉద్యోగి, ఓ వ్యాపారి, ఓ విద్యార్థి ఇలా అందరూ తమ నిర్ణయాలను మార్చుకుంటున్నారు. ఎందుకో తెలిస్తే షాకవుతారు. ఈ వీడియో చూడండి మీకే తెలుస్తుంది.

CEAT Happy Roads

Total views : 271,708+

Published on Aug 9, 2017

షేరింగ్

సరదా ప్రశ్నలు.. కొంటె జవాబులు

సుఖంగా ఉన్న ప్రాణాన్ని కష్టపెట్టడం అంటే?
పెళ్లిచేసుకోవడం.
చావుకు ఎదురెళ్లడం అంటే?
భార్యకు ఎదురు చెప్పడం.
గోడకు తల బాదుకోవడం అంటే?
భార్యకు ఏదైనా అర్థమయ్యేలా చెప్పడం.
స్వర్గం నరకం అంటే?
భార్య పుట్టింటికి వెళ్లడం, నాలుగు రోజుల్లోనే తిరిగి రావడం.
పగ తీర్చుకోవడం అంటే?
పెళ్లి చేసుకోమని ఒకరికి సలహా ఇవ్వడం.
సొంత లాభం చూసుకోవడం అంటే?
పెళ్లి చేసుకోకుండా ఉండటం.
పాపానికి శిక్ష అంటే?
పెళ్లి జరుగడం.
లవ్ మ్యారేజ్ అంటే?
మనతో యుద్ధం చేయడానికి శత్రువుని చూసుకోవడం.
పులి నోట్లో తల పెట్టడం అంటే?
పెళ్లికి సరే అనడం.
పెళ్లి ఫొటోలు చూడడం అంటే?
చేసిన తప్పుకు పశ్చాత్తాపపడటం.

ఓ వాట్సప్ మెసేజ్

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 12 ఆగస్టు 2017
WWW.NTNEWS.COM



పాటకు ప్రాణం పోశాడు

పాటకు అమ్మపాల నురుగును రుద్దితే ఎంత రుచిగా ఉంటుంది? ఎంత మధురంగా ఉంటుంది? ఆ రుచికి అమృతం కూడా అసూయపడుతుంది. తేనె కూడా ఆ రుచిలా తయారవ్వాలని తపిస్తుంది. తెలంగాణ యాస, భాష, ఆట, పాటలో కూడా అంతటి మధురం ఉంటుంది. అలాంటి మధురమైన పాటలకు ప్రాణం పోస్తున్నాడు యువ సంగీత దర్శకుడు బొబ్బిలి సురేష్. తెలంగాణ బాణీలకు నూతన హంగులను, రంగులను అద్దుతూ ప్రపంచానికి పరిచయం చేస్తున్న మ్యూజిక్ మెజీషియన్ పరిచయం ఇది.

జూలై 21
ఫిదా సినిమా విడుదలయింది.
ఇంటర్వెల్ తర్వాత సినిమాలో బతుకమ్మ పండుగ సీన్ పాటకు బ్యాక్‌గ్రౌండ్‌లో 'పున్నామా పున్నామా.. నిండు పున్నామా' పాట వినిపించింది. థియేటర్స్‌లో అమ్మాయిలు, అబ్బాయిలు, చిన్నా, పెద్ద తేడా లేకుండా అరుపులు. కేకలు.

అవును ఆ పాట అంతగా ఆకట్టుకున్నది. వాస్తవానికి ఈ పాట ఆ సినిమాలోనిది కాదు. 2015లో వీ6 చానల్‌లో విడుదల చేసిన బతుకమ్మ పాట. ఈ పాట సందర్శకుడు బొబ్బిలి సురేష్. ఈ ఒక్కటే కాదు.. తెలంగాణ మట్టిపాటలకు పరిమళాలద్ది కొత్త కోణంలో ఆవిష్కరిస్తున్న ఈ యువ సంగీత దర్శకుడు, సినిమాల్లో కూడా రాణిస్తున్నాడు.

పల్లె.. పట్నం. టీస్టాల్, ఫంక్షన్‌హాల్, ఆటో, కార్లు.. స్థలం ఏదైతేనేం.. ప్రదేశం ఇంకేదైతేనేం. ఎక్కడ చూసినా.. మొన్న జరిగిన బోనాల పండుగకు ఒక పాట మార్మోగింది. తెలంగాణ అంతటా జనాల నాలుకల మీద నానింది. అంతేకాదు ఏ పండుగకైనా కొన్ని పాటలు వినిపిస్తుంటాయి. బతుకమ్మ పండుగకు పాటలు పాడకుండా ఆ పాటలే ప్లే చేస్తున్నారు. వరుసగా ఒకే చానల్‌కు తొమ్మిది పాటలకు ట్యూన్స్ చేసే అరుదైన అవకాశాన్ని కూడా అందుకున్నాడు సురేష్. ఒక తెలంగాణ పాటను యూట్యూబ్‌లో కోటి మందికి పైగా చూడడం అంటే మామూలు విషయం కాదు. ఇప్పటికీ ఆ పాట ఆటోల్లో వినిపిస్తుంది.

చిన్నప్పుడు రేడియోలో 'నీ పాదం మీద పుట్టుమచ్చనై' పాట విని స్కూల్‌లో పాడాడు సురేష్. మొదటిసారి ఐదో తరగతి పాటకు బహుమతి అందుకున్నాడు. ఆరోజే పాటగాడు కావాలనుకున్నాడు. ఇదంతా నాణానికి ఒకవైపు. ప్రతి వ్యక్తి జీవిత ప్రయాణంలో ఒడిదుడుకులుంటాయి. ఇతను కూడా కష్టనష్టాలకోర్చాడు. కాలేజీలో చదువుకోవడానికి పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేశాడు. పేపర్ సర్క్యులేషన్ బాయ్‌గా, హెరిటేజ్‌లో సేల్స్‌బాయ్‌గా కూడా పనిచేశాడు. 2009 ఎన్నికల సమయంలో పార్టీ ప్రచార రథాల్లో పాటలు కూడా పాడాడు.

మహబూబాబాద్ జిల్లా గౌరారానికి చెందిన కాంతమ్మ, శంభయ్య సురేష్ తల్లిదండ్రులు. అమ్మ పాటలు పాడేది. నాన్న కళాకారుడు. స్టేజీ మీద నాటకాలు వేసేవాడు. అదే వారసత్వంగా సురేష్ స్కూల్ డేస్ నుంచి పాటలు పాడేవాడు. డిగ్రీ వరకు చదువుకుని మ్యూజిక్ నేర్చుకోవడం కోసం హైదరాబాద్ వచ్చాడు. అన్న నందన్ బొబ్బిలి కూడా మ్యూజిక్ డైరెక్టర్. అతని స్టుడియోలో సౌండ్ ఇంజినీర్ విష్ణు దగ్గర

> **కృషికి గుర్తింపు రావాలి**
>
> కొంతమంది కష్టాన్ని.. కొంత మంది మోసుకెళ్లడం నాకు ఇష్టం లేదు. ప్రతి వ్యక్తి కష్టానికి, కృషికి గుర్తింపు రావాలి. అప్పుడే వాళ్లు చేసిన పనికి అర్థం ఉంటుంది. ఎవరు చేయాల్సిన పని వాళ్లు చేస్తే అర్థముంటుంది. నేను పాట కూడా పాడగలను. కానీ పాట సింగర్‌తో పాడిస్తేనే ఫీల్ ఉంటుంది. నా పాటలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు.
>
> **బొబ్బిలి సురేష్, సంగీత దర్శకుడు**



సౌండ్ మిక్సింగ్ నేర్చుకున్నాడు. సంవత్సరం తర్వాత మిక్కి జే మేయర్, చక్రి, మణిశర్మ, అనూప్ రూబెన్స్ దగ్గర సౌండ్ ఇంజినీర్‌గా పనిచేశాడు. చక్రి దగ్గర జైబోలో తెలంగాణ సినిమాకు కూడా సౌండ్ ఇంజినీర్‌గా పనిచేశాడు. వెయ్యికిపైగా తెలంగాణ ఆడియో ఆల్బమ్స్ రూపొందించాడు. తెలంగాణ ప్రాంత పాటలను కొత్తగా చేయాలని తపించాడు. మన యాస, భాషను పాటల రూపంలో ఆవిష్కరిస్తున్నాడు.
సినిమాకు మ్యూజిక్ ఎంత ప్రాణమో ఆ మ్యూజిక్‌కు మ్యూజిక్ డైరెక్టర్ పని తీరు అంతే ప్రాణం. కొన్ని సినిమాలు అయితే కేవలం సంగీతం మీద ఆధారపడి విజయం సాధిస్తాయి. అలాంటి మ్యూజిక్ రంగంలో వచ్చే తరానికి తెలంగాణ నుంచి మరింత మంది ఆణిముత్యాలు రానున్నారు. బుల్లి తెరమీద తనదైన పాటలతో తన ముద్ర వేసుకున్న బొబ్బిలి సురేష్.. ఫ్రెష్ ట్యూన్స్‌తో ప్రేక్షకులను క్రష్ చేస్తున్నాడు. బతుకమ్మ పాట అయినా, బోనం పాట అయినా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ పాట అయినా ఆకట్టుకునే ట్యూన్‌లతో ప్రత్యేక పాటలకు తనదైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్నాడు. ప్రతి పాటలో తెలంగాణ నేపథ్యం, మన ప్రాంత మట్టి పరిమళం మిస్ అవ్వకుండా జాగ్రత్త పడుతున్నాడు.

2013లో మొదటిసారి వీ6 న్యూస్ చానల్ కోసం బతుకమ్మ పాట రూపొందించాడు. అప్పటి ప్రోగ్రామింగ్ హెడ్ దామోదర్ రెడ్డి, లిరిక్ రైటర్ మిట్టపల్లి సురేందర్ ప్రోత్సాహంతో పాట సిద్ధం చేశాడు. ఆ పాటకు ఊహించనంతగా స్పందన వచ్చింది. తెలంగాణ సమాజం ఆ పాటను సూపర్‌హిట్ చేసింది. నన్ను గన్న తల్లి నా తెలంగాణ మొదలు, మాది తెలంగాణ జాతిలాంటి ఎన్నో పాటల్ని అందించాడు. 2014లో పుడమి ఎదలపైన పురుడోసుకున్న పాట, 2015లో వినాయకుడి సాంగ్ చేశాడు. 2015లో 'పున్నామా పున్నామా' పాటతో మరింత పేరొచ్చింది. ఈ పాట కోసం మూడు నెలలు కష్టపడి 30 తెలంగాణ బాణీలను సేకరించాడు. ఈ పాట చేశాక వినిపిస్తే కొంతమంది బాగలేదని నిరుత్సాహ పరిచారట. కానీ వెనుకడుగు వేయలేదు. ఫలితం పాట విడుదలయ్యాక వచ్చిన స్పందన.

ఆర్యచిత్ర అనే ఓ సినిమాకు సంగీతాన్ని అందించాడు సురేష్. ఆ సినిమా ఎక్కువ జనాలకు తెలియదు. పాటల పరంగా మంచి పేరొచ్చింది. మా అబ్బాయి, గువ్వ గోరింక, నీది నాది ఒకే కథ.. సినిమాలకు సంగీతాన్ని అందిస్తున్నాడు. అప్పట్లో ఒకడుండేవాడు సినిమాకు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కొట్టాడు. జార్జిరెడ్డి సినిమాకు కూడా తన సంగీతంతో మ్యాజిక్ చేయబోతున్నాడు. మెలోడీ చేసినా, వెస్టర్న్ చేసినా, మాస్ బీట్ సాంగ్ చేసినా సురేష్ స్టయిల్ కనిపిస్తుంది. ప్రతిపాటలో కొత్తదనం కోసం తపిస్తున్నాడు. ఇటీవల మైక్ టీవీలో విడుదలయిన బోనం అనే పాటకు ర్యాప్ మిక్స్ చేశాడు. ఈ పాటకు కూడా విశేష స్పందన వచ్చింది.

పట్టులాంటి జుట్టుకు..

అందమైన జుట్టు సొంతం కావాలని అందరికీ ఉంటుంది. కానీ పోషకాల లేమి, వాతావరణం, దుమ్ము, ధూళి వంటి కారణాల వల్ల జుట్టు రాలడం ఎక్కువైపోతున్నది. ఈ సమస్య తగ్గడానికి కొన్ని చిట్కాలు..



- ఉల్లిపాయ ముక్కలు వేసి మరిగించి నూనెను తలకి రాసి మర్దన చేయాలి. అరగంట తర్వాత గంజిని తలకు పట్టించి ఆరిన తర్వాత తలస్నానం చేయాలి. దీనివల్ల రక్తప్రసరణ సమర్థవంతంగా జరిగి ఒత్తయిన జుట్టు సొంతమవుతుంది.
- మెంతుల్ని రాత్రంతా నానబెట్టి మెత్తగా చేసుకోవాలి. దానిలో రెండు చెంచాల మందార పొడి, పుల్లని పెరుగు, ఆముదం కలిపి తలకు రాయాలి. గంట తర్వాత తలస్నానం చేయాలి. ఈ ప్యాక్ వల్ల జుట్టు చిట్లడం తగ్గుతుంది.
- మందార ఆకులు, కలబంద గుజ్జుని మెత్తగా చేసి తలకు పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. ఇలా చేస్తే.. జుట్టు మెత్తగా తయారవ్వడమే కాదు.. జుట్టు నల్లగా నిగనిగలాడుతుంది.
- నిత్యం ప్రయాణాలు చేసేవారు వారానికోసారి కండీషనర్ ఉపయోగించాలి. టీ డికాషన్‌లో రెండు చుక్కల నిమ్మరసం, కోడిగుడ్డులోని తెల్లసొన, బాదం నూనె కలిపి ఆ మిశ్రమాన్ని తలకు పట్టించి గంట తర్వాత తలస్నానం చేయాలి. ఇది మంచి కండీషనింగ్ ఇస్తుంది.
- కొబ్బరి నూనెలో మందార పువ్వు, తులసి, కరివేపాకు వేసి మరిగించాలి. దీన్ని వారానికోసారి తలకు పట్టించి అరగంట తర్వాత తలస్నానం చేస్తే జుట్టు నిగారింపు సంతరించుకుంటుంది.

జీన్స్‌తో పర్యావరణానికి ముప్పు..



మీకు జీన్స్‌ప్యాంట్ వేసుకునే అలవాటు ఉందా? అయితే మీరు పర్యావరణానికి హాని తలపెడుతున్నారు. అదేంటి.. జీన్స్ ప్యాంట్ వేసుకుంటే పర్యావరణానికి హాని చేయడమేంటి అనుకుంటున్నారా..? అయితే ఇది చదువండి.

మీరు విన్నది నిజమే. జీన్స్‌ప్యాంట్లు పర్యావరణానికి ఎంతో హాని చేస్తున్నాయి. ఎలాగంటే.. ఒక్క జీన్ ప్యాంట్ తయారీకి ఎంత నీరు అవసరం అవుతుంది..? మహా అయితే వందలీటర్లని మీరనుకుంటారు. తాజా అధ్యయనాల ప్రకారం ఒక్క జీన్ ప్యాంట్ తయారీకి 11వేల లీటర్ల నీరు అవసరమవుతుందట. ఇక మీరే అర్థం చేసుకోవాలి ఇలా ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని జీన్స్‌ప్యాంట్లు.. కోట్ల కొద్ది లీటర్ల నీరు వృథా అవుతుందో.. మనం వాడుతున్న జీన్స్ ప్యాంట్లు పర్యావరణానికి ఎంత హానికరమో. అమెరికాలో ఒక్క డెనిమ్ జీన్‌ప్యాంట్ తయారీకి 50 డాలర్లు ఖర్చు అవుతాయి. అయినప్పటికీ తక్కువ ధరలకే విక్రయిస్తున్నారు. జీన్స్‌ను కృత్రిమ ఇంటీగోతో నిండిన ఇంధన వనరుల నుంచి తయారు చేస్తున్నారు. ఇలాంటి కృతిమ రంగులు పర్యావరణానికి ఎంతో హానికరం. ఈ రంగుల ఫ్యాక్టరీలు జలమార్గాలను కలుషితం చేస్తున్నాయి. ఇలాంటి జీన్స్‌ప్యాంట్లను ధరించడం వల్ల ఒక్కొక్క వ్యక్తి పర్యావరణానికి ఎంత హాని చేస్తున్నాడో అతనికి కూడా తెలియదు. అందుకే పర్యావరణ వేత్తలు జీన్స్‌ప్యాంట్ల వాడకాన్ని పూర్తిగా తగ్గించమని వేడుకుంటున్నారు. దీనిపై అన్ని విధాలుగా ప్రచారాలు చేస్తున్నారు.



- రోజూ నాలుగు తులసి ఆకులు తినడం వల్ల ఒంట్లోని వ్యర్థాలు తొలగిపోయి, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- గొంతు బొంగురుపోయినప్పుడు తులసి రసం, మిరియాల చూర్ణాన్ని రెండు చెంచాలు తింటే ఫలితం ఉంటుంది.
- తులసి రసం, బెల్లం కలిపి నీటిలో తాగితే రక్తశుద్ధి జరుగుతుంది.
- పరగడుపున తులసి రసం, తేనె, అల్లం రసం చెంచా చొప్పున కలిపి తీసుకుంటే జీర్ణకోశ సమస్యలుండవు.
- ఇంట్లో తులసి ఉంటే దాని ఘాటైన వాసనకు దోమలు దరిచేరవు.

తెల్లమచ్చలకు దివ్యౌషధం



చర్మం మీద పొడలా కనిపించగానే డాక్టర్ దగ్గరికి వెళ్తారు చాలామంది. అది విటమిన్ లోపం అంటూ మందులు ఇస్తారు డాక్టర్లు. కానీ కొద్దిరోజులు గడిచేసరికి తెల్లమచ్చలు స్పష్టంగా బయటపడుతాయి. ల్యూకోడెర్మా వచ్చిన వాళ్లలో చాలామందికి కలిగే అనుభవమే ఇది.
నిజానికి మన ఆరోగ్యాన్ని కాపాడుకునే విషయంలో మనం తీసుకుంటున్న జాగ్రత్తలు తక్కువే. అయినా చాలావరకు ఆరోగ్యంగానే ఉంటాం. మనలోని నిరోధక వ్యవస్థే ఇందుకు కారణం. ఒక్కోసారి ఈ నిరోధక వ్యవస్థే రోగగ్రస్థమవుతుంది. ఇలాంటప్పుడే శరీరం పలు రకాల వ్యాధులకు నిలయమవుతుంది. వాతపిత్తకఫాల్లో వచ్చే తేడాలే దీన్ని రోగగ్రస్థం చేస్తాయి. శరీరంలో పేరుకుపోయిన వ్యర్థ, విష పదార్థాలు ఈ తేడాలకు కారణం. వీటిని తొలగిస్తే గాని వ్యాధి నిరోధక వ్యవస్థ చక్కబడదు. అప్పుడే శరీరంలోని వ్యాధి నయం అవుతుంది. ఇలాంటి దానికి ఒక ఉదాహరణే తెల్ల మచ్చల సమస్య. ఇది పోవాలంటే కూడా మొత్తం శరీర వ్యవస్థనంతా చక్కదిద్దాలి. పై పూతలు, స్టెరాయిడ్స్ తాత్కాలికంగా మాత్రమే పనికొస్తాయి.

తెల్లమచ్చలకు మరిన్ని కారణాలు

తెల్లమచ్చలకు కారణాలు చాలా రకాలున్నాయి. వాటిలో ప్రధానంగా శరీరంలో వ్యర్థ విష పదార్థాలు పేరుకుపోవడం. ముఖ్యంగా విష పదార్థాలు రక్తంలోకి ప్రవేశించినప్పుడు రక్తంలోని హిమోగ్లోబిన్ పరిమాణం పడిపోతుంది. ఫలితంగా శరీరంలోని మెలనిన్ తగ్గిపోయి, చర్మం సహజ వర్ణాన్ని కోల్పోతుంది. తద్వారా తెల్లమచ్చలు ఏర్పడుతాయి. ఆహారంలో ఫెర్రస్, కాపర్ లోపించడం కూడా ఇందుకు కారణమే. శరీరంలో సహజంగానే హానికారకమైన ఫ్రీ రాడికల్స్ తిరుగుతుంటాయి. నానాటికీ ప్రకృతికి దూరమవుతున్న కారణంగా మానవ శరీరాల్లో విటమిన్ డి తగ్గిపోతున్నది. ఇందువల్ల కూడా శరీరానికి వర్ణాన్నిచ్చే మెలనోసైట్స్ తగ్గిపోయి, తెల్ల మచ్చలు ఏర్పడుతాయి.
తెల్లమచ్చల్ని నివారించే మూలికల ప్రస్తావన అనేక ఆయుర్వేద సంహితల్లో ఉంది. వాటన్నింటి కలయికలో తయారుచేసిందే ల్యూకోకిట్ ఔషధం. ఏ వ్యాధి అయినా దీర్ఘకాలికంగా కొనసాగుతున్నదంటే అప్పటిదాకా దానికి సరైన చికిత్సలు అందలేదని అర్థం. తాత్కాలిక ఉపశమనాన్ని ఇచ్చే చికిత్సలు అన్ని వైద్య విధానాల్లోనూ ఉంటాయి. కాని వ్యాధిని సమూలంగా తొలగించే శక్తి ఆయుర్వేదానికే ఉంది. ప్రత్యేకించి తెల్లమచ్చలకు శక్తిమంతమైన ఔషధాలున్నాయి. ఏ కారణంగా వచ్చే తెల్లమచ్చలైనా ల్యూకోకిట్‌తో మటుమాయమవుతాయి.
ల్యూకోకిట్‌లో మూడు రకాల టాబ్లెట్లు ఉంటాయి. వీటిని ఉదయం, సాయంత్రం భోజనం తర్వాత వేసుకోవాలి. వీటితో పాటు చర్మం మీద అప్లై చేసే కలర్ కాట్-ఎల్, కలర్ కాట్ -ఎల్ మిక్స్‌డ్ ద్రావణం కలయికలతో చర్మానికి రంగునిచ్చే ఔషధం తయారుచేస్తారు. ఈ ద్రావణాన్ని చర్మం రంగు కోల్పోయి మచ్చలు ఏర్పడిన చోట అప్లై చేసి, 10 నుంచి 15 నిమిషాల పాటు ఎండలో కూర్చోవాలి. రోజూ ఉదయం, సాయంత్రం ఈ మందును రాసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

డా. ఎన్. రామకృష్ణారెడ్డి
ఆర్‌కే ఆయుర్వేదిక్ అండ్ సొరియాసిస్ రీసెర్చ్ సెంటర్
హైదరాబాద్, హన్మకొండ
8886 922 245
8886 922 247



టీబీఎఫ్‌లో నూతనోత్సాహం!

తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ శుక్రవారం నగరంలో నిర్వహించిన మూడవ సర్వసభ్య సమావేశం ఉత్సాహంగా సాగింది. ఈ సంఘానికి చెందిన దాదాపు నాలుగు వందల మంది బిల్డర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం మంత్రి కేటీ రామారావు నగరాభివృద్ధిపై బిల్డర్లలో సరికొత్త భరోసా కల్పించారు. బిల్డర్లకు అందించే ప్రాజెక్టు ఫైనాన్స్ గురించి ఎల్ ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ప్రతినిధులు వివరించారు. గృహరుణాలను అందించే బ్యాంకులతో సమావేశం ఏర్పాటు చేసి.. ఒప్పంద పత్రం, గృహరుణం కంటే తక్కువగా సేల్‌డీడ్ ఉండటాన్ని ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం అనుమతించకూడదని టీబీఎఫ్ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కాశీ విశ్వేశ్వర్రావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ బి.జనార్ధన్‌రెడ్డి, న్యాక్ డీజీ బిక్షపతి, జీహెచ్‌ఎంసీ సీసీపీ దేవేందర్‌రెడ్డి,'టీబీఎఫ్' బిల్డర్లు తదితరులు పాల్గొన్నారు.

10 శాతం తనఖా తొలగించాలి..

కొత్త లేఅవుట్లు అయినా భవనాలైనా.. స్థానిక సంస్థలకు పది శాతం తనఖా పెట్టాలన్న నిబంధన ఉంది. ఇటీవల కేంద్రం తెచ్చిన 'రెరా' మన వద్ద అమల్లోకి వచ్చేసింది కాబట్టి.. ఈ పది శాతం తనఖా నిబంధనతో పెద్దగా అవసరం ఉండదు. అందుకే, ఇక నుంచి కొత్త ప్రాజెక్టులను ప్రారంభించేవారు పది శాతం తనఖా లేకుండా దరఖాస్తులను స్వీకరించేలా ప్రభుత్వం అనుమతించాలి. దీంతో, నిర్మాణాలను చేపట్టే వారికి కొంత వెసులుబాటు కలుగుతుంది. ఇప్పటి వరకూ ఈ పది శాతాన్ని చివర్లో విక్రయించాల్సి వచ్చేది. ఇక నుంచి, రెరా నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. గత నెల మొదటి తేదీ నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. ఇక, స్టాంప్ డ్యూటీ ద్వారా ఆదాయం తగ్గుముఖం పట్టే అవకాశమే లేదు. కాబట్టి, స్టాంపు డ్యూటీని రెండు శాతానికి తీసుకొస్తే ఉత్తమం. అప్పుడే, కొనుగోలుదారులకు కొంత ప్రయోజనం కలుగుతుంది.



– జక్కా వెంకట్‌రెడ్డి,
ప్రధాన కార్యదర్శి,
తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్

రెరా ఆఫీసు ఏర్పాటు చేయాలి!

తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ మూడవ వార్షిక సర్వసభ్య సమావేశానికి మంత్రి కేటీ రామారావు రావడం.. వారి ప్రసంగం విన్నాక మా అందరిలో నూతనోత్సాహం నెలకొంది. నగరాభివృద్ధిపై ప్రభుత్వానికి గల చిత్తశుద్ధి మంత్రి కేటీ రామారావు మాటల్లో కన్పించింది. రానున్న రోజుల్లో హైదరాబాద్ తప్పకుండా విశ్వనగరం స్థాయికి చేరుకుంటుందనే నమ్మకం మా అందరికీ కలిగింది. రాష్ట్రంలో రెరా నిబంధనలు నోటిఫై అయ్యాయి కాబట్టి.. కొత్త అపార్టుమెంట్లు, విల్లాలను ప్రారంభించడానికి అనేక నిర్మాణ సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. గత కొంతకాలం నుంచి రెరా కోసమే చాలా సంస్థలు వేచి చూస్తున్నాయి. ఇప్పుడీ నిబంధనలు ఖరారు కావడంతో.. ప్రభుత్వం ఏ మాత్రం ఆలస్యం చేయకుండా.. రాష్ట్రంలో రెరా ఆఫీసును ఏర్పాటు చేయాలి. ఇందులో ఒక ఇన్‌వార్డ్ కౌంటర్‌ని ఏర్పాటు చేసి కొత్త ప్రాజెక్టుల ఫైళ్లను దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పించాలి. వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటే మేలు.



– ప్రభాకర్‌రావు,
అధ్యక్షుడు,
తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్

నిబద్ధత ఉంటేనే నిజమైన బిల్డర్



- తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సమావేశంలో..
- పురపాలక శాఖ మంత్రి కేటీ రామారావు
- బిల్డర్లలో చిన్నా, పెద్ద అనే తేడా ఉండదు
- కొనుగోలుదారుల సంతృప్తియే కీలకం
- అతిత్వరలో ఏకగవాక్ష విధానం అమలు
- శివారు బిల్డర్లు స్వీయ నియంత్రణ పాటించాలి!

నిర్మాణ సంస్థలకిచ్చే అనుమతుల ప్రక్రియలో ఏకగవాక్ష విధానాన్ని అమలు చేస్తామని పురపాలక శాఖ మంత్రి కేటీ రామారావు వెల్లడించారు. శుక్రవారం నగరంలో 'తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్' మూడవ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, అగ్నిమాపక, పౌరవిమానయానం, పీసీబీ.. ఇలా నిర్మాణాలకు అనుమతుల్ని ఒకే చోట ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. మంత్రి కేటీ రామారావు ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

" నిర్మాణ రంగంలో చిన్న బిల్డర్లు, పెద్ద బిల్డర్లు అనే తేడా ఉండదు. నిబద్ధతతో పని చేస్తూ వినియోగదారుల అంచనాల మేరకు పని చేసే వారే సిసలైన బిల్డర్లు. అంతే తప్ప, కేవలం పెద్ద ప్రాజెక్టులను చేసిన వారే బిల్డర్లు కాదని గుర్తుంచుకోండి. గత ప్రభుత్వాల హయంలో నిర్మాణ రంగం స్థితిగతులు ఎలా ఉండేవి? ప్రస్తుతం ఎలా ఉన్నాయో మీ అందరికీ తెలిసిందే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినికీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏకకాలంలో పరిష్కరించారు. ఒకేసారి ఆరు జీవోలను విడుదల చేసిన ఘనత మన సీఎంకే దక్కుతుంది. వాస్తవిక కోణంలో ఆలోచించి.. ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు ఆయన పరిష్కారం చూపెట్టారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ వంటి స్థానిక సంస్థల అనుమతుల్లో వేగాన్ని పెంచేందుకు 'డీపీఎంస్' విధానానికి శ్రీకారం చుట్టాం. ఇప్పటికే అనుమతుల ప్రక్రియను సరళీకృతం చేశాం. రానున్న రోజుల్లో మరింత మార్పు మీ అందరికీ స్పష్టంగా కనబడుతుంది.

మూడు అంతర్జాతీయ ఈవెంట్లు..

హైదరాబాద్‌ని విశ్వనగరంగా అభివృద్ధి చేయడానికి సమగ్రమైన ప్రణాళికల్ని రూపొందించాం. ఇందుకు అనుగుణంగా నిర్ణయాల్ని తీసుకుంటూ.. పకడ్బందీగా అమలయ్యేందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేశాం. ఈ క్రమంలో రానున్న రోజుల్లో మూడు అంతర్జాతీయ వేదికలకు హైదరాబాద్ అతిథ్యమిస్తోంది. నవంబర్ చివర్లో గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ప్రప్రథమంగా భాగ్యనగరానికి విచ్చేస్తున్నారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్, వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లు వంటివి ఇక్కడే జరగనున్నాయి. వరల్డ్ ఐటీ కాంగ్రెస్ నాలుగు దేశాల అధినేతలు హాజరయ్యే అవకాశముంది. ఈ ఈవెంట్ల కారణంగా నగరాన్ని మరింత సుందరీకరణ చేయడానికి వీలు కలుగుతుంది. మొత్తానికి, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందే దిశగా హైదరాబాద్ పరుగులు పెడుతున్నది. ప్రధానమంత్రి మోడీ నవంబర్‌లో నగరానికొచ్చే తేదీ ఖరారు కాగానే.. మెట్రో రైలు ప్రారంభం అవుతుంది. నవంబర్ చివర్లో నాగోలు నుంచి మియాపూర్ దాకా దాదాపు 29 కిలోమీటర్ల మేరకు ఈ మార్గం ఉంటుంది. వచ్చే ఏడాదికల్లా భాగ్యనగరంలో పూర్తిస్థాయి మెట్రో అందుబాటులోకి వచ్చేస్తుంది. మొత్తానికి, రానున్న రోజుల్లో నిర్మాణ రంగానికి సరికొత్త ఊతం లభిస్తుందని చెప్పొచ్చు.

నిబంధనల్ని అతిక్రమిస్తే అంతే!

శివారు ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టే బిల్డర్లకు నాదో విజ్ఞప్తి. నిజాంపేట్, ప్రగతినగర్, మణికొండ, పాప్పాల్‌గూడ, పీర్జాదిగూడ వంటి గ్రామ పంచాయతీల్లో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధులు అండ కావొచ్చు అధికారుల ప్రోత్సహం అవ్వొచ్చు. అక్కడ అపార్టుమెంట్లను చూస్తే సెట్‌బ్యాకులుండవు. డ్రైనేజీల్లేవు, పార్కింగ్ సౌకర్యం లేదు. నిజాంపేట్‌లోని బండారి లేఅవుట్‌లో అయితే మరీ అరాచకంగా కట్టారు. ఇలాంటి అస్తవ్యస్తమైన అభివృద్ధి మనకొద్దు. రేపు ఈ పంచాయతీలను జీహెచ్‌ఎంసీలో కలిపే అవకాశాల్లేకపోలేవు. కాబట్టి, బిల్డర్లు దురాశకు పోకుండా సెట్‌బ్యాకుల్లేకుండా అపార్టుమెంట్లను కట్టొద్దు. శివారు ప్రాంతాల్లో బిల్డింగులను కట్టడానికి ఏమైనా ఇబ్బందులుంటే.. మినహాయింపులేమైనా కావాలంటే అడగండి. కలిసికట్టుగా ఆలోచిద్దాం. కాకపోతే, నిర్మాణ నిబంధనల్ని మాత్రం కచ్చితంగా పాటించాల్సిందే. హైదరాబాద్‌ని విశ్వనగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా మనమంతా కొన్ని కఠినమైన నిబంధనల్ని పాటించక తప్పదు. ఎందుకంటే, భాగ్యనగరంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనుల్ని చేసుకుంటూ ముందుకెళుతున్నాం. కాబట్టి, ఇక నుంచి శివారు ప్రాంతాల్లో నిర్మాణాల్ని చేపట్టే బిల్డర్లు తప్పకుండా స్వీయ నియంత్రణను పాటించాలి. హైదరాబాద్ పురోగతిలో నిర్మాణ సంస్థలు భాగస్వామ్యులు కావాలి. ఇప్పుడు చెప్పినా వినకుండా.. రేపొద్దున నోటీసులిచ్చి భారీ జరిమానాలను విధిస్తే మాత్రం.. ఎట్టి పరిస్థితిలో మమ్మల్ని నిందించవద్దు''.



జై జై 'జయ జానకి నాయక'

మానవ భావోద్వేగాల్ని యాక్షన్ అంశాల మేళ వింపుతో వెండితెరపై అర్థవంతంగా ఆవిష్కరించడంలో సిద్ధహస్తుడు దర్శకుడు బోయపాటి శ్రీను. ఆయన చిత్రాలకు తెలుగుప్రేక్షకుల్లో ఓ బ్రాండ్ ఇమేజ్ వుందనడంలో ఎటువంటి సందేహం లేదు. 'భద్ర' మొదలుకొని 'సరైనోడు' వరకు ఆయన సినీ ప్రయాణంలో చిరస్మరణీయమైన విజయాలున్నాయి. పలు చిత్రాలు రికార్డ్ కలెక్షన్లతో బాక్సాఫీస్ వద్ద సంచలనాల్ని సృష్టించాయి. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'జయ జానకి నాయక'. సుదీర్ఘ విరామం తర్వాత బోయపాటి పూర్తిస్థాయి ప్రేమకథా చిత్రంతో ప్రేక్షకుల ముందుకురావడం ఈ సినిమా ప్రత్యేకతగా చెప్పవచ్చు. 'అల్లుడు శీను' 'స్పీడున్నోడు' చిత్రాల ద్వారా యువహీరోగా తనదైన ముద్రవేసిన బెల్లంకొండ సాయిశ్రీనివాస్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటించారు. నిర్మాణం నుంచే ఈ సినిమా తెలుగు ప్రేక్షకుల్లో ఎంతో ఆసక్తినిరేకెత్తించింది. ముఖ్యంగా టైటిల్ ఓ పవిత్రమైన భావనతో ప్రేక్షకుల్లో పాజిటివ్ ఫీలింగ్‌ను కలిగించింది. దీంతో ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఆతృతగా ఎదురుచూశారు. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల్ని ఏ మేరకు అలరిస్తున్నదో చూద్దాం..

జానకి హృదయాన్ని గెలిచిన అభినవ రాముడి కథ

ప్రాణప్రదంగా ప్రేమించిన అమ్మాయి శ్రేయస్సు కోసం అభినవ రాముడివంటి ఓ యువకుడు సాగించిన అసమాన పోరాటమేమిటన్నదే చిత్ర ఇతివృత్తం. చిత్ర కథలోకి వెళితే...తన కుటుంబమే సర్వస్వంగా జీవితాన్ని సాగిస్తుంటాడు గగన్ (బెల్లంకొండ శ్రీనివాస్). నాన్న చక్రవర్తి (శరత్‌కుమార్), అన్నయ్య (నందు) అంటే అతనికి పంచప్రాణాలు. గగన్‌కు అనుకోకుండా స్వీటీ (రకుల్‌ప్రీత్‌సింగ్)తో పరిచయమవుతుంది. కుటుంబ బంధాలకు ఎంతగానో విలువిచ్చే స్వీటీని ప్రేమిస్తాడు గగన్. ఇంతలో ఒక రోడ్డు కాంట్రాక్ట్ విషయంలో లిక్కర్‌కింగ్ అరుణ్ పవార్ (తరుణ్ అరోరా)తో స్వీటీ తండ్రి జయ ప్రకాష్‌కు వైరం ఏర్పడుతుంది. దీనివల్ల స్వీటీ జీవితంలో అనూహ్య సంఘటనలు ఎదురవుతాయి. హాయిగా సాగిపోతున్న ఆమె జీవితం సంక్షుభిత పరిస్థితుల మధ్య చిక్కుకుపోతుంది. అసలు స్వీటీ కష్టాలకు కారణం ఎవరు? అశ్విత్ నారాయణ (జగపతిబాబు), అరుణ్‌పవార్ మధ్య ఏర్పడిన శత్రుత్వం జానకి జీవితంలో కల్లోలానికి ఎందుకు కారణమయింది? స్వీటీని రక్షించడానికి గగన్ చేసిన ధీరోదాత్తమైన పోరాటమేమిటనే ఆసక్తికరమైన అంశాల చుట్టు మిగతా చిత్ర కథ నడుస్తుంది.

యాక్షన్ హంగుల హృద్యమైన ప్రేమకథ...

ఎలాంటి కథాంశాన్ని ఎంచుకున్నా దానికి పతాకస్థాయి యాక్షన్ అంశాల్ని మేళవించి ప్రేక్షక జనరంజకంగా తీర్చిదిద్దుతారు దర్శకుడు బోయపాటి శ్రీను. ఈ మార్క్ ఆయన ప్రతి సినిమాలో స్పష్టంగా కనిపిస్తుంది. కుటుంబ అనుబంధాలు, ప్రేమ, సెంటిమెంట్‌కు పెద్దపీట వేస్తూ ఉద్వేగభరిత సన్నివేశాలతో బోయపాటి 'జయ జానకి నాయక' చిత్రాన్ని ఆద్యంతం రక్తి కట్టించారు. సినిమా నేపథ్యానికి చక్కటి లవ్‌స్టోరీని ఎంచుకోవడం కొత్తగా అనిపిస్తుంది. చిత్రం ఆరంభం నుంచి ఎమోషనల్‌గా సాగుతుంది. నాయకానాయిక మధ్య పరిచయం ప్రేమకు దారితీసే సన్నివే

సమీక్ష

శాల్ని మనసుకు హత్తుకునేలా ఆవిష్కరించారు. సందర్భానుసారంగా రొమాంచితమైన యాక్షన్ ఘట్టాలతో మాస్ ప్రేక్షకుల్ని మెప్పించారు. తన జీవితానికి ఏమాత్రం సంబంధం లేని వ్యక్తుల వల్ల ఓ అమ్మాయి ఎంతటి కష్టాలను అనుభవించింది? ఆమెను వాటి చెర నుంచి విడిపించడానికి పవిత్ర ప్రేమికుడైన యువకుడు ఎలాంటి ప్రయత్నాలు చేశాడు? అనే విషయాన్ని హృదయానికి హత్తుకునే రీతిలో తెరకెక్కించారు. నాయకానాయికల మధ్య రొమాన్స్ కంటే వారిద్దరి కుటుంబాల అనుబంధానికి ఎక్కువగా ప్రాధాన్యతనిస్తూ కథను నడిపించిన విధానం ఆకట్టుకుంటుంది. 'ప్రేమించిన అమ్మాయి కళ్లలో కన్నీళ్లు రాకుండా చూసుకో..ఎప్పటికీ ఆమెకు రక్షణలా నిలబడు' అని తండ్రి చెప్పిన మాటకోసం నిలబడే యువకుడిగా సాయిశ్రీనివాస్ భావోద్వేగభరిత పాత్రలో చక్కటి నటనను కనబరిచాడు. సీనియర్ నటీనటులు శరత్‌కుమార్, జగపతిబాబు, సితారలు సినిమాకు మూలస్తంభాలుగా నిలిచారు. 'లెజెండ్' చిత్రం ద్వారా జగపతిబాబును ప్రతినాయకుడిగా పరిచయం చేశారు దర్శకుడు బోయపాటి శ్రీను. తాజాగా ఈ సినిమాలో పరువు-ప్రతిష్ట కోసం ఎంతకైనా తెగించే తండ్రిగా జగపతిబాబులోని సరికొత్త విలనిజాన్ని ఆవిష్కరించారు. ఇక సినిమాలోని పోరాట ఘట్టాలు రొమాంచితంగా సాగుతూ థ్రిల్‌కి గురి చేస్తాయి. ముఖ్యంగా హంసలదీవిలో తీసిన పోరాటఘట్టం, క్లైమాక్స్ ఎపిసోడ్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. 'లైఫ్‌లో కష్టం వచ్చిన



నిర్మాత రవీందర్‌రెడ్డితో బోయపాటి

ప్రతిసారి లైఫ్‌ను వదలం కానీ ప్రేమను వదిలేస్తాం. నేను మాత్రం ప్రేమను వదలను. ఎందుకంటే నేను ప్రేమించాను'... అనే డైలాగ్ సినిమా అత్మను ప్రతిబింబిస్తుంది. ఇక స్త్రీల ఔన్నత్యం గురించి శరత్‌కుమార్ చెప్పే సంభాషణలు ప్రతి ఒక్కరిలో ఆలోచనను రేకెత్తిస్తాయి. 'బార్‌లో డిస్కౌంట్ వుంటుంది కానీ..వార్‌లో డిస్కౌంట్ వుండదు..' వంటి సంభాషణలు మాస్‌ను ఉర్రూతలూగిస్తాయి.

ఆర్టిస్టుల పెర్‌ఫార్మెన్స్ ఎలా వుందంటే...

బెల్లంకొండ శ్రీనివాస్‌కు ఇది మూడో చిత్రమైనా చక్కటి ఈజ్‌తో నటనను కనబరిచాడు. ప్రేయసిని రక్షించుకోవడమే ధ్యేయంగా సాగే యువకుడిగా సీరియస్ పాత్రలో మెప్పించారు. పోరాటఘట్టాలు, నృత్యాల్లో సాయిశ్రీనివాస్ తనదైన ప్రత్యేకతను చాటుకున్నాడు. పతాకఘట్టాల్లో ఎమోషనల్ డైలాగ్స్‌ను బాగా చెప్పాడు. గత రెండు చిత్రాలతో పోల్చితే ఇందులో ఆయన నటనలో గొప్ప పరిణితి కనిపిస్తుంది. ఇక స్వీటీ పాత్రలో రకుల్‌ప్రీత్‌సింగ్ అద్భుతంగా ఒదిగిపోయింది. ఆద్యంతం సంఘర్షణాత్మకంగా సాగే పాత్రలో అందరి మనసుల్ని ఆకట్టుకుంది. రెండు భిన్న కోణాల్లో ఆమె పాత్ర చిత్రణ సాగింది. జగపతిబాబు, శరత్‌కుమార్ తమదైన నటనతో మెప్పించారు. వాణీవిశ్వనాథ్ చిన్న పాత్రలో కనిపించినా ఫర్వాలేదనిపించింది. నందు ప్రాధాన్యత వున్న పాత్రలో ఆకట్టుకున్నాడు. ఇక దేవీశ్రీ ప్రసాద్ సంగీతం వీనులవిందుగా సాగింది. 'వీడే వీడే...' 'నువ్వేలే నువ్వేలే' పాటలతో పాటు మిగిలిన గీతాలన్ని అలరిస్తాయి. నేపథ్యసంగీతం సన్నివేశాల్ని మరింతగా ఎలివేట్ చేసింది. కెమెరామెన్ రిషీపంజాబీ పనితనం కన్నులపండువగా అనిపిస్తుంది. కేథరిన్ ఐటెంసాంగ్‌తో అదరగొట్టింది. ప్రగ్యాజైస్వాల్ గ్లామర్‌తో ఆకట్టుకుంది. కథలోని మలుపుల్ని బోయపాటి శ్రీను తనదైన స్క్రీన్‌ప్లే చాతుర్యంతో రివీల్ చేయడం ప్రేక్షకులకు థ్రిల్‌ని కలిగిస్తుంది.

అత్యుత్తమ నిర్మాణ విలువలతో....

సినిమా అడుగడుగునా భారీతనం ఉట్టిపడుతుంది. బీచ్‌సాంగ్ కోసం వైజాగ్‌లో వేసిన సెట్ నిర్మాణ విలువలకు అద్దం పట్టింది. పోరాట ఘట్టాల్ని తీర్చిదిద్దిన విధానం హాలీవుడ్ యాక్షన్ సినిమాల్ని తలపిస్తుంది. ప్రతి ఫ్రేమ్ నయనానందకరంగా ప్రేక్షకులకు హాయిగొలుపుతుంది. మేకింగ్‌పరంగా నిర్మాత రవీందర్‌రెడ్డి అత్యుత్తమ ప్రమాణాల్ని పాటించారు. జానకిని కష్టాల కడలి నుంచి బయటకు తీసుకొచ్చే నేటి రాముడి ప్రణయగాథగా 'జయ జానకి నాయక' చిత్రం అన్ని వర్గాల ఆదరణ పొందుతుందనే విషయంలో ఎటువంటి సందేహం లేదు.

మీజిల్స్-రూబెల్లా నివారణే లక్ష్యం

- 17నుంచి సెప్టెంబర్ 25 వరకు వ్యాక్సినేషన్
- ప్రచార పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 2020 కల్లా మీజిల్స్-రూబెల్లా వ్యాధి నివారణే లక్ష్యంగా వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 9 నెలల నుంచి 15ఏండ్లలోపు పిల్లలు 90 లక్షల మంది ఉన్నట్టు గుర్తించామని, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 25 వరకు అందరికీ టీకాలు వేస్తామన్నారు. శుక్రవారం మీజిల్స్-రూబెల్లా టీకాల అవగాహన, ప్రచార పోస్టర్‌ను ఆయన హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బడిబయట పిల్లలకూ వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. వ్యాధులపై అవగాహన, చైతన్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. గతంలో టీకాలు వేయించుకున్నా, ఈసారి అదనపు డోసు వేయించుకోవాలని, టీకాలు వేస్తే వచ్చేది సాధారణ జ్వరమే తప్ప ఇతర సమస్యలేవీ ఉండవని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 68శాతం మందికి టీకాలు వేయగా, ప్రస్తుతం 90శాతం మందికి వేస్తున్నామన్నారు. ఈ విషయంలో ప్రధానమంత్రి సైతం అభినందించారని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్‌తివారీ, కుటుంబసంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి సీతాపతి, యూనిసెఫ్ ప్రతినిధి సంజీవ్ ఉపాధ్యాయ, వైద్య నిపుణులు రంగనాథ్, శ్రీనివాసరావు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం హైదరాబాద్‌లో మీజిల్స్-రూబెల్లా టీకాల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి తదితరులు

పెండింగ్‌లో 350 జూనియర్ కాలేజీల అఫిలియేషన్లు

- లోపాల సవరణకు 21వరకు అవకాశం
- శ్రీచైతన్య, నారాయణ కాలేజీల నుంచి రూ.2.17 కోట్ల జరిమానా వసూలు
- ఇంటర్మీడియట్ విద్యాధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం కడియం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పలు రకాల డాక్యుమెంట్లు లేని దాదాపు 350 ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన అఫిలియేషన్లు పెండింగ్‌లో పెట్టామని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. ఇప్పటివరకు 1,250 జూనియర్ కాలేజీలకు అఫిలియేషన్లు ఇచ్చామని చెప్పారు. విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ ఏ అశోక్, ఇతర ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం కడియం శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కడియం మీడియాతో మాట్లాడుతూ చిన్నచిన్న లోపాలను సరిదిద్దుకోవడానికి ఈనెల 21 వరకు అవకాశం ఇచ్చామని, తర్వాత ప్రైవేటు జూనియర్ కాలేజీలకు అఫిలియేషన్లు నిలిపివేస్తామన్నారు. ఇప్పటికే అన్నిరకాల సేవలను ఆన్‌లైన్ చేశామని, 2017-18 విద్యాసంవత్సరంలో అఫిలియేషన్ పొందిన ప్రైవేటు జూనియర్ కాలేజీల వివరాలు, కోర్సులు, సెక్షన్ల వివరాలను ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, ప్రజలకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఇప్పటికే అన్ని కళాశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందారని, ఈ నెల 21 నాటికి ఇంటర్ బోర్డు అఫిలియేషన్లు పొందని జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులను అవసరమైతే ఇతర కళాశాలల నుంచి పరీక్షలకు హాజరుపరిచేలా చర్యలను తీసుకుంటామని కడియం వివరించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న శ్రీచైతన్య, నారాయణ జూనియర్ కాలేజీల నుంచి రూ.2.17 కోట్ల జరిమానాలను ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా వసూలు చేశామని, ఈమేరకు ఇంటర్మీడియట్ విద్యామండలి చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఆదరణ పెరుగుతున్నదని, 30 శాతం ప్రవేశాలు పెరిగాయని డిప్యూటీ సీఎం కడియం తెలిపారు. జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు ఈ ఏడాది 1.90 లక్షలకు చేరుకున్నాయని చెప్పారు. రూ.310 కోట్లతో 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను అభివృద్ధిపర్చడం, ఉచిత ప్రవేశాలు, పాఠ్యపుస్తకాలను అందించడంతోపాటు పక్కా భవనాలు, ఆర్వోప్లాంట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేస్తామన్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుకు ప్రయత్నాలు చేస్తున్నామని కడియం పేర్కొన్నారు.



ఎస్సీ, ఎస్టీల ప్రగతికి ప్రత్యేక చట్టం

- దేశంలోనే తెలంగాణ ముందడుగు
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రామలక్ష్మణ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని దళిత, గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడం హర్షణీయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రామలక్ష్మణ్ పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారి తెలంగాణలో ఈ చట్టాన్ని తీసుకురావడంతో ముందడుగు వేసినట్టు అయిందన్నారు. శుక్రవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో రామలక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతి పద్దు నిర్వహణలో భాగంగా ఎస్సీ ఎస్టీ జనాభా దామాషా ప్రకారం ప్రత్యేక అభివృద్ధి నిధులను ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. సామాజిక సాధికారత కోసం 2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రణాళికతో ఆర్థిక, విద్య, మానవాభివృద్ధిపై దృష్టిపెట్టినట్టు తెలిపారు. ఈ ఏడాది ఎస్సీలకు రూ.14,375.12 కోట్లు, ఎస్టీలకు రూ.8,165.87 కోట్లు కేటాయించామని, ఎస్సీ, ఎస్టీలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించేందుకు ఈ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయాలని, ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీ అభివృద్ధి శాఖ డైరెక్టర్ పీ కరుణాకర్, ఎస్టీ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్ లక్ష్మణ్, ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి ఆర్ ప్రవీణ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

వాటాల ప్రకారం వేతనాలు చెల్లించాల్సిందే

- సహ కమిషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలపై హైకోర్టు ఆదేశం
- ఏపీ సర్కార్ వ్యవహారాన్ని తప్పుపట్టిన ధర్మాసనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమాచారహక్కు చట్టం కమిషన్‌లోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇరు రాష్ట్రాలు 42 : 58 నిష్పత్తిలో వేతనాలు చెల్లించాలని ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. తమ రాష్ట్రానికి కమిషన్‌ను ఇంకా ఏర్పాటు చేయలేదనే కారణంతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవల్ని నిలిపేస్తున్నట్లు ఏపీ రాష్ట్ర సర్కార్ పేర్కొనడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. సహ కమిషన్‌ను ఏర్పాటు చేయలేదనే కారణంతో వేతనాలు చెల్లించడానికి నిరాకరించడం తగదని ఏపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి పేర్కొంది. ఈ నెల 16 నుంచి ఉద్యోగుల సేవల్ని యథాతథంగా కొనసాగించాల్సిందేనని స్పష్టం చేసింది. ఆరువారాల్లోగా సహ కమిషన్‌కు ప్రధాన కమిషనర్, ఇతర కమిషనర్లను నియమించాలని ఈ నెల 8వ తేదీన జారీచేసిన ఉత్తర్వులను ధర్మాసనం ప్రస్తావించింది. సహ కమిషన్‌లో తమ సేవల్ని యథాతథంగా కొనసాగించేలా ఆదేశాలు జారీచేయాలంటూ ప్రస్తుతం కమిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తెలంగాణ ఏజీ డీ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని, నిష్పత్తి ప్రకారం వేతనాలు చెల్లించే విషయంలో ఏపీ సర్కార్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని నివేదించారు. ఏపీ సర్కార్ తరపు న్యాయవాది వాదనలు చేస్తూ ప్రస్తుతం తమ రాష్ట్రానికి సహ కమిషన్ ఏర్పాటు చేయనందున, ఉద్యోగుల వేతనాలు చెల్లించలేమని తెలిపారు. ఈ వాదనలను హైకోర్టు తోసిపుచ్చింది.

తెలంగాణ హైకోర్టుఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి హైకోర్టులో విధులు నిర్వహిస్తున్న రాష్ట్ర ఉద్యోగుల ఆధ్వర్యంలో తెలంగాణ హైకోర్టు ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ శుక్రవారం ఏర్పడింది. సొసైటీకి అడ్‌హక్ కమిటీ కూడా ఏర్పాటుచేశారు. అధ్యక్షుడిగా డీ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జీ ప్రసాద్, కార్యదర్శిగా ఈ నిషాంత్‌రెడ్డి, కోశాధికారిగా జీ వెంకటేశ్, సభ్యురాలిగా వీ రేణుకను నియమిస్తూ జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు.

జగన్ అక్రమాస్తుల కేసులో విశ్రాంత ఐఏఎస్‌కు ఊరట

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జగన్ అక్రమాస్తుల కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్యాంబాబుకు హైకోర్టులో ఊరట లభించింది. జగన్ కేసుల్లో శ్యాంబాబుపై సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్లను హైకోర్టు కొట్టేసింది. శ్యాంబాబు ఉద్యోగంలో ఉన్న సమయంలో ఆయనను విచారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరాకరించాయని న్యాయస్థానం గుర్తుచేసింది. అనంతపురం వద్ద లేపాక్షి నాలెడ్జి హబ్‌కు భూముల కేటాయింపు వ్యవహారంలో శ్యాంబాబుపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది.

అగ్నిమాపకశాఖ అవగాహన సదస్సులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రమాదాల నివారణపై రాష్ట్రవ్యాప్తంగా 97 ప్రాంతాల్లో అగ్నిమాపకశాఖ శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించింది. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్ నిర్వహించినట్టు ఆ శాఖ ప్రాంతీయ అధికారి పాపయ్య తెలిపారు.

మహిళా వ్యాపారవేత్తలకు బంగారు భవిష్యత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళా వ్యాపారవేత్తలకు బంగారు భవిష్యత్తు ఉండనుందని సీఐఐ ఇండియన్ వుమెన్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు వనితా దాట్ల అన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు మహిళలు సిద్ధంగా ఉండాలని సూచించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో శుక్రవారం సీఐఐ ఇండియన్ వుమెన్ నెట్‌వర్క్ ఆఫ్ తెలంగాణ నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. కార్యక్రమంలో వర్సిటీ ఆఫ్ హైదరాబాద్ డీన్ వెంకటరమణ, పలు రంగాలకు చెందిన మహిళా వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

జీడీపీపై జీఎస్టీ ప్రభావం ఉండదు

రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రంగరాజన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వస్తుసేవల పన్ను(జీఎస్టీ) వల్ల జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ)పై పెద్దగా ప్రభావమేమీ ఉండదని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రంగరాజన్ తెలిపారు. జీఎస్టీ అమలులో మొదట్లో కొన్ని ఇబ్బందులెదురైనా తర్వాత పరిస్థితి సర్దుకుంటుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు జీఎస్టీ అమలు సాఫీగానే జరుగుతున్నదన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఏ చట్టమైనా కొత్తగా అమలులోకి వచ్చిన సమయంలో కొంత అయోమయ వాతావరణం ఉంటుందని అన్నారు. విలువ ఆధారిత పన్ను (వ్యాట్) నుంచి జీఎస్టీ అమలులోకి వచ్చిందని ఆ మార్పు క్రమంలో కొంతమేరకే ప్రతికూలత ఉండవచ్చునని, జీఎస్టీతో జాతీయ స్థూల ఉత్పత్తి తగ్గదని చెప్పారు. దేశంలో బ్యాంకులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని, నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లను చాలా బలహీనంగా మారుస్తున్నాయని రంగరాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ రంగాలలో కొత్త ప్రాజెక్టుల సంఖ్య బాగా తగ్గిపోతున్నదని అన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు 2009-10వ సంవత్సరంలో రూ. 5.6 లక్షల కోట్లుగా ఉండగా అది 2015-16 నాటికి రూ.95 కోట్లకు తగ్గిందని వివరించారు. దేశంలో ప్రస్తుతం 1600 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం 2030 నాటికి 8వేల డాలర్లకు పెరగాల్సిన అవసరముందని అన్నారు.

తదుపరి ఉత్తర్వులకు లోబడే ప్రవేశాలు

సూపర్ స్పెషాలిటీ కోర్సుల అంశంపై హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళోజీ నారాయణరావు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీల పరిధిలోని సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశాలు తాము వెలువరించే తదుపరి తీర్పునకు లోబడి ఉంటాయని ఉమ్మడి హైకోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయస్థాయి కౌన్సెలింగ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఉమ్మడి హైకోర్టు పై విధంగా పేర్కొంది. ఈ వ్యవహారంలో ప్రతివాదుల తరపున వాదనలు వినేందుకు విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది. జాతీయస్థాయి కౌన్సెలింగ్ ద్వారా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అభ్యర్థులకు అన్యాయం జరుగుతున్నదంటూ పీజీ వైద్య విద్యార్థి సతీశ్‌కుమార్ పిటిషన్ దాఖలు చేశారు.

రిజిస్ట్రేషన్లతోపాటు మ్యుటేషన్లు

వచ్చే జనవరి 1 నుంచి అమలు • 72 గంటల్లో పత్రాలు అందిస్తాం

డిప్యూటీ సీఎం మహమూద్ అలీ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలోని భూముల రిజిస్ట్రేషన్లతోపాటే మ్యుటేషన్లు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూశాఖల మంత్రి మహమూద్ అలీ తెలిపారు. 72 గంటల్లో భూమి రిజిస్ట్రేషన్‌తోపాటు మ్యుటేషన్లు అందించే తొలి రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధించనున్నదని ఆయన తెలిపారు. హజ్‌హౌస్‌లో శుక్రవారం మహమూద్ అలీ మీడియాతో మాట్లాడుతూ.. 1957 తర్వాత రాష్ట్రంలో రెవెన్యూ సర్వే జరుగలేదని, 60 ఏండ్లుగా జరుగని సర్వేను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేయిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ, వక్ఫ్ భూముల కబ్జాలను తొలిగించడంతోపాటు సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వ భూములను ఉపయోగించేందుకు సర్వే ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ అధికారులు తక్కువగా ఉండటంతో మూడు గ్రామాలకు ఒక అధికారితో సర్వే జరిపిస్తామని తెలిపారు. ఒక్కో అధికారి మూడు గ్రామాలకు చెందిన భూములను సర్వే చేసి, ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని గడువు విధించినట్లు తెలిపారు. సర్వే పూర్తయిన వెంటనే జనవరి నుంచి రిజిస్ట్రేషన్లతోపాటు మ్యుటేషన్లు పూర్తిచేసి పత్రాలు అందజేస్తామన్నారు.

వక్ఫ్ భూముల పరిరక్షణపై సీఎం దృష్టి

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ విషయంలో సీఎం కేసీఆర్ చాలా కచ్చితమైన వైఖరితో ఉన్నారని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ చెప్పారు. ఎక్కడ వక్ఫ్‌భూములు కబ్జాకు గురైనా సహించేది లేదని ఇప్పటికే పలు సందర్భాల్లో సీఎం కేసీఆర్ స్పష్టం చేసినట్లు తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో రూ.కోట్ల విలువ చేసే వక్ఫ్ భూములు, ఆస్తులు వివాదాలు, కబ్జాల్లో ఉన్నాయని చెప్పారు. వీటి వివాదాలు పరిష్కరించేందుకు రెండు జిల్లాల రెవెన్యూ ఉన్నతాధికారులు, వక్ఫ్‌బోర్డు అధికారులతో సమావేశం కానున్నట్లు మహమూద్ అలీ చెప్పారు. ఎక్కడ వక్ఫ్ భూములు వివాదాలు, కబ్జాల్లో ఉన్నాయో, వాటి పూర్తి వివరాలతో ఈ సమావేశానికి రావాలని బోర్డు అధికారులను ఆదేశించారు.

యాత్రికుల భద్రతకు ఢోకా లేదు



హజ్ యాత్ర బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ తదితరులు

తెలంగాణ హజ్ కోటా వెయ్యి పెరిగింది

డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ

16న శిబిరాన్ని సందర్శించనున్న సీఎం?

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హజ్ యాత్రికులకోసం హజ్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ అన్నారు. ఇతర రాష్ట్రాల్లో హజ్‌శిబిరాల్లో జరుగుతున్న ఘటనల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని, భద్రత విషయంలో ఢోకాలేదని ఆయన స్పష్టం చేశారు. మరో రెండురోజుల్లో యాత్ర ప్రారంభవుతున్న నేపథ్యంలో హజ్ శిబిరంలో చేసిన ఏర్పాట్లను శుక్రవారం మైనారిటీ సంక్షేమ శాఖ, హజ్ కమిటీ, వక్ఫ్‌బోర్డు అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం పరిశీలించారు. శిబిరంలో యాత్రికుల కోసం చేసిన ఏర్పాట్లను వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్, తెలంగాణ హజ్ కమిటీ స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్‌ఏ షుకూర్ తదితరులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా హజ్ కమిటీ రూపొందించిన 'హజ్‌గైడ్'ను డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. ఈ ఏడాది మన రాష్ట్రం నుంచి 3700 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 2700 మంది, కర్ణాటకలోని బీదర్, గుల్బర్గా, యాద్‌గిర్, రాయిచూర్ జిల్లాల నుంచి 750 మంది యాత్రికులు తెలంగాణ హజ్ కమిటీ పర్యవేక్షణలో యాత్రకు వెళ్తున్నారని ఆయన తెలిపారు. ఆదివారం రాత్రి 10 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని, తాను, మరికొందరు మంత్రి వర్గ సహచరులు కలిసి జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తామని మహమూద్‌అలీ తెలిపారు. 16న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హజ్ శిబిరాన్ని సందర్శించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హజ్ కమిటీకి ప్రభుత్వం కేవలం రూ.1.50 కోట్ల నిధులు మాత్రమే కేటాయించేదని, కానీ ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఆ నిధులను రూ.మూడు కోట్లకు పెంచిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు ఈ ఏడాది రాష్ట్ర యాత్రికుల కోటా వెయ్యికి పెరిగిందన్నారు.

పనులను వేగవంతం చేయండి

- వివిధ విభాగాలతో సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: కొత్తగా సాధించుకున్న నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) పనుల్లో వేగం పెంచాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. పనులు నత్తనడకన సాగుతుండటంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు స్వచ్ఛందంగా తప్పుకోవాలని, బాధ్యతారాహిత్యంపై కఠినచర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఎన్‌హెచ్‌ఏఐ, సింగరేణి, రాష్ట్ర ఎన్‌హెచ్ విభాగం, వివిధ కన్సల్టెంట్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఇప్పటివరకు సాధించిన జాతీయ రహదార్లకు డీపీఆర్ల తయారీలో జాప్యంపై మండిపడ్డారు. గత ఏడాది కేంద్రం అనుమతించి, జాతీయ రోడ్డు అభివృద్ధి సంస్థకు బదిలీ చేసిన ఐదు రాష్ట్ర రహదారుల పనుల జాప్యం మీద అసహనం వ్యక్తంచేశారు. 15 రోజుల్లో భూసేకరణకు ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆరునెలలుగా కన్సల్టెంట్ల పనితీరులో పురోగతి లేదని, కొన్నిచోట్ల ఇంకా బైపాస్‌లను ఖరారు చేయలేకపోయారని తుమ్మల అసంతృప్తి వ్యక్తంచేశారు. భూసేకరణ భారం తగ్గించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ.. ఎలైన్‌మెంట్లను రూపొందించిందని, వాటిని అన్ని జిల్లాల కలెక్టర్లకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఎలైన్‌మెంట్లలో ఉన్న అన్ని పట్టణాలకు బైపాస్‌ల ఏర్పాటుకు ఎన్‌హెచ్‌ఏఐ సుముఖంగా లేదని చెప్పారు. ప్రజా అవసరాల కోసం ఖమ్మం-సూర్యాపేట, ఖమ్మం- అశ్వారావుపేట వంటి రహదారుల ఎలైన్‌మెంట్లను రూపొందించి వీలైనచోట్ల బైపాస్‌లు ఏర్పాటుచేయాలని తమ్ముల ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

నాణ్యమైన విత్తనోత్పత్తే లక్ష్యం


అధికారులు సమన్వయంతో పనిచేయాలి వ్యవసాయశాఖ మంత్రి పోచారం



సచివాలయంలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో నాణ్యమైన విత్తనోత్పత్తే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ విత్తన భాండాగారంగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విత్తనోత్పత్తి, విత్తన ఎగుమతి తదితర అంశాలపై శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి, వ్యవసాయశాఖ కమిషనర్ జగన్మోహన్, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామ్‌రెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రవీణ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పోచారం మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనోత్పత్తికి తగిన చర్యలు తీసుకోవాలని విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు మరింతగా నిబద్ధతతో పనిచేయాలన్నారు. రాబోయే యాసంగిలో ప్రభుత్వ విత్తనోత్పత్తి కేంద్రాల్లో పూర్తిస్థాయిలో విత్తనోత్పత్తి జరిగే విధం గా ప్లాన్ చేయాలని వారికి సూచించారు. గ్రామ రైతు సంఘాలను త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని, గ్రామ రైతులందరూ దీనిలో సభ్యులుగా ఉంటారని మంత్రి పోచారం తెలిపారు.


బ్రాహ్మణ సమాజానికి సీఎం కేసీఆర్ భరోసా



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నేతలు

ఖైరతాబాద్: సీఎం కేసీఆర్ బ్రాహ్మణ సమాజానికి భరోసా కల్పించారని మన బ్రాహ్మణ సంఘం సమా జం ప్రధాన కార్యదర్శి అవధానుల నర్సింహప్రసాద్ తెలిపారు. బ్రాహ్మిన్స్ యూనిటీ ఫరెవర్ కోఆర్డినేటర్ జీ కృష్ణమోహన్, బ్రాహ్మిన్ ఆర్గనైజేషన్ ఫర్ యూత్ సర్వీసెస్ వ్యవస్థాపకులు మల్లాది చంద్రమౌళి, వరల్డ్ బ్రాహ్మణ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కొన్నేటి శ్రీనివాస్, బాలానగర్ కార్పొరేటర్ నరేంద్రచారి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం పెద్దసముద్రాలకు చెందిన కూచనపల్లి శంకరశర్మ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయాన్ని సంఘం ప్రతినిధుల ద్వారా తెలుసుకున్న సీఎం.. వైద్యఖర్చుల కోసం రూ.15లక్షల ఆర్థికసాయాన్ని అందించారని నర్సింహప్రసాద్ చెప్పారు. సీఎం క్షేమంగా ఉండాలని రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. చొరవచూపిన ప్రభుత్వ సలహాదారులు కేవీ రమణాచారి, ఎమ్మెల్యే సతీశ్, సంఘం సభ్యులు వెంకటరమణ శర్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

టీఎస్‌ఆర్టీసీకి జాతీయ అవార్డు



అవార్డును అందుకుంటున్న టీఎస్ ఆర్టీసీ ఎండీ రమణారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దూరప్రాంతాలకు వజ్ర ఏసీ మినీ బస్సుల సేవలు అందిస్తున్నందుకు టీఎస్‌ఆర్టీసీకి జాతీయస్థాయిలో 'నేషనల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఎక్స్‌లెన్స్ అవార్డు-2017' దక్కింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణరావు శుక్రవారం ఢిల్లీలో అవార్డును అందుకున్నారు. ప్రశంసాపత్రం, రూ.ఐదు లక్షల నగదు బహుమతిని కేంద్ర రోడ్డురవాణా మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి లీనానందన్, ఆ శాఖ జాయింట్ సెక్రటరీ అభయ్ డాంలే చేతులమీదుగా ఆయన స్వీకరించారు. అవార్డు రావడానికి సహకరించిన అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులకు రమణారావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్లు ఎన్ సుదర్శన్, పీ జీవన్‌ప్రసాద్ పాల్గొన్నారు. వజ్ర ఏసీ మినీ బస్సులను టీఎస్‌ఆర్టీసీ ప్రయోగాత్మకంగా తొలివిడుతలో హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-నిజామాబాద్ రూట్లలో ప్రవేశపెట్టారు. ఈ బస్సులను బస్‌స్టేషన్ల వరకు మాత్రమే కాకుండా.. ఒక కాలనీ నుంచి మరో కాలనీ వరకు నడుపుతున్నారు. వజ్ర బస్సుల టికెట్ బుకింగ్‌కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించారు. దీనిద్వారా టికెట్లు బుక్ చేసుకుంటే టికెట్ ధరలో రూ.25 రాయితీ కల్పిస్తారు. వీటికి మంచి స్పందన వస్తుండటంతో జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.

ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేయాలి

హైదరాబాద్: దేవాదాయశాఖ సవరించిన చట్టం 33/2007 ప్రకారం ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దేవాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అర్చకులను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని సీఎం దృష్టికి తీసుకొనివచ్చారు. ఆలయాల్లో సమస్యల పరిష్కారానికి ధార్మిక పరిషత్తు ఏర్పాటే మార్గమని ఆయన పేర్కొన్నారు. ధార్మిక పరాయణులు, వితరణశీలురు, ఆలయాలకు దానధర్మాలు చేసిన పెద్దలతో పరిషత్తును ఏర్పాటు చేయాలని విన్నవించారు.

ముగిసిన ఐసెట్ సీట్ల కేటాయింపు

హైదరాబాద్: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించిన తుది విడుత ఐసెట్ -2017 కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం సీట్ల కేటాయింపు చేశారు.

డీఈఈసెట్‌లో..

డీఎడ్ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇందులో మొత్తం 7,119 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు.

17న ఓపెన్ స్కూల్ నోటిఫికేషన్

ఓపెన్ స్కూల్ సొసైటీలోని ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ కోర్సు ల్లో ప్రవేశాల కోసం ఈ నెల 17న నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆ సొసైటీ డైరెక్టర్ తెలిపారు.

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	1003	1003	1705	1704.72	128.72	128.19
నారాయణపూర్	0	11314	1615	1611.38	37.646	32.74
జూరాల	5626	4572	1045	1040.55	9.66	7.023
తుంగభద్ర	7570	286	1633	1615.91	100.86	47.86
శ్రీశైలం	45	45	885	778.1	215.807	19.65
నాగార్జునసాగర్	463	463	590	500.40	312.045	115.94
పులిచింతల	0	0	175	111.36	45.77	2.10
ప్రకాశం బ్యారేజీ	8323	8323	57.05	54.85	3.070	2.49

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 328.110 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	0	3333	1522	1512.00	102.732	66.21
కడెం	9	703	700	686.23	7.6	4.53
ఎస్సారెస్పీ	0	194	1091	1055	90.313	9.29
సింగూరు	245	245	1717.93	1708.85	29.91	17.73
నిజాంసాగర్	0	234	1405	1380.10	17.803	1.310
ఎల్లంపల్లి	618	418	485	471.82	20.175	10.35
లోయర్‌మానేరు	0	129	920	893.55	24.07	7.354
ధవళేశ్వరం	42984	42521	45	45	2.93	2.93



చిత్రారామచంద్రన్‌కు పనులు జరుగుతున్న తీరును వివరిస్తున్న అధికారులు

కాళేశ్వరంతో తెలంగాణ సస్యశ్యామలం

హౌసింగ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం ఒక యజ్ఞంలా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ రాష్ట్ర సస్యశ్యామం కాబోతోందని రాష్ట్ర హౌసింగ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామ శివారులో చేపట్టిన కాళేశ్వరం ఎనిమిదో ప్యాకేజీ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమెకు కాన్ఫరెన్స్ హాల్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు క్షేత్రస్థాయి నిర్మాణ పనులను సంబంధిత అధికారులు వివరించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో సొరంగ మార్గం ద్వారా నేల మట్టానికి సుమారు 76 మీటర్ల లోతులో ఉన్న సర్వీస్‌బేను సందర్శించారు. అనంతరం 111 మీటర్ల లోతులో ఉన్న పంపుహౌస్‌ను చేరుకొని సొరంగ మార్గం ద్వారా వచ్చే నీటి వివరాలు, ఎత్తిపోయడానికి ఉపకరించే మోటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఒక అత్యద్భుత ప్రాజెక్టును తొలిసారిగా చూశానన్నారు. ఇంతటి మహత్తరమైన ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణకు కొత్త వెలుగు వచ్చినట్టుగా ఉందన్నారు. రాష్ట్ర హౌసింగ్ సీఈ సత్యమూర్తి, ఎస్ఈ మాణిక్‌రెడ్డి, ప్రాజెక్టు డీఈ నర్సింగరావు తదితరులు ఆమె వెంట ఉన్నారు.



350 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

350 అడుగుల జెండా

స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటిన విద్యార్థులు

తల్లాడ : విద్యార్థులు, యువకులు స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటారు. ఖమ్మం జిల్లా తల్లాడ పురవీధుల్లో 350 అడుగుల పొడువు గల జాతీయ పతాకంతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమం 75ఏండ్లు పూర్తయిన సందర్భంగా వందలాది మంది విద్యార్థులు ఈ ప్రదర్శన చేపట్టారు. దాసరి వీరభద్రరావు యూత్ క్లబ్, ఐడియా సేవాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక కేఎస్ఎం కళాశాల, బాలభారతి విద్యాలయ విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ సన్నాహక వేడుకలు నిర్వహించారు.

వచ్చే ఎన్నికల్లోనూ గెలుపు మాదే

ప్రతిపక్షాలకూ భగీరథ నీళ్లు తాగిస్తాం: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

అచ్చంపేట, నమస్తే తెలంగాణ: 2019 ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ గెలుపొంది అధికారాన్ని చేపడుతుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రతిపక్షాలకు ఇప్పుడున్న సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో మిషన్ భగీరథ పనులను ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వచ్చేఎన్నికల నాటికి ఇంటింటికీ నల్లా ద్వారా తాగునీటిని అందించకపోతే ఓట్లు అడుగనని చెప్పిన దమ్మున్న సీఎం కేసీఆర్ అని చెప్పారు. జిల్లాలో భగీరథ పనులు శరవేగంగా సాగుతున్నాయని, అచ్చంపేట నియోజకవర్గంలో 70శాతం పనులు పూర్తయ్యాయన్నారు. వంద శాతం నీళ్లు తాపడమే కాదు.. ప్రతిపక్షాల ఇండ్లకు కూడా నీళ్లను అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించి మొక్కలు నాటారు. విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు.



నాగర్‌కర్నూల్ జిల్లా మైనార్టీ గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కనాటి నీళ్లుపోస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

కేడీసీసీబీకి జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు జాతీయ స్థాయి ఉత్తమ సహకార బ్యాంకు అవార్డు వచ్చింది. శుక్రవారం చెన్నైలో జరిగిన సహకార బ్యాంకుల జాతీయ సమాఖ్య కార్యవర్గ సమావేశంలో తమిళనాడు రాష్ట్ర సహకార శాఖ మంత్రి సెల్లూరు కే రాజు, ఆర్థిక మంత్రి డీ జయకుమార్ చేతుల మీదుగా కేడీసీసీబీ అధ్యక్షుడు, టీస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సీఈవో సత్యనారాయణరావులు ఈ అవార్డు అందుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు గతంలో ఈ అవార్డు వచ్చింది. ఆ తరువాత కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ఈ అవార్డు వరించింది. సహకార బ్యాంకు పదేండ్లపాటు అందించిన ఉత్తమ సేవలను పరిశీలించిన సహకార బ్యాంకుల సమాఖ్య 2015-16 ఆర్థిక సంవత్సరానికిగాను ఈ అవార్డుకు ఎంపికైంది. తెలంగాణలో ఒక జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ఈ అవార్డు రావడం ఇదే ప్రథమం.



చెన్నైలో నిర్వహించిన సమావేశంలో తమిళనాడు మంత్రుల చేతులమీదుగా అవార్డును అందుకుంటున్న కేడీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు, సీఈవో సత్యనారాయణరావు

భూనిర్వాసితులకు ఉద్యోగ పత్రాలు

కొత్తగూడెం ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్)లో 27 మంది భూ నిర్వాసితులకు శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలను కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకటరావు అందజేశారు. కేటీపీఎస్ ఐదో దశ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కేటీపీఎస్ సీఈ టీఎస్ఎన్ మూర్తితో కలిసి పాల్గొన్నారు. కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ విషయంలో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. తప్పుడు మాటలు విని అనవసరంగా తమ కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. అన్యాయం జరిగిన వారు తమ దృష్టికి తీసుకొస్తే వారికి న్యాయం చేస్తామన్నారు. కేటీపీఎస్ యాష్‌పాండ్ భూ నిర్వాసితులకు కూడా ఉద్యోగాలు ఇచ్చేందుకు అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నవారితో ఎమ్మెల్యే జలగం

బాసర పూజారులపై కేసు

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి, చండీ పారాయణదారుడు ప్రణవ్‌శర్మలపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై నర్సయ్య తెలిపారు. నల్లగొండ జిల్లా దేవరకొండలోని ఓ ప్రైవేటు పాఠశాలకు సదరు పూజారులు నిబంధనలకు విరుద్ధంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లి అక్షరశ్రీకార పూజలు నిర్వహించినట్టు ఈనెల 9న ఆలయ అధికారులు ఫిర్యాదు చేశారన్నారు. ఆ ఫిర్యాదుపై విచారణ చేపట్టి 408, 409, రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఏఎస్సై పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శాంతాసిన్హా

ఇంగ్లిష్ మీడియం భేష్

కొత్తగూడెం ప్రతినిధి, నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాతకొత్తగూడెంలో నెలకొల్పిన ఇంగ్లిష్ మీడియం పాఠశాలను ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేయాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ జాతీయ కమిషన్ మాజీ చైర్‌పర్సన్, రామన్ మెగసెసే, పద్మశ్రీ అవార్డుల గ్రహీత శాంతాసిన్హా చెప్పారు. జిల్లా కేంద్రంలోని తొలి ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ హైస్కూల్‌గా, ప్రీస్కూల్‌తో ఎడ్యుకేషన్ హబ్‌గా రూపొందనున్న పాతకొత్తగూడెం హైస్కూల్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. విద్యార్థుల అభిప్రాయాలను, కుటుంబ నేపథ్యాన్ని, చదువుకుంటున్న తీరును అడిగి తెలుసుకుంటున్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎం వెంకటరంగయ్య ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్ వెంకటరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పతకంపై ఆశలు రేపిన దేవేందర్ సింగ్
జావెలిన్ త్రోలో ఫైనల్‌కు
నిరాశపరచిన నీరజ్
ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్


నిలబెట్టాడు



ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మొదలై వారం దాటిపోయినా, మనోళ్ల మెరుపులు లేవన్న నిరాశలో ఉన్న భారత అభిమానులకు ఓ చిన్న ఆశ. పంజాబ్ అథ్లెట్ దేవేందర్ సింగ్ కాంగ్ జావెలిన్ త్రోలో ఫైనల్స్‌కు దూసుకెళ్లి పతకంపై ఆశలు రేపాడు. ఎన్నో అంచనాలున్న నీరజ్ చోప్రా అనూహ్యంగా విఫలమవగా.. అండర్‌డాగ్‌గా బరిలోకి దిగిన దేవేందర్ అర్హతరౌండ్‌ను అధిగమించి భారత్ పరువు నిలబెట్టాడు.

లండన్: ఏమాత్రం అంచనాలు లేని దేవేందర్ సింగ్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సంచలనం సృష్టించాడు. పంజాబ్‌కు చెందిన దేవేందర్ పురుషుల జావెలిన్ త్రోలో అనూహ్యంగా ఫైనల్స్‌కు అర్హత సాధించి పతకం రేసులో నిలిచాడు. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి జరిగిన జావెలిన్ త్రో క్వాలిఫయింగ్ రౌండ్‌లో దేవేందర్ ఇనుప రాడ్‌ను 84.22 మీటర్ల దూరం త్రో చేసి ఫైనల్ బెర్త్ దక్కించుకున్నాడు. జావెలిన్ త్రోలో ఫైనల్ చేరేందుకు క్వాలిఫికేషన్ మార్క్ 83 మీటర్లు. గ్రూప్-బి నుంచి క్వాలిఫికేషన్‌లో పోటీపడ్డ దేవేందర్ తొలి ప్రయత్నంలో 82.22 మీటర్లు త్రో చేశాడు. ఇక రెండో ప్రయత్నంలో అంతకంటే తక్కువగా 82.14 మీటర్లు త్రో చేసి న దేవేందర్ మూడో ప్రయత్నంలో మాత్రం ఏకంగా 84.22 మీటర్లు త్రోచేసి సఫలమయ్యాడు. దీంతో ఈ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్స్‌కు అర్హత సాధించిన తొలి భారత అథ్లెట్‌గా 26ఏండ్ల దేవేందర్ నిలిచాడు. అంతేకాదు, ప్రపంచ అథ్లెటిక్స్‌లో పురుషుల జావెలిన్ త్రోలో ఫైనల్ బెర్త్ దక్కించుకున్న తొలి భారత అథ్లెట్‌గానూ దేవేందర్ రికార్డు సృష్టించాడు. ఈ ఏడాది జూన్‌లో నిషిద్ధ ఉత్ప్రేరకం మారిజువానా సేవించడంతో దేవేందర్ అసలు ప్రపంచ ఈవెంట్‌లో పాల్గొనేదే అనుమానంగా మారింది. కానీ, వాడానిర్దేశించిన జాబితాలో మారిజువానా లేకపోవడంతో సస్పెన్షన్ నుంచి తప్పించుకుని దేవేందర్ లండన్ ఫ్లైట్ ఎక్కాడు. ఎలాగోలా టోర్నీకి ఎంపికైనా ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన దేవేందర్ క్వాలిఫయింగ్ రౌండ్లో అనూహ్యంగా సత్తాచాటి పతకరేసులో నిలువడం విశేషం. ఫైనల్ చేరిన మొత్తం 13మంది అథ్లెట్లలో దేవేందర్‌కు ఏడోస్థానం దక్కింది. ఈనెల 12వ తేదీన ఫైనల్ జరుగనుంది.

నీరజ్ విఫలం:



జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రికార్డు ప్రదర్శనతో స్వర్ణం కొల్లగొట్టిన 19 ఏండ్ల నీరజ్ చోప్రా సీనియర్ టోర్నీకొచ్చేసరికి తేలిపోయాడు. జావెలిన్ త్రోలో కచ్చితంగా పతకం సాధిస్తాడనుకున్న ఈ హర్యానా స్టార్ అనూహ్యంగా ఫైనల్ చేరకుండానే ప్రపంచ టోర్నీ నుంచి వెనుదిరిగాడు. తొలి ప్రయత్నంలో 84.22 మీటర్లు త్రోచేసి క్వాలిఫయింగ్ మార్క్‌కు చేరువగా వచ్చిన నీరజ్, రెండో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. ఇక చివరిదైన మూడో ప్రయత్నంలో మరీ పేలవంగా 80.54 మీటర్లు త్రో చేసి ఫైనల్స్‌కు అనర్హతకు గురయ్యాడు.



నీరజ్ అర్హత సాధించలేదని తెలియడంతో కచ్చితంగా నేనైనా ఫైనల్ చేరాలనుకున్నా. దేశం కోసం ఎంతోకొంత చేయాలనుకున్నా. జావెలిన్ త్రోలో భారత అథ్లెట్ మునుపెన్నడూ చేయని ప్రదర్శన ఇవ్వాలనుకున్నా. దేవుని దయ వల్ల ఫైనల్‌కు అర్హత సాధించి దేశానికి ఎంతో కొంత చేశాను.

- దేవేందర్ సింగ్ కాంగ్

స్నేహితుడి చిట్కాలతో..

(నమస్తే తెలంగాణ క్రీడావిభాగం)

ఓవైపు సలహాలు ఇచ్చేందుకు కోచ్ లేడు.. మరోవైపు కదలకుండా పట్టేసిన భుజం.. అప్పటికే విఫలమైన రెండు ప్రయత్నాలు.. ఇక ఫైనల్స్‌కు చేరడం కష్టమే అనుకుంటున్న తరుణంలో తన స్నేహితుడు ఇచ్చిన చిట్కాలతో దేవేందర్ సింగ్ కాంగ్.. లండన్ చాంపియన్‌షిప్‌లో అరుదైన దృశ్యాన్ని ఆవిష్కృతం చేశాడు. క్వాలిఫయింగ్-బి రౌండ్‌లో ఆఖరి వ్యక్తిగా బరిలోకి దిగిన దేవేందర్.. మంచి ఉత్సాహంతో తొలిరౌండ్‌లో ఐరన్ రాడ్‌ను బాగానే విసిరాడు. కానీ అర్హత మార్క్‌ను సాధించలేకపోయాడు. ఇక రెండోరౌండ్‌కు వచ్చేసరికి భుజం పట్టేసింది. దీంతో చేతిని దూరంగా చాచడానికి ఏమాత్రం వీల్లేకుండా పోయింది. అయినా పట్టుదలగా పోరాటం చేసినా మళ్లీ నిరాశే. అప్పటికే భారత స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా నిరాశజనక ప్రదర్శనతో ఫైనల్ బెర్త్‌ను సాధించలేకపోయాడు. ఇక తాను కూడా అదే దారిలో నడువాల్సి వస్తుందేమోనన్న బాధను దిగమింగుకుంటూ.. తన స్నేహితుడు, శ్రీలంక తరపు బరిలోకి దిగిన వరుణ రంకోత్ పెడిజిని సలహా అడిగాడు. అతను ఏమాత్రం తడుముకోకుండా స్ట్రెచింగ్‌కు సంబంధించి ఓ రెండు చిట్కాలు చెప్పాడు. 'తొలి రెండు ప్రయత్నాల్లో నీ శరీర బరువు ఎడమవైపు వేశావు. అందుకే రాడ్‌ను సరైన దిశలో విసురలేకపోయావు. దాన్ని మార్చుకోమని చెప్పాడు' దీన్ని పాటించిన మనోడిలో కొత్త ఉత్సాహం ఉరకలేసింది. 83 మీటర్ల మార్క్‌ను ఛేదిస్తే నేరుగా ఫైనల్స్‌కు అర్హత సాధించే అవకాశం ఉన్నా.. దేవేందర్ మాత్రం మూడో ప్రయత్నంలో ఐరన్ రాడ్‌ను ఏకంగా 84.22 మీటర్ల దూరం విసిరి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. కిక్కిరిసిన స్టేడియం ఒక్కసారిగా హోరెత్తిపోయింది. 'పెడిజి నాకు మంచి స్నేహితుడు. 10 అంతర్జాతీయ పోటీల్లో మేం తలపడ్డాం. రెండో త్రో తర్వాత భుజం కదల్లేదు. నా భుజం కాస్త సాగడానికి చిట్కాలు చెప్పమని అడిగా. మూడో ప్రయత్నంలో నా శరీర బరువు సమతుల్యంగా ఉండేలా ప్రయత్నించా. రాడ్ అమాంతం గాల్లో ఎగిరిపోయింది. ఫైనల్ బెర్త్ వచ్చేసింది. మొత్తానికి అతని చిట్కా అద్భుతంగా పని చేసింది' అని దేవేందర్ పేర్కొన్నాడు. మే నెలలో ఇండియన్ గ్రాండ్‌ప్రి సందర్భంగా జారిపడటంతో భుజానికి గాయమైందని చెప్పిన దేవేందర్.. రెండో రౌండ్ తర్వాత ఫిజియో గట్టిగా టేప్ వేయడం లాభించిందన్నాడు. ఫైనల్లోను మంచి ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తానని చెప్పాడు.

క్రికెటర్ కమ్రుద్దీన్‌కు మంత్రి హరీశ్‌రావు ఆర్థికసాయం

నమస్తే తెలంగాణ, సిటీబ్యూరో: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాష్ట్రస్థాయి క్రికెటర్ కమ్రుద్దీన్‌ను రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. మెదక్ ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్‌తో కలిసి శుక్రవారం నగరంలోని న్యూలైఫ్ దవాఖానకు చేరుకున్న మంత్రి.. క్రికెటర్‌కు అందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇంతకు ముందు జహీరాబాద్ పర్యటనలో బాధితుని కుటుంబ సభ్యులకు రూ. లక్ష అందజేసిన మంత్రి హరీశ్‌రావు.. చికిత్స నిమిత్తం మరో రూ. 2.5 లక్షలకు 'లెటర్ ఆఫ్ క్రెడిట్'ను ఇచ్చారు.



దవాఖానాలో కమ్రుద్దీన్‌ను పరామర్శిస్తున్న రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మెదక్ ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఇంగ్లండ్ బుడుతడి సూపర్ రికార్డు

6 బంతులు.. 6 వికెట్లు



రాబిన్‌సన్

లండన్: క్రికెట్‌లో ఏదైనా సాధ్యమే అనిపించేలా ఓ అనితర సాధ్యమైన ఫీట్ నమోదైంది. ఇప్పటివరకు ఓ ఓవర్లో ఆరు సిక్సర్లు మాత్రమే మనం చూశాం. కానీ, పదికి పది వికెట్ల ప్రదర్శనను తలపించేలా, ఈశాన్య ఇంగ్లండ్‌కు చెందిన ల్యూక్ రాబిన్‌సన్ అనే 13 ఏండ్ల బుడతడు ఆరు బంతుల్లో ఆరు వికెట్లు కూల్చి సంచలనం సృష్టించాడు. ఈవారం జరిగిన ఫిలడెల్ఫియా క్రికెట్ క్లబ్ అండర్-13 విభాగంలో ఈ అరుదైన ఫీట్ నమోదు చేశాడు. ఈ చిన్నారి వరుసగా ఆరుగురు బ్యాట్స్‌మన్‌నూ క్లీన్‌బౌల్డ్ చేయడం మరో విశేషం.

చరిత్ర సృష్టిస్తారా?

నేటినుంచి లంకతో భారత్ మూడో టెస్టు
జోరుమీదున్న కోహ్లీసేన
పరువు కోసం లంకేయుల యత్నాలు

ఇప్పటివరకు విదేశాల్లో భారత్ మూడు, అంతకంటే ఎక్కువ టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయలేదు. దిగ్గజాలు ప్రయత్నించినా సాధ్యంకాని ఈ అద్భుతమైన ఫీట్ కోసం విరాట్‌సేన మ్యాచ్ దూరంలో నిలిచింది. మరి ఈ అరుదైన అవకాశాన్ని టీమ్‌ఇండియా సద్వినియోగం చేసుకుంటుందా? గత మ్యాచుల్లో చూపెట్టిన ఆధిపత్యాన్ని శనివారం నుంచి జరిగే మూడో టెస్టులోనూ కొనసాగించి చరిత్రను తిరుగరాస్తారా?



క్యాండీ: ఓవైపు తమ టెస్టు క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించాలన్న ఆరాటంలో భారత్.. మరోవైపు సొంతగడ్డపై పరువును కాపాడుకునే ప్రయత్నంలో శ్రీలంక.. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య మూడోటెస్టుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే సిరీస్‌ను 2-0తో చేజిక్కించుకున్న టీమ్‌ఇండియా.. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి క్లీన్‌స్వీప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. తొలి రెండు టెస్టుల్లో పూర్తి ఆధిపత్యం చూపెట్టిన విరాట్‌సేన పల్లెకెలెలోనూ దాన్ని పునరావృతం చేయాలని పట్టుదలగా ఉంది. మరోవైపు సంధిదశలో ఉన్న లంక తమ ప్రధాన ఆటగాళ్లు గాయపడటంతో ఈసారి పూర్తిగా పిచ్‌ను నమ్ముకుంది. ఈ మ్యాచ్ కోసం పూర్తి పచ్చికతో కూడిన బౌన్సీ వికెట్‌ను రూపొందించారు. దీనికి తోడు నిలకడలేని వాతావరణంతో ప్రత్యర్థులు ఇబ్బందిపడతారని ఆతిథ్య జట్టు భావన. వర్షం కారణంగా శుక్రవారం భారత్ ప్రాక్టీస్ సెషన్ కూడా రద్దయ్యింది.

ముగ్గురు పేసర్లతో..!

ఈ మ్యాచ్ కోసం కోహ్లీ కొత్త కసరత్తులు మొదలుపెట్టాడు. తుది జట్టులో రెండు, మూడు మార్పులు చేసేందుకు సిద్ధమవుతున్నాడు. జడేజాపై సస్పెన్షన్ వేటు పడటంతో చైనామెన్ కుల్దీప్‌కు నేరుగా తుది జట్టులో అవకాశం ఉంటుందని భావించారు. కానీ విరాట్ ప్రణాళికలు మరోలా ఉన్నాయి. పిచ్, వాతావరణ పరిస్థితులను బట్టి ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగితే ఎలా ఉంటుందని యోచిస్తున్నాడు. హార్దిక్ స్థానంలో భువనేశ్వర్‌ను తీసుకుని, ఇద్దరు స్పిన్నర్లు అశ్విన్, కుల్దీప్‌తో ముందుకెళ్లాలని భావిస్తున్నాడు. భువీ బ్యాటింగ్ చేసే సత్తా ఉండటం అదనపు బలం. బౌన్సీ వికెట్‌పై కుల్దీప్ బౌలింగ్ కూడా అద్భుతంగా ఉంటుంది. ధర్మశాల మ్యాచ్‌తో ఇది నిరూపితమైంది కూడా. లేదంటే ఉమేశ్‌ను తప్పించి హార్దిక్‌ను కొనసాగించినా ఆశ్చర్యం లేదు. బ్యాటింగ్‌లో ఎలాంటి మార్పుల్లేవు. రోహిత్‌కు ఈసారి కూడా అవకాశం లేనట్లే. రాహుల్, ధవన్ ఇచ్చే శుభారంభంపైనే ఈ మ్యాచ్ విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

మెండిస్‌పైనే భారం..

ఇప్పటికే సిరీస్ చేజార్చుకున్న లంక.. ఈ మ్యాచ్‌లో గెలిచి పరువు కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నది. దీంతో హెరాత్, ప్రదీప్ స్థానంలో చమీరా, గమాగేలను జట్టులోకి తీసుకున్నది. పిచ్ స్వరూపాన్ని బట్టి పూర్తిగా పేసర్లను బరిలోకి దించాలని చండిమల్ ఆలోచన. రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆకట్టుకున్న కరుణరత్నే, మెండిస్ మరోసారి బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. మాథ్యూస్, తరంగ నిలిస్తే గెలిచే అవకాశాలుంటాయి. బౌలింగ్‌లో ఫెర్నాండో, కుమారపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ఓవరాల్‌గా భారత్‌ను నియంత్రించాలంటే ఈ మ్యాచ్‌లో లంకేయులు శక్తికి మించి కష్టపడాలి.

'నాలుగే'శారు

ఇప్పటివరకు విదేశాల్లో టెస్టు సిరీస్ (మూడు అంతకంటే ఎక్కువ)ను క్లీన్‌స్వీప్ చేయలేకపోయిన భారత్.. స్వదేశంలో మాత్రం నాలుగుసార్లు ఈ ఘనత అందుకుంది. 1993, 94లో అజరుద్దీన్ సారథ్యంలోని టీమ్‌ఇండియా వరుసగా ఇంగ్లండ్, శ్రీలంకపై 3-0తో సిరీస్‌ను వైట్‌వాష్ చేసింది. 2013లో ధోనీ హయాంలో ఆసీస్‌ను 4-0తో ఓడించింది. 2016లో విరాట్‌సేన 3-0తో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. విదేశీ సిరీస్‌ల విషయానికొస్తే.. 1986లో ఇంగ్లండ్ వేదికగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను కపిల్ బృందం 2-0తో గెలిచింది. ఆ తర్వాత 2004లో పాక్‌పై 2-1తో; 2015లో లంకలో 2-1తో సిరీస్‌లు నెగ్గాం. 1967లో పటౌడీ నేతృత్వంలోని భారత్.. న్యూజిలాండ్‌లో 3-1తో సిరీస్ కైవసం చేసుకుంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 2004-05లో బంగ్లాదేశ్‌ను, 2005-06లో జింబాబ్వేను, 2009-10లో మళ్లీ బంగ్లాను ఓడించాం.

ఇండోనేషియా కరాటేలో వివేక్‌కు పతకం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఖేల్ ప్రతినిధి: మన రాష్ర్టానికి చెందిన కరాటే ఆటగాడు వివేక్ తేజ మరోసారి అంతర్జాతీయ వేదికపై సత్తాచాటాడు. నల్లగొండ జిల్లాకు చెందిన వివేక్ ఇండోనేషియాలో జరిగిన మూడో బీకేసీ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో పతకంతో మెరిశాడు. పురుషుల కుమిటీ ఈవెంట్ 84+ కిలోల కేటగిరీలో వివేక్ మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నాడు.

ఐపీఎల్ హక్కుల కోసం 20కంపెనీలు

న్యూఢిల్లీ: ఐపీఎల్ ప్రత్యక్ష ప్రసార హక్కుల కోసం మరో రెండు రెండు కంపెనీలు పోటీకి దిగాయి. కొత్తగా యప్ టీవీ, డిస్కవరీ కమ్యూనికేషన్ 'ఇన్విటేషన్ టు టెండర్' ఫారాలను తీసుకున్నాయి. దీంతో మొత్తం 20 కంపెనీలు ఐపీఎల్ హక్కుల కోసం పోటీపడుతున్నాయి. అక్టోబర్ 2016న ఫారాలను కొనుగోలు చేసిన 18 కంపెనీలు కూడా ఎలాంటి అధిక డబ్బును చెల్లించకుండా ఈనెల 22 వరకు టెండర్లను దాఖలు చేయొచ్చని బీసీసీఐ వెసులుబాటు కల్పించింది. 2018లో కట్టబెట్టే ఈ హక్కులు 2022 వరకు అమల్లో ఉంటాయి.

యు ముంబాపై గుజరాత్ గెలుపు



అహ్మదాబాద్: ప్రో కబడ్డీలో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ జట్టు అదురగొడుతున్నది. శుక్రవారం సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌లో పటిష్ఠమైన యు ముంబా జట్టుపై 39-21 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గుజరాత్‌లో రోహిత్ 9, సచిన్ 8, సుకేశ్ హెగ్డే 4 రైడింగ్ పాయింట్లతో యు ముంబా డిఫెన్స్‌ను ఆటాడించారు. ఆట ప్రారంభమైన ఆరో నిమిషంలోనే యు ముంబా జట్టు ఆలౌట్ కావడంతో ఆ జట్టు 1-9 తేడాతో వెనుకబడింది. ఇదే ఊపుతో ఆడిన జెయింట్స్ జట్టు ప్రథమార్థం ముగిసేసరికి 20-6 తేడాతో స్పష్టమైన ఆధిక్యాన్ని అందుకుంది. రెండో అర్ధభాగంలో యు ముంబా పోరాడినా పాయింట్ల అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది.


ప్రపంచ పోలీసు క్రీడల్లో బాబాకు కాంస్యం



నిజామాబాద్ స్పోర్ట్స్, నమస్తే తెలంగాణ: నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డికి చెందిన మహ్మద్ బాబా అంతర్జాతీయ టోర్నమెంట్‌లో మెరిశాడు. అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో జరుగుతున్న ప్రపంచ పోలీసు క్రీడల్లో బాబా పతకం సాధించాడు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో బాబా మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నాడు. ఇదే టోర్నీలో ఆదివారం జరిగే 100 మీటర్ల రేసులోనూ బాబా పోటీపడనున్నాడు. బాబా కామారెడ్డి జిల్లాలోని స్పెషల్ బ్రాంచ్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

దేవుడి కన్నా మీరు గొప్పేం కాదు

బీసీసీఐపై శ్రీశాంత్ మండిపాటు



న్యూఢిల్లీ: తనపై జీవితకాల నిషేధం ఎత్తివేయాలన్న కేరళ హై కోర్టు తీర్పును సవాల్ చేసేందు కు సిద్ధమైన భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ)పై పేసర్ శ్రీశాంత్ మండిపడ్డాడు. న్యాయస్థానాలు ఇచ్చిన ఆదేశాలను కూడా లెక్కచేయకుండా తనపై కక్షపూరితంగా వ్యవహరించాలనుకోవడం సరికాదంటూ బీసీసీఐని శ్రీశాంత్ దుయ్యబట్టాడు. తాను చెప్పిందే వేదమన్నట్లుగా భావించే బీసీసీఐ.. దేవుడిని మించిందేమీ కాదు అని శ్రీశాంత్ ట్విట్టర్‌లో ఆక్రోశం వెల్లగక్కాడు. 'బీసీసీఐ గుర్తుంచుకో.. నేనేమీ అడుక్కోవడం లేదు, ఆడేందుకు నాకున్న అవకాశాన్ని తిరిగివ్వండని అడుగుతున్నాను. ఇది నా హక్కు. మీరేమీ దేవుడి కంటే గొప్ప కా దు. నేను మళ్లీ క్రికెట్ ఆడుతాను' అని 34ఏండ్ల శ్రీశాం త్ ట్వీట్ చేశాడు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్‌కు సంబంధించి శ్రీశాంత్‌పై బీసీసీఐ జీవితకాల నిషేధం విధించడంతో దీనిపై శ్రీశాంత్ కేరళ హైకోర్టుకెళ్లాడు. దీనిపై పూర్తిగా విచారించిన కేరళ న్యాయస్థానం.. శ్రీశాంత్‌పై జీవితకాల నిషేధం ఎత్తివేయాలంటూ బీసీసీఐని గత సోమవారం ఆదేశించింది. దీంతో కేరళ కోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేయాలని బీసీసీఐ నిర్ణయించిన సంగతి తెలిసిందే.

జోరుగా స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఖేల్ ప్రతినిధి: రాష్ట్రస్థాయిలో జరుగుతున్న స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ జోరుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నాడు స్పోర్ట్స్ స్కూల్ క్రీడా అధికారి రత్నబోస్ ఆధ్వర్యంలో ఐదోజోన్ పరిధిలోని జిల్లాల పిల్లలకు ఎంపిక పరీక్ష నిర్వహించారు. గతానికి భిన్నంగా ఈ ఏడాది క్రీడాపాఠశాల ప్రవేశాల కోసం పోటీ పడే విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లితండ్రులు, ఎంపికలో పాల్గొంటున్న పిల్లలతో క్రీడా పాఠశాల ప్రాంగణం కళకళలాడుతున్నది.

నాదల్‌కు 18 ఏండ్ల కుర్రాడి షాక్

మాంట్రియెల్: మాంట్రియెల్ మాస్టర్స్ ఓపెన్‌లో సంచలనం చోటు చేసుకుంది. ఈ సీజన్‌లో కేవలం మూడే మూడు విజయాలు సాధించిన కెనడాకు చెందిన 18ఏండ్ల టీనేజర్ డెనిస్ షపవలోవ్‌వ.. ప్రపంచ రెండో ర్యాంకర్ రాఫెల్ నాదల్‌కు ఊహించని షాకిచ్చాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో క్వాలిఫయర్ షపవలోవ్ 3-6, 6-4, 7-6 (7/4)తో టాప్‌సీడ్ నాదల్‌ను ఓడించాడు. దీంతో ఈ విజయంతో నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకోవాలన్న స్పెయిన్ బుల్ ఆశలు గల్లంతయ్యాయి. మరో మ్యాచ్‌లో ఫెదరర్ 4-6, 6-4, 6-2తో ఫెర్రర్‌పై గెలిచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు.


Always 100% ORIGINAL PRODUCTS . LOWEST PRICE . BEST BRANDS . BEST SERVICE . GENUINE OFFERS . GENUINE PRIZES
స్వాతంత్ర్య దినోత్సవ ఆఫర్!!!
2017 ఆగస్ట్, 12 నుండి 16 వరకు
డబుల్ ధమాక
LOWEST PRICE SALE
గెలవండి
ఫ్రీ షాపింగ్
రూ. 6 కోట్ల
వరకు
గెలవండి
మొదటి బహుమతి
రూ. 1 లక్ష విలువ చేసే
140 వరకు
బహుమతులు
ఫ్రీ షాపింగ్ @
పై ఫర్నిచర్
గెలవండి
రెండవ బహుమతి
రూ. 25,000
విలువ చేసే 140 వరకు
బహుమతులు
ఫ్రీ షాపింగ్ @
పై ఫర్నిచర్
పై ఇంటర్నేషనల్
లక్కీడ్రా అర్హత పొందేందుకు రూ. 2,000 ఆపై కొనుగోలు చేసి కూపన్ పొందండి.
TILL DATE GENUINELY DISTRIBUTED
204 CARS
FREE SHOPPING, GOLD & CASHBACK worth CRORES as BUMPER PRIZES
LOWEST PRICE CHALLENGE
Get 3 Times the Difference...
If you get cheaper price from any authorized dealer**
SELECT, SWIPE & PAY in
AFFORDABLE EMIs
on AMEX . AXIS . CITI . HDFC . ICICI
KOTAK . SBI . STANCHART
Credit Cards
No Documentation
Down Payment
Avail upto
24 MONTHS LOAN
with Minimal Documentation*
0% Interest
Processing Fee*
BAJAJ FINSERV
CAPITAL FIRST
HDFC BANK
HDB FINANCIAL SERVICES
కేవలం రూ.1* చెల్లించండి
మిగిలిన మొత్తం సులభ వాయిదాలలో
SAMSUNG Smart LED TV 43M5570
1+1 Warranty
Special Price ₹63,900
Just Pay ₹1 Balance in 10 MONTHS
LG Life's Good Smart 4k LED TV 43UJ752T
Special Price ₹86,290
Just Pay ₹1 Balance in 10 MONTHS
SONY Smart LED TV KLV-43W772E
1+1 Warranty
Special Price ₹59,990
Just Pay ₹1 Balance in 9 MONTHS
Panasonic Smart LED TV 49ES630D
Special Price ₹68,800
Just Pay ₹1 Balance in 10 MONTHS
HENRY LED TV
HOT SALE
FHD 1920 x 1080
DOLBY Digital Sound
3D Combo Filter
2-HDMI
2-USB Compatible
PC Input
0% Interest
24 Full HD LED ₹11,490 EMI ₹958
32 LED (IPS Panel) ₹15,990 EMI ₹1,333
43 LED (A+Panel) ₹26,990 EMI ₹2,249
50 Full HD LED ₹35,990 EMI ₹2,999
Single Door Refrigerator
EMI Starts From ₹1,149
Double Door Refrigerator
EMI Starts From ₹1,749
Washing Machine
EMI Starts From ₹816
Attractive Offers on All Smart Phones
mi
Redmi 4
Redmi 4a
Redmi Note 4
SAMSUNG S8
oppo F3
vivo V5S
VISIT PAI TO AVAIL BEST PRICE
Pearl Laptop Accessories Kit
MRP ₹1,990 Special Price ₹999
50% OFF
Bluetooth speakers
Headphone
Wireless mouse
Keyboard guard
Cleaning kit
hp 15-AU620TX
7th Gen Intel i5
8 GB DDR4 RAM
1 TB HDD
2 GB Nvidia 940MX Graphics Card
Windows 10
MS Office
Special Price ₹56,990
DELL INS-15 3567
6th Gen Intel i3
4 GB DDR3 RAM
1 TB HDD
Windows 10
MS Office
Special Price ₹35,990
అన్ని ఎయిర్ కండీషనర్లపై ఆకర్షణీయమైన ఆఫర్లు
అన్ని గృహోపకరణాలపై ఆకర్షణీయమైన ఆఫర్లు
AO Smith
HAVELLS
EUREKA FORBES
KENT
LG
Panasonic
PHILIPS
Preethi
ULTRA
V-GUARD
Service/Help Line: 040-4246 4343 (10am to 7pm)
AMPLE PARKING
www.paiinternational.in
అశోక్‌నగర్ (బి.హెచ్.ఇ.ఎల్) విజేత సూపర్ మార్కెట్ ఎదురుగా
అత్తాపూర్ పిల్లర్ నెం.141
ఎ.ఎస్.రావు నగర్ రత్నదీప్ సూపర్ మార్కెట్ ప్రక్కన
బోడుప్పల్ అపెక్స్ హాస్పిటల్ ప్రక్కన
బి.ఎన్.రెడ్డి నగర్ సాగర్ రోడ్, భారత్ పెట్రోల్ పంప్ ప్రక్కన
దిల్‌సుఖ్‌నగర్ అన్నపూర్ణ కాంప్లెక్స్ ఎదురుగా, సాయిబాబా టెంపుల్ దగ్గర
నాగారం కీసర రోడ్
కర్మన్‌ఘట్ జీవన్ హాస్పిటల్ ఎదురుగా
నిజాంపేట్ రోడ్ యాక్సిస్ బ్యాంక్ ఎదురుగా
కొంపల్లి సుచిత్ర సర్కిల్, కొంపల్లి రోడ్
కూకట్‌పల్లి బి.జె.పి. ఆఫీస్ ఎదురుగా
మదీనగూడ ప్రాణం హాస్పిటల్ ప్రక్కన
టోలిచౌకి గెలాక్సీ థియేటర్ ఎదురుగా
ఉప్పల్ ఉప్పల్ సర్కిల్ దగ్గర, నాగోల్ రోడ్
వనస్థలిపురం అభ్యుదయ నగర్
SAMSUNG బ్రాండ్ షాప్ అత్తాపూర్, పిల్లర్ నెం. 136
*Terms & Conditions apply: Finance scheme, low down-payment scheme, EMI, Tenure is at the sole discretion of Finance Company. 0% Interest available on paper finance only. Processing Fee applicable on select brands & models. Capital First, HDFC, HDB Finance available in select locations only. Bulk orders not applicable on Samsung mobiles. Offers & Gifts not applicable on Samsung & Sony products. Models shown are indicative only, actual shape, size, colour of the product may vary, Prices may change without prior notice. Pai reserves the right to alter the offer without any prior notice. Offer applicable on select brands & models only. Consumer offers are applicable as per the manufacturer's terms & conditions. Offer valid till the promotion stocks last. Pay Rs.1 offer is applicable on select brands and models, processing fee extra. Any dispute is subject to Bangalore jurisdiction only.



భూటాన్ విదేశాంగమంత్రితో సుష్మాస్వరాజ్ భేటీ

- డోక్లాం ప్రతిష్టంభనపై ప్రత్యేక చర్చ


భూటాన్ విదేశాంగ మంత్రితో చర్చిస్తున్న సుష్మ

ఖాట్మండు: విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ భూటాన్ విదేశాంగశాఖ మంత్రి డాంకో డోర్జీతో శుక్రవారం ఖాట్మండులో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక అంశాలతోపాటు డోక్లాంలో చైనా, భారత బలగాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై కూడా వారిరువురు చర్చించినట్లు సమాచారం. ఖాట్మండులో జరుగుతున్న బిమ్‌స్టెక్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరైన ఇరువురు నేతలు ప్రత్యేకంగా భేటీ అయినట్లు విదేశాంగశాఖ అధికారప్రతినిధి రవీశ్‌కుమార్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన చిత్రాలను కూడా ఆయన పోస్ట్ చేశారు. బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టారల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (బిమ్‌స్టెక్) గ్రూపులో బంగ్లాదేశ్, ఇండియా, మయన్మార్, శ్రీలంక, థాయ్‌లాండ్, భూటాన్, నేపాల్ సభ్యదేశాలుగా ఉన్నాయి.

'బ్లూవేల్' బాధితుడిని కాపాడిన పోలీసులు



పుణె, ఆగస్టు 11: సంచలనం సృష్టిస్తున్న బ్లూవేల్ ఛాలెంజ్ ఆన్‌లైన్ గేమ్ బారి నుంచి 14 ఏండ్ల విద్యార్థిని ఆత్మహత్య చేసుకోకుండా పోలీసులు కాపాడారు. మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాకు చెందిన 14 ఏండ్ల విద్యార్థి బ్లూవేల్ చాలెంజ్‌ను పూర్తిచేశాడు. తర్వాత ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో ఎట్టకేలకు అతడిని పట్టుకోగలిగారు. ప్రమాదకర ఆన్‌లైన్ గేమ్‌గా పేరున్న బ్లూవేల్ చాలెంజ్‌లో 50రోజులపాటు రోజుకో టాస్క్ ఇవ్వబడుతుంది. మొదట్లో చిన్న చిన్న టాస్కులుండగా, రాను రానూ వాటి తీవ్రత పెరుగుతుంది. ఫైనల్ 50వ రోజున చివరిటాస్క్‌గా ఆత్మహత్య చేసుకోవాల్సి ఉంటుంది. 'తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి ఈ బ్లూవేల్ చాలెంజ్‌ను పూర్తిచేసిన రోజునుంచే అదృశ్యమయ్యాడు. స్నేహితులను ప్రశ్నించగా, ఈ గేమ్ ఆడిన విషయం బయటకు వచ్చింది. పుణెకు చెందిన ఓ బస్సులో సదరు విద్యార్థి ప్రయాణిస్తుండగా భిగ్వాన్ వద్ద అతడిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు' అని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. భారత్‌లో బ్లూవేల్ చాలెంజ్ బారిన పడిన మూడో విద్యార్థి ఇతడు. గురువారం పాఠశాల భవనంపై నుంచి దూకేందుకు యత్నించిన ఇండోర్ విద్యార్థిని సహచరులు కాపాడారు. గత వారం ముంబై విద్యార్థి అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.

లోయలో పడిన వాహనం: ఆరుగురి మృతి

జమ్ము: రోడ్డుపై వెళ్తున్న వాహనం ప్రమాదవశాత్తు లోయలో పడిపోవడంతో ఆరుగురు మృతి చెందగా తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ ఘటన జమ్ముకశ్మీర్‌లోని దోడా జిల్లాలో శుక్రవారం చోటుచేసుకున్నది. చిరిలా నుంచి పుల్ దోడాకు 15 మంది ప్రయాణికులతో వెళ్తున్న వాహనం పునేజా గ్రామం వద్ద ఉన్న 150 అడుగుల లోయలో పడిపోయింది. వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు పేర్కొన్నారు. స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని జిల్లా దవాఖానకు తరలించారు. చనిపోయిన వారిలో ఐదుగురు దోడా జిల్లాకు చెందినవారే కాగా మరో వ్యక్తిని గుర్తించాల్సి ఉన్నది.

ఆర్టికల్-370లో మార్పు లేదు: జమ్ముకశ్మీర్ సీఎం

న్యూఢిల్లీ, ఆగస్టు 11: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకహోదా కల్పించే ఆర్టికల్-370 విషయంలో ఎలాంటి మార్పులు చేయబోమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చినట్టు ఆ రాష్ట్ర సీఎం మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. కశ్మీర్‌లో పీడీపీ-బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు సమయంలో ఆర్టికల్ 370 విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవద్దనేది తమ మధ్య కుదిరిన ఒప్పందమని చెప్పారు. శుక్రవారం ఆమె ప్రధానితో భేటీ అయ్యారు. జమ్ముకశ్మీర్ ప్రత్యేక హోదాపై వారు చర్చించినట్టు తెలిసింది. ప్రత్యేక పరిస్థితుల కారణంగానే జమ్ముకశ్మీర్‌కు ఆర్టికల్-35ఏ, 370 సంక్రమించాయని, ఆ ప్రత్యేకతను తప్పకుండా కాపాడుకుంటామని మెహబూబా ముఫ్తీ తెలిపారు.

గుజరాత్‌లో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామా

అహ్మదాబాద్, ఆగస్టు 11: గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కృతులైన ఏడుగురు ఎమ్మెల్యేలు శాసనసభ్యత్వాలకు రాజీనామా చేశారు. గురువారంరాత్రి వారు తన నివాసానికి వచ్చి రాజీనామా పత్రాలు సమర్పించారని గుజరాత్ అసెంబ్లీ స్పీకర్ రమణ్‌లాల్ వోరా శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 8న జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి అహ్మద్‌పటేల్‌కు కాకుండా బీజేపీ అభ్యర్థికి ఓటేసినందుకు వారిని కాంగ్రెస్ ఆరేండ్లపాటు బహిష్కరించిన సంగతి తెలిసిందే. వేటుపడిన ఏడుగురు ఎమ్మెల్యేల్లో అంతకుముందే పార్టీని వీడిన మాజీ సీఎం శంకర్‌సింగ్‌వాఘేలా కుమారుడు మహేంద్రసింహ్‌తోపాటు, రాఘవ్‌జీపటేల్, భోలాభాయ్‌గోయెల్, అమిత్‌చౌధరి, సీకేరావల్జీ, ధర్మేంద్రసింహ్ జడేజా, కర్మాసింగ్‌పటేల్ ఉన్నారు. కాంగ్రెస్‌కు ఇదివరకే రాజీనామా చేసిన ఆరుగురు ఎమ్మెల్యేల్లో ముగ్గురితో పాటు తాము ఏడుగురం కలిసి త్వరలో బీజేపీలో చేరుతామని మహేంద్రసింహ్ చెప్పారు. తన తండ్రి శంకర్‌సింగ్ వాఘేలా మాత్రం బీజేపీలో చేరడం లేదన్నారు.